ISSN No:2581-7477

సాహిత్య

# ప్రస్థానం

డిసెంబరు 2019

వెల రూ. 20

మాతృభాషా
మాధ్యమం

ప్రత్యేక సంచిక

## తెలుగు మీడియం వుండాల్సిందే!

## తీసేస్తే ఒప్పుకోం !!




సాహితీస్రవంతి



సాహిత్య ప్రస్థానం
డిసెంబర్ 2019
సంపుటి : 18 సంపాదకీయం సంచిక : 12

# తెలుగు మీడియం తొలగింపు ఒప్పుకోం! జాతి హక్కుకై పోరాడదాం!!

- తెలకపల్లి రవి
ప్రధాన సంపాదకుడు

తెలుగు సమాజ, సాహిత్యాల వికాసం కోసం జరిగే పోరాటం మొదటి నుంచి భాషతో ముడిపడి వుంది. సంఘ సంస్కరణ ఉద్యమంతో పాటే వ్యవహార భాషా ఉద్యమం నడిచింది. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటివారు రెంటిలోనూ ముందున్నారు. తర్వాత కాలంలో స్వాతంత్ర్య పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమం పల్లెపట్టుల వరకూ పాకి చైతన్యపు గాలులు వూదింది. నిజామాంధ్ర మహాసభ కూడా భాష, గ్రంథాలయాల ఉద్యమంగానే మొదలై విప్లవ పోరాటంగా మారింది. పొట్టిశ్రీరాములు బలిదానం తర్వాత దేశంలోనే మొదటి భాషా రాష్ట్రాన్ని సాధించేంత వరకూ నడిచింది. అది తర్వాత ఆంధ్రప్రదేశ్ అయింది. ప్రధాన పాలక పార్టీలు కూడబలుక్కుని రాష్ట్రాన్ని విభజించిన తర్వాత ఇప్పుడు కూడా విభజనానంతర ఆంధ్రప్రదేశ్ మరోసారి భాషా సమస్యకే కేంద్ర బిందువు కావడం ఆసక్తికరమైన వాస్తవం. అప్పుడు తెలుగుతల్లి భావనను ఆక్షేపించి తెలంగాణ తల్లిని తెచ్చుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రపంచ తెలుగు మహాసభలు జరిపి దాని ఔన్నత్యాన్ని కొనియాడారు. తెలంగాణలో తెలుగు ఉర్దూ మీడియంలు కొనసాగుతున్నాయి. అయితే ఆనాడు భాషా రాష్ట్ర విభజన వద్దని నిరాహారదీక్షలు చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలుగు మీడియంనే తొలగించేందుకు సిద్ధమైనారు. ఇదొక చారిత్రిక వైపరీత్యం. తెలుగు రాష్ట్ర విభజన ఒకందుకు ప్రారంభమైతే తెలుగు మీడియం ఎత్తివేత నిర్ణయం మరో పరిణామానికి సంకేతం. పాలక పార్టీల వ్యూహాలు, అవసరాలపై ఆధారపడిన రాజ్యాంగ నిర్ణయాలను ప్రభావితం చేయలేకపోయినా విద్యాలయాలనుంచి తెలుగును బోధనా భాషగా లేకుండా చేసే విపత్కర విధానాన్ని అడ్డుకోగల శక్తి అగత్యం రాష్ట్ర ప్రజల ముందుంది. అందుకే చాలా కాలం తర్వాత ఈ అంశంపై ఎప్పుడూ లేనంత చర్చ జరుగుతున్నది. వాద వివాదాలు సాగుతున్నాయి.ఎప్పటిలాగే పాలకులు తలాతోక లేని వాదనలతో చర్చ దారి తప్పిస్తున్నారు. ఏకపక్ష ధోరణిలో తెలుగును బోధనా భాషగా తొలగించేందుకు హడావుడి పడుతున్నారు. పిల్లల చదువుల కోసం, తల్లి భాష కోసం ఆరాటపడే వారందరిపై ఏవో ముద్రలు వేస్తున్నారు. అసందర్భమైన సవాళ్లు విసురుతున్నారు. అధ్యయనం, అవగాహన లేని ఆవేశంతో కొందరు, అవకాశవాదంతో మరికొందరు వంతపాడుతున్నారు. తెలుగు అభివృద్ధి కోసం నియమితులైన అధికార భాషా సంఘం అధ్యక్షులే ఆహా ఓహో అంటూ కీర్తిస్తున్నారు. అభ్యుదయవాదులుగా సామాజిక కార్యకర్తలుగా వుండే వారు కూడా తెలుగును బోధనా భాషగా లేకుండా చేస్తే సామాన్య ప్రజలకు కలిగే నష్టమేమిటో తెలుసుకోలేకపోతున్నారు. ఆ విధంగా ఇది తెలుగు సమాజానికి పరీక్షా సమయం. దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో ఇంతవరకూ ఎక్కడా మాతృభాషలో బోధన లేని పరిస్థితి చూడం. ఆ రీత్యా ఇది దేశానికి కూడా సవాలే. రాజ్యాంగంలో 344 నుంచి 347 వరకూ వున్న అధికరణాలు భాషా వినియోగం, వికాసం గురించి చెబుతున్నాయి. రాజభాషగా హిందీ అనుసంధాన భాషగా ఇంగ్లీషు వుంటూనే ప్రాంతీయ భాషల

అభివృద్ధికి రాజ్యాంగం హామీ నిచ్చింది. 1966 తర్వాత అందుకే అధికార భాషా సంఘాలు ఏర్పడ్డాయి.

ప్రాథమిక విద్య మాతృభాషలో జరిగితే సహజ నైపుణ్యం పెరుగుతుందనేది యునెస్కో నుంచి అధ్యయనాల వరకూ చెబుతున్న సత్యం. పెద్దవాళ్లయి ఇతర భాషలు ఎన్ని నేర్చినా ఇంగ్లీషులో ఎంత ప్రావీణ్యం సంపాదించినా అదంతా అమ్మభాష పునాదులపైనే జరగాల్సి వుంటుంది. ఇందుకు సంబంధించిన చాలా మంది మేధావులు, నిపుణులు రాసిన వ్యాసాలు ఈ సంచికలో చూడొచ్చు. సమస్య తెలుగు మీడియం తొలగింపునకు సంబంధించిందే గాని ఇంగ్లీషు మీడియం వుండకూడదని కానేకాదు. విద్యా బోధన సూత్రాల పరంగానూ, సామాజిక అనుభవాల రీత్యానూ, రాజ్యాంగ హక్కుల కోణంలోనూ, సాంస్కృతిక వారసత్వం దృష్టిలోనూ, సమగ్ర వికాసం కోసం కూడా తెలుగులో బోధన కొనసాగితీరాలి. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా తమిళాన్ని ప్రాచీన లేదా శ్రేష్ఠ భాషగా గుర్తించి నిధులు మంజూరుచేశారు. ఆ సమయంలో అందరం పోరాడి తెలుగుకు ఆ హోదా సాధించుకున్న తీరు గుర్తు చేసుకోవాలి. ప్రాచీన భాష ప్రతిపత్తి తెచ్చుకున్నది ఆధునికంగా అభివృద్ధి చేసుకోవడానికే గాని వస్తు ప్రదర్శనశాలలో ప్రదర్శించడానికి కాదు కదా! తెలుగును సబ్జెక్టుగా కొనసాగిస్తాము గనక ఎక్కడికి పోదు అనేది అపహాస్యపు సమర్థన. అదే మాట ఇంగ్లీషుకూ వర్తించదా? ఒక భాషలో కనీసం 30 శాతం మంది ఉన్నత విద్యలు, దైనందిన వ్యవహారాలు జరపకపోతే అభివృద్ధి ఆగిపోతుందనేది యునెస్కో హెచ్చరిక. ఆ విధంగా చాలా భాషలు రోజూ ప్రపంచీకరణ పదఘట్టనలో అంతరించిపోతున్నాయి. ఎనిమిది కోట్ల మంది మాట్లాడే తెలుగుకు ఆ ప్రమాదం వుండకపోవచ్చు గాని గిడచబారి పోదా? కాలానుగుణంగా పెరగని భాష కాలగర్భంలో కలసి పోయినట్టే కాదా? కేవలం భాషగా పద్యాలు, గేయాలు, పాటలు, కావ్యాలు చదివించేందుకు పరిమితమైతే తెలుగు ఎలా ఆధునిక భాషగా పెరుగుతుంది? తెలుగు వికసించకపోతే తెలుగు వారెలా ఎదుగుతారు? చాలా గొప్పదిగా రోజూ కీర్తించబడే సంస్కృతం ఎందుకు గత భాషగా, మృతభాషగా మిగిలిపోయింది? లాటిన్, గ్రీక్, పర్షియన్ ఇవన్నీ ఏమయ్యాయి? యువ ముఖ్యమంత్రి జగన్ తెలుగు కూడా అలాగే మిగిలిపోవాలని కోరుతున్నారా?

తెలుగు ఆధునిక రూపం తీసుకుని ఇంకా గట్టిగా వందేళ్లు కూడా కాలేదు. గురజాడ అప్పారావు వంటివారు 20వ శతాబ్దం ప్రారంభంలోనే అందుకు అంకురార్పణ చేశారు. ఆంగ్లేయుల పాలన తర్వాత. త్రిభాషా సూత్రం గజిబిజి వంటివి దాని సహజప్రగతికి ప్రతిబంధకాలైనాయి. 1970 ల నుంచే ఉన్నత స్థాయి పాఠ్య పుస్తకాలు అనువాదాల వంటివి కొంచెం పెరిగాయి. అంటే అర్థశతాబ్ది కూడా కాలేదు. 1980ల నుంచి రాజీవ్ గాంధీ నూతన విద్యా విధానం ఇంగ్లీషు మీడియం, కార్పొరేట్ పబ్లిక్ స్కూళ్లు, సర్కారు బళ్ళకు గ్రహణం మొదలైనాయి. ఏ పార్టీ ఏ నాయకుడు అనేది పక్కన పెడితే ఇది పాలకవర్గాలు పథకం ప్రకారం చేసిన హాని తప్ప ప్రజలు కోరుకున్నది కాదు. విద్య, వైద్యం కార్పొరేటీకరణకూ ఇంగ్లీషు మీడియం విస్తరణకు అవినాభావ సంబంధం వుంది. కావాలని ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి ప్రవేటుకు పట్టం కట్టి ఇంగ్లీషు మీడియంను నెత్తిన పెట్టారు. ప్రభుత్వ బళ్లు బాగాలేవు గనక కాన్వెంటుల పేరిట వీధి వీధినా వెలసిన అరకొర ఇంగ్లీషు మీడియం స్కూళ్లకే పిల్లలను పంపించారు తలిదండ్రులు. ప్రమాణాలు బాగున్న రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారే రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శులు అయ్యారని గుర్తు చేసుకోవాలి. వీటిని ఉపేక్షించి కార్పొరేట్ బళ్లకు దాసోహం అన్నది ఏలినవారే తప్ప తలిదండ్రులో పిల్లలోకాదు. దాని దుష్ఫలితాలు ఒత్తిళ్లు ఆత్మహత్యలు కూడా చాలా చూశాం. చూస్తున్నాం. ఏ ఒక్క విద్యార్థి తాను ఇంగ్లీషు మీడియం వల్లనే ర్యాంకు తెచ్చుకున్నానని చెప్పడం వినలేదు. తెలుగు మీడియంలో చదివిన చాలామంది రాణించకనూ పోలేదు. ఇంగ్లీషులో మాట్లాడితే గొప్ప, చదివితే గొప్ప వంటి భ్రమలు వుంటే తొలగించాలి. తొలగాలంటే తెలుగును అభివృద్ధి చేసుకోవాలి. ఎప్పటికైనా తెలుగు సమాజం తెలుగులో బతుకుతుంది తప్ప ఇంగ్లీషులో కాదు. తెలుగు జాతి సంపదలో

యాభై శాతం పైగా తెలుగు భాషలోనే సృష్టించబడుతుంది. మన సినిమాలు, పుస్తకాలు, పత్రికలు, ఛానళ్లు, వ్యవసాయం, ఆచార వ్యవహారాలు, సాహిత్యం అన్నీ తెలుగులోనే వుంటాయి. దేశంలో అవి ప్రముఖ స్థానంలో వున్నాయి కూడా. సాంకేతిక పరిజ్ఞానం శాస్త్ర విజ్ఞానం అనువాదం చేసుకోవాలి. ఆరవ తరగతి నుంచి ఇంగ్లీషు మీడియమే వుండేట్టయితే తెలుగు అకాడమీ వునికికి అర్థమే వుండదు. ఇప్పుడు అసలే ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. బోధన, పాలన, న్యాయ భాషగా తెలుగు వుండాలన్నది స్వాతంత్రోద్యమం నాటి ఆశయం. ఇప్పటికీ అవసరం. ఆ ప్రయత్నం అర్థంతరంగా ఆగిపోయింది.

మంత్రులు పదేపదే అంటున్నట్టు తలిదండ్రులలో ఇంగ్లీషు మీడియమే కావాలన్న ఆశ లేదా అంటే వుంది. కాని దీనిపై సమగ్ర అవగాహన వుందా? విద్యామంత్రి చెప్పే ప్రకారం ఏపిలో 62శాతం మంది ఇంగ్లీషులోనే చదువుతున్నారు. ఉన్నత వర్గాల వారిలో 80 శాతం, కింది వర్గాలలో సుమారు నలభై శాతం ఇంగ్లీషులోనే చదువుతున్నారు. కాని 25శాతం మంది మాత్రమే ఉన్నత విద్యకు వస్తున్నారు. మానే వారిలో ఎక్కువ మంది మళ్లీ దిగువ తరగతుల వారే. ఆ మీడియం వారిని ఎందుకు కాపాడలేకపోతున్నట్టు? మన ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నట్టు జాతీయ సగటు నిరక్షరాస్యత 27 శాతం కాగా, ఏపిలో 33 శాతం వుండటానికి ఇంగ్లీషు మీడియం ఒక కారణం అవునో కాదో అధ్యయనం చేశారా? కర్ణాటక, ఢిల్లీ, హైదరాబాద్‌లలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ అధ్యయనంలో ఇంగ్లీషువిద్య పేదలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని తేలింది.(పిటిఐ 25.11.2018) ఇంగ్లీషులో చెప్పడం వారి కుటుంబ వాతావరణాలతో పొసగక పోవడం ఒక కారణమని వెయ్యి మంది పిల్లలపై పరిశీలన తర్వాత తేల్చింది. కింది తరగతుల పిల్లలు వారికి ఏ భాష సులభంగా వుంటే దాంట్లో చదువుకోవాలి తప్ప ఇంగ్లీషులో చదివితే మేలన్న భావం సరికాదని కొట్టిపారేసింది. అదివారిని కొంత వెనక్కు లాగుతున్నట్టు అభిప్రాయపడింది. గుర్‌గావ్‌కు చెందిన మరోసంస్థ స్టోన్స్ 2 మైల్‌స్టోన్స్ ప్రైవేటుస్కూళ్లలో అధ్యయనం చేసి నాలుగో తరగతి పిల్లల్లో కేవలం 12.5శాతం మంది మాత్రమే ఇంగ్లీషు అక్షరాలు చదవగలుగుతున్నారని వివరమైన నివేదిక విడుదల చేసింది. చెన్నైలో మరో సంస్థ జరిపిన అధ్యయనమూ ఇదే చెప్పింది. అయిదో తరగతి వారిలో కేవలం 2.1శాతం మాత్రమే పదసంపద వినియోగించ గలుగుతున్నారట. ఇలాటి సర్వేలు ఇంకా చాలా వున్నాయి. ఇంగ్లీషు మీడియం వల్లనే చాలా మేలు జరిగిందని చెప్పే సర్వేలు దాదాపు చూడం.

ప్రభుత్వ పాఠశాలలనుంచి పిల్లలను మళ్లించడం కోసం పై తరగతుల వారిని రాబట్టడం కోసం ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అనుసరించిన ఎత్తుగడ ఇంగ్లీషు మీడియం ఆకర్షణ. విద్యారంగం నుంచి ప్రభుత్వం నెమ్మదిగా ఉపసంహరించుకునే కొద్దీ వాటి ప్రాబల్యం పెరిగి సమాంతర సామ్రాజ్యాలుగా మారాయి. అనివార్యంగా కొంత, ఆకర్షణతో, ఆశతో కొంత పేద దిగువ వర్గాలు కూడా ఆ దారి పట్టాల్సి వచ్చింది. వైద్య రంగంలోనూ ఇదే జరిగింది. కార్పొరేట్ స్కూళ్లకు, ఆస్పత్రులకు పంపించి రియంబర్సుమెంటు చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధమైనాయి. ఆ విధంగా ఇంగ్లీషులో ఇంజనీరింగ్ చదివిన వారు కూడా వేలు లక్షల్లో ఉద్యోగాలు లేక వుసూరుమంటున్నారు కదా? విదేశాలకు వెళ్లడం కోసం ఇంగ్లీషు అనుకుంటే లక్ష మందికి అటూ ఇటూ కన్నా వుండరేమో. పైగా అప్పటికి ఎలాగూ దానిపై పట్టు చిక్కుతుంది. ఇంతాచేసి ప్రపంచంలో చాలా దేశాలలో ఇంగ్లీషు మీడియం వుండదు. ఆసియాలోనే యాభై దేశాలలో 15 చోట్ల మాత్రమే స్థానిక బాషలతో పాటు ఇంగ్లీషు వుంది. ఈ ఖండంలో బాగా అభివృద్ధి చెందిన చైనా, జపాన్, కొరియా వంటివి వారి భాషలలోనే బోధిస్తున్నాయి.

ప్రపంచ జనాభాలో మూడింట ఒకవంతు మాత్రమే ఇంగ్లీషు మీడియం తెలుసు. ఈ దేశాలలో కూడా ప్రభుత్వాలే దాన్ని పెంచి పోషించాయని ఆక్స్‌ఫర్డ్ అధ్యయనం చెబుతున్నది. ప్రజలలోనూ దీనికి అనుకూలత వుంది.

ఉదాహరణకు ఇండియాలో గత దశాబ్దిలో ఇంగ్లీషు మీడియం చదివేవారి సంఖ్య 234 శాతం పెరిగింది. కాని మధ్యలో చదువు ఆపేసేవారి సంఖ్య కూడా చాలా ఎక్కువగానే వుంది. దేశంలో 15శాతం మంది పై తరగతి వారు మాత్రమే అది కూడా అవకాశాల పెంపుదల కోసం ఇంగ్లీషు మాట్లాడుతున్నారని ప్రస్తుత విద్యామునిసాయిదా చెబుతున్నది. మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారని అదే పనిగా ఎదురు ప్రశ్నలు వేసే వారు ఈ వాస్తవాలన్నీ తెలిసినా దాటేస్తుంటారు. అయినా కాన్వెంటులలో చదివిన వారంతా పైకి వచ్చారని ఎక్కడా సాక్ష్యాధారాలు లేవు. పైకి వచ్చిన వారంతా ఇంగ్లీషుతోనే రాలేదు. శక్తి యుక్తులు, వ్యక్తిత్వం, అవగాహన, నైపుణ్యం చొరవ పెరిగితే ఏ విధంగానైనా రాణించవచ్చు. ఇంగ్లీషునే అభివృద్ధికి సోపానంగా చూపించడం అమెరికాను జీవిత గమ్యంగా భావించడం వంటిదే. అలా అయినా ఆ దేశం ఎందరికి ఎన్ని వేల వీసాలు ఇస్తుందో ఎవరూ చెప్పలేరు. దేశ భాషలను తక్కువ చేసుకోవడం తద్వారా దేశస్థులను తక్కువ చేయడం వల్లనే ఇంగ్లీషును అతిగా చిత్రించడం జరుగుతుంటుంది. ఆ దేశం పక్కనే వున్న ఫ్రాన్స్, ఇటలీ వంటి చోట్ల కూడా దాన్ని మాట్లాడరు. ఇంగ్లీషు భవిష్యత్ ఏమిటని వారు ఆందోళన పడుతుంటే మనం అదే విజయానికి పాస్‌పోర్ట్ అని అధికారికంగా చెబుతున్నాం. గూగుల్ తెలుగుతో సహా 14 భారతీయ భాషలు ఇస్తుంటే వారి సినిమాలు నేరుగా తెలుగులో డబ్బింగ్‌తో ప్రసారమవుతుంటే మనం నేర్చుకోవలసింది ఏమిటి? కింది తరగతుల వారిని పాలకులు ఎప్పటికప్పుడు ఏవో భ్రమలతో ఆకర్షిస్తున్నట్టే ఇప్పుడు ఈ అస్త్రం తీశారు. జరగాల్సింది కార్పొరేట్ విద్యను ప్రైవేటీకరించడం తప్ప ప్రభుత్వ బళ్లను కార్పొరేటైజ్ చేయడం కాదు. మీడియం పేరుతో మొదలవుతున్న ఈ ప్రహసనం ఉత్తరోత్తరా వాటి ఆస్తులనూ వనరులనూ కార్పొరేట్ బాట పట్టించడం తథ్యం.

తెలుగును కేవలం భాష సంస్కృతుల వారసత్వంగా కొందరు అంటున్నట్టు సనాతన సంస్కృతిగా చూడటం కూడా తప్పే. సనాతనులు ప్రజలభాషను ఎప్పుడూ ఆదరించింది లేదు. సంస్కృతం, ఇంగ్లీషు రెండూ తెలుగును పెరగకుండా చేశాయి. ఇంగ్లీషు మీడియం వల్ల దళిత బహుజనులు ఎకాఎకిన ఎక్కి వస్తారని ఒకవైపు, అన్యమత ప్రచారానికి దారి తీస్తుందని మరోవైపు చేస్తున్న వాదనలు ఆధారం లేనివి. ఆర్థిక అభివృద్ధిని ఆంగ్లభాషే ఇచ్చేట్టు వుంటే ఇంగ్లాండులో, అమెరికాలో సమస్యలే వుండేవికావు. ఇంగ్లీషు మీడియంతోనే మతాల మార్పిడి అనుకుంటే ఆ సభల్లో అనువాదం అవసరమే వుండేదికాదు. ఇవన్నీ పక్కదోవ పట్టించేవాదనలు.

ఆఖరిగా బోధనా సిబ్బంది లేకుండా ఉన్నఫలాన ఇంగ్లీషు మీడియం తీసుకురావడం పిల్లలను తికమక పెడుతుంది. టీచర్లనూ ఇరకాటంలో నెడుతుంది. ఇప్పటికే ఇంగ్లీషు కమ్యూనికేషన్ వున్నవారినే టీచర్లుగా అనడంతో కొత్త షరతు పెట్టి కోత కోసినట్టవుతున్నది. ఇప్పటికే సక్సెస్ స్కూళ్లు మోడల్ స్కూళ్లు కస్తూర్బా పాఠశాలల వంటివాటిలో మొత్తం మూడింట ఒకవంతు ఇంగ్లీషు మీడియం వుంది. దాన్ని విస్తరించాలనుకుంటే చేయొచ్చు గాని తెలుగు మీడియంను గుండు గుత్తగా ఎత్తేయడం అనర్థదాయకం. రాజ్యాంగ విరుద్ధం. తెలుగుజాతికి నష్టదాయకం.

♦


సంపాదకవర్గం:

**తెలకపల్లి రవి** ప్రధాన సంపాదకుడు

**వొరప్రసాద్** వర్కింగ్ ఎడిటర్

**కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్**

**గనారా ◆ శమంతకమణి**

**కెంగార మోహన్**

**కె.లక్ష్మయ్య,** మేనేజర్

కవర్ డిజైన్: **బ్రౌన్**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

**ISSN No: 2581 - 7477**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!

**1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-**

**Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada**
**A/c No. 52001500585, IFSC: SBIN0020343**
చెక్కులు, డిడిలపై **prasthanam** అని రాయగలరు.

## మాతృభాషా మాధ్యమ ప్రత్యేక సంచిక

**అసలు ఇది ఎందుకు రాయవలసి వచ్చిందంటే?**
– డా॥ గారపాటి ఉమామహేశ్వర రావు............................ 8
**అమ్మభాష అభివృద్ధి – ఒక ప్రజాస్వామిక అవసరం**
– తెలకపల్లి రవి........................................................ 14
**మాతృభాషను రక్షించుకుందాం**
– చేకూరి రామారావు................................................. 18
**విద్యలందు ప్రాథమిక విద్య వేరయా...**
– డాక్టర్ పమిడిపాటి శ్రీనివాస్‌తేజ.................................. 22
**సాహిత్య ప్రస్థానం నవంబర్ 2019 పురస్కారాలు**....................... 28
**అమ్మభాషలో చదువుకో...ఆంగ్లమూ నేర్చుకో!**
– ఆచార్య పులికొండ సుబ్బాచారి.................................... 29
**భాష అంటే మనం ఏం అనుకుంటున్నాం?**
– కృష్ణ కుమార్........................................................ 32
**ఏక కాలంలోనే ఉభయులూ ఉపాధ్యాయులూ, విద్యార్థులూ...**
– పాలో ఫ్రెయిరె....................................................... 37
**ప్రపంచాన్ని అబ్బురపరిచే ఫిన్లాండ్ విద్య**.................................. 38
**మాతృభాష ఆర్థిక ప్రగతికి మాతృక!**
– చుక్కా రామయ్య..................................................... 43
**మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి**
– విరపు బాలసుబ్రహ్మణ్యం ......................................... 46
**బోధనా మాధ్యమం – ఒక విశ్లేషణ**
– రాంబాబు తోట...................................................... 48
**తెలుగు మాధ్యమం – ఆంగ్ల మాధ్యమం**
– ఎస్. వెంకట్రావు..................................................... 52
**మాతృభాషా మాధ్యమ చట్టాలు**
– అప్పిరెడ్డి హరినాథరెడ్డి............................................. 56
**రాజభాష రగడ** – తెలకపల్లి రవి............................................ 59
**అబ్రహాం లింకన్ ప్రపంచ ప్రసిద్ధ లేఖ**...................................... 61
**ఔరంగజేబు తన టీచర్‌కు రాసిన ప్రసిద్ధ ఉత్తరం**......................... 62
**డైరీ** ............................................................................ 64

# అసలు ఇది ఎందుకు రాయవలసి వచ్చిందంటే...

**- గారపాటి ఉమామహేశ్వరరావు**



***ప్రపంచ జనాభాలో 22 శాతం మంది మాత్రమే భారతదేశంలో ఉంటే, ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో 46 శాతం వరకూ భారతదేశంలోనే ఉన్నారు. ఇక, ప్రపంచంలోని మొత్తం బడిబయట ఉన్న పిల్లలలో అత్యధికం భారతదేశంలోనే ఉన్నారు. ఇది మన దేశంలోని చదువుల స్థితిగతుల గురించి ఆందోళన పడవలసిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. దీనికి కారణం పాఠశాల విద్యలో విస్తరిస్తున్న ఆంగ్ల మాధ్యమ విద్యాబోధనే. ఈ స్థితినుంచి బైటపడటానికి ఉన్న ఒకే ఒక సులువైన మార్గం స్థానిక భాషలలో చదువు నేర్పడం. దీనికి ఇంటిలో ఉన్న పెద్దలూ, తల్లిదండ్రులూ, తోబుట్టువులూ, చుట్టుపక్కల జనం అందరూ సాయపడే అవకాశం ఉంటుంది. అదే ఇంగ్లీషులో అయితే బడి టీచరే బాధ్యత వహించాలి.***

ఈ నేలమీద జీవుల్లో మనిషితోపాటే పుట్టి మనిషిని మనిషిగా నిలబెట్టినదీ మనిషంత ప్రాచీనమైనదీ భాషే. మానవ వికాసంలో ఒక విశిష్ట లక్షణంగా ఉత్పన్నమైనదీ భాషే. మనిషి పుట్టుక భాషతోనే. అంటే మనిషికి మనిషిగా గుర్తింపు వచ్చినదీ భాషతోనే. మనిషి వయసు ఎంతో భాష వయసూ అంతే. దీంతో ఒకరి భాష అతి ప్రాచీనమనీ మరి కొందరి భాష నిన్న మొన్నటిదనీ అనే ఆలోచనలకు ఆస్కారం లేదు. అలాగే ఒక భాష గొప్పదనీ మరొకటి పేదదనీ అనుకోడానికి ఎలాంటి ఆస్కారం లేదు. అంటే భాషలమధ్య ఎలాంటి తేడాలూ, చిన్నా పెద్దా అనే తారతమ్యాలూ లేవు. అన్ని భాషలూ శక్తివంతమైనవే. అన్నింటా అదే సంక్లిష్టతా అంతే సౌలభ్యమూను. భాషలకు వాడుక ఊపిరి. వాడుకరులే బలం. ప్రాణులలానే భాష జీవభౌతిక అంశాలు కలగలిసిన మనోసామాజిక వ్యవస్థ. భాష మనిషికి ఒక అవయవం. ఉన్న అవయవాన్ని పోగొట్టుకోవటమంటే అంగవైకల్యాన్ని కొనితెచ్చుకోవటమే. అంటే సామాజిక వైకల్యానికి చేరువవ్వటమే. అది అనర్థదాయకం. భాషలు మానవవికాస పరంపరలో ఏర్పడిన జీవభౌతిక సృజనలే కాదు. అవి తరతరాల సామాజిక సాంస్కృతిక వారసత్వ సంపదలు కూడా. వాటిని పక్కన పెట్టించే పనులు ఆ సమాజంపై దాడితో సమానం.

ఏదైనా ఒక సమాజం తన వారసత్వ భాషను పక్కను పెట్టేది రెండు సందర్భాలలో మాత్రమే. ఒకటి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కోల్పోయి పర సమాజపు ఆధిపత్యపు నీడలో ఉన్నప్పుడూ. రెండవది, అల్ప సంఖ్యాక సమాజమైనందువలన తన సొంత వనరులతో బతకడం కష్టమైనప్పుడూ. ప్రస్తుతం తెలుగు సమాజానికి ఈ రెండు లక్షణాలూ లేవు. మరి ఇప్పుడు ఈ సమాజం తన పౌరులకు బోధనా మాధ్యమంగా తన వారసత్వ భాషను తొలగించి ఆ స్థానంలో ఇంగ్లీషును ఎందుకు చేర్చుతున్నట్లు?

ప్రపంచ జనాభాలో 22 శాతం మంది మాత్రమే భారతదేశంలో ఉంటే, ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో 46 శాతం వరకూ భారతదేశంలోనే ఉన్నారు. ఇక, ప్రపంచంలోని మొత్తం బడిబయట ఉన్న పిల్లలలో అత్యధికం భారతదేశంలోనే ఉన్నారు. ఇది మన దేశంలోని చదువుల స్థితిగతుల గురించి ఆందోళన పడవలసిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. దీనికి కారణం పాఠశాల విద్యలో విస్తరిస్తున్న ఆంగ్ల మాధ్యమ విద్యాబోధనే. ఈ స్థితినుంచి బైటపడటానికి ఉన్న ఒకే ఒక సులువైన మార్గం స్థానిక భాషలలో చదువు నేర్పడం. దీనికి ఇంటిలో ఉన్న పెద్దలూ, తల్లిదండ్రులూ, తోబుట్టువులూ, చుట్టుపక్కల జనం అందరూ సాయపడే అవకాశం ఉంటుంది. అదే ఇంగ్లీషులో అయితే బడి టీచరే బాధ్యత వహించాలి.

మాతృభాష, బడిభాష ఒకటే అయితే బడి వాతావరణం సహజంగానూ నేర్చుకునే విషయం తేలికగానూ ఉంటుంది. అలా కానప్పుడు అనవసరమైన ప్రయాసతోపాటు చదువే భారం అవుతుంది. లౌకిక, నాగరిక, సభ్య, స్వేచ్ఛా సమాజాలు మాతృభాషలోనే చదువుకోవడం సాధారణం, సహజం, తార్కికం, ఆనవాయితీ. ఎక్కడో కొన్ని అభివృద్ధికి నోచుకోని, లిపి లేని అల్పసంఖ్యాక భాషా సమాజాలలో తప్ప అధికశాతం ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమం ద్వారానే నేర్పడం జరుగుతోంది. మరి కోట్లాదిమంది ఉన్న తెలుగు సమాజం తెలుగులో చదువుకోలేని దుస్థితిని కల్పిస్తున్నది ఎవరు? అవగాహనారాహిత్యంతో మంచిచెడుగుల ఆకళింపు కొరవై, ముందుచూపు కరువై, తేలిక పద్ధతిలో స్థానిక వనరులతో తక్కువ సమయంలో ఎక్కువమందిని అక్షరాస్యులను చేసే పని మానేసి, కొన్ని విదేశీ ఉద్యోగాలను ఎరగా చూపి, లేని వనరులతో రాని భాషలో తెలియని చదువులతో ఇంగ్లీషు మాధ్యమాన్ని మనమీద రుద్దే ప్రయత్నాలను ఎదుర్కొనే అవగాహనను కల్పించటమే మన ప్రస్తుత కర్తవ్యం.

ఇకపోతే, ప్రపంచ పటం మీద ఐరాస గుర్తింపు పొందిన 190కి పైగా ఉన్న దేశాలలో 62 దేశాలలో మాత్రమే ఇంగ్లీషు అధికార భాషగా కాకపోయినా వాస్తవానికి అధికార భాషగా చెలామణి అవుతోంది. ఈ అరవైరెండు దేశాలలో కోటికి పైగా జనాభా ఉన్నవి 21 దేశాలు. 75 లక్షల నుంచి 10 లక్షల జనాభా ఉన్నవి 14 దేశాలు. 1 వెయ్యి నుంచి 8 లక్షల జనాభా ఉన్నవి 27. ఈ దేశాలు చాలావరకు బ్రిటిషు వలస పాలనలో మగ్గిన దేశాలే. ఐతే వీటిలో 24 దేశాలు ఆఫ్రికా ఖండంలోనూ, 15 దేశాలు మధ్య అమెరికా ఖండంలోనూ, ఆస్ట్రేలియా ఖండ దరిదాపుల్లో 15 దేశాలూ, ఆసియా ఖండంలో 6 దేశాలూ, ఐరోపాలో 2 దేశాలూ ఉన్నాయి. ఐతే వీటిలో ఇండియా, పాకిస్థాన్, నైజీరియా, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్, ఇథియోపియాలాంటివి తప్పించి మిగిలినవన్నీ చిన్నా చితకా దేశాలే. బ్రిటీష్ వలసవాద ఆధిపత్యపు పీడనలో నలిగిన దేశాలే ఇవి. ఆనాటి వలసవాద అవశేషంగా ఇంకా మిగిలిన ఆనవాలే ఇంగ్లీషు. చాలావరకూ ఈ దేశాలలో వాళ్ల సొంత భాషలే మాట్లాడుతున్నా అధికారిక కార్యకలాపాలూ ఉన్నత విద్య మొదలైనవి మాత్రం ఇంగ్లీషులోనే. వీటిలో చాలా దేశాలలో ఇంగ్లీషును పక్కనపెడదామని ఎన్ని ప్రణాళికలు వేసుకొన్నా ఆర్థిక వెసులుబాటు లేని కారణంతోనూ, అంతర్గత రాజకీయ సామాజిక కారణాల చేతనూ ఇంగ్లీషును భరించక తప్పటం లేదు. అసలు విషయం ఏమంటే ఇంగ్లీషును సొంతభాషగా మాట్లాడే దేశాలైన ఇంగ్లండు, అమెరికా (సం.రా.), ఆస్ట్రేలియా, న్యూజీల్యాండులలో ఇంగ్లీషు ఈనాటికీ అధికార భాషగా గుర్తింపుకు నోచుకోలేదు.

ఆసియా ఖండంలో మొత్తం 50 దేశాలు ఉండగా 15 దేశాలలో మాత్రమే పాఠశాల విద్యలో స్థానిక భాషలతోబాటు ఇంగ్లీషు మాధ్యమం కూడా వాడుకలో ఉంది. వీటిలో కోట్లల్లో జనాభా ఉన్న భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాలులూ, లక్షలలో మాత్రమే జనాభా ఉన్న హాంకాంగ్, లావోస్, సింగపూర్, కువైట్, ఖాతర్, బహ్రైన్, భూటాన్, బ్రునేయ్, మాల్దీవులు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు నేరుగా బ్రిటిషు వలస దేశాలుగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. మొత్తం 439 కోట్లమందిలో మూడింట ఒకవంతు మాత్రమే ఇంగ్లీషు మాధ్యమానికి మారినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

ఇక ఐరోపా ఖండంలో ఉన్న 49 దేశాలలో ఐర్లాండు, ఐస్లాండు ఇంకా రెండు మూడు చిన్నా చితకా దేశాలు తప్పితే అన్నీ పాఠశాల విద్య మాతృభాషా మాధ్యమంలోనో లేక స్థానిక భాషలలోనో విద్యాబోధన జరుపుతున్నాయి. అయితే, నెదర్ల్యాండ్స్, డెన్మార్క్, స్వీడన్, ఫిన్ల్యాండ్ జనాభాలో 70 నుంచి 90 శాతం మంది ఇంగ్లీషును రెండవభాషగా మాట్లాడతారు. మిగిలిన ఐరోపా దేశాలలో (జర్మనీ, ఫ్రాన్సు మొదలైన దేశాలలో) 55 – 20 శాతం మంది మాత్రమే ఇంగ్లీషు మాట్లాడగలరు.

56 దేశాలతో సుమారు 120 కోట్ల జనాభాతో ఉన్న ఆఫ్రికా ఖండంలో 70 శాతం ప్రాథమిక విద్య 200 కి పైగా ఉన్న ప్రధాన మాతృభాషలలోనే ఉంది. ఐతే మాధ్యమిక స్థాయి నుండి విద్యాబోధన అంతా ఇంగ్లీషు, ఫ్రెంచి, కొన్నిసార్లు యొరుబా, స్వాహిలీ భాషలలోనే జరుగుతోంది. ఉత్తర దక్షిణ అమెరికా ఖండాలలో మొత్తం 35 దేశాలు ఉండగా అమెరికా (సం.రా.), కెనడాలాంటి వాటితో కలుపుకొని మొత్తం 12 దేశాలలో ఇంగ్లీషు అధికార భాష, మిగిలిన దేశాలన్నింటా స్పానిషు, పోర్చుగీసు, ఫ్రెంచి లాంటి ఐరోపా భాషలూ, అమెరికనిండియన్ భాషలైన గ్వరానీ, క్వెచువా, అయమార లాంటివి ఉన్నాయి. ఆస్ట్రేలియా – ఓషేనియా పరిధిలో ఉన్న 14 దేశాలలో ఏ దేశంలోనూ అధికార భాషగా ఆంగ్లం

లేకపోయినా వాస్తవానికి అధికార భాషగా ఇంగ్లీషు చలామణిలో ఉంది. ఆస్ట్రేలియా, పపువా – న్యూగినీ, న్యూజిల్యాండు తప్పితే మిగతావి మిలియను జనాభా దాటని చిన్న దేశాలే. పపువా – న్యూగినీలో ఇంగ్లీషు మాట్లాడగలిగిన వారి జనాభా రెండు శాతంకంటే తక్కువే. న్యూజిల్యాండులో మావోరి అధికార భాష. అయితేనేం అన్నింటా ఇంగ్లీషుదే వాస్తవ అధికారం.

ఇక ఆర్థిక విషయాలు చూద్దాం. నిరక్షరాస్యులతో పోల్చితే, ప్రాథమిక విద్య నేర్చినవారి వ్యక్తిగత ఆదాయం 20 శాతం వరకూ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ నమూనా సర్వేక్షణలో సేకరించిన సమాచార విశ్లేషణలో ప్రతి యేటా చదువుకున్న చదువు పురుషులలో 8 శాతం, మహిళలలో 10 శాతం వరకూ ఉత్పాదకతను పెంచుతోంది అని తెలిసింది (ప్రోబ్ నివేదిక, 1998). అందరికీ చదువుకు మాతృభాషా మాధ్యమమే సులువైన సాధనమూ మార్గమూ. అంటే 46 శాతం మంది బడి మానేసే పిల్లలు ఉన్న తెలుగు రాష్ట్రాలలో వ్యక్తిగత ఆదాయానికి గండికొడుతున్నది ఎవరు? మన ఆంగ్లమాధ్యమ ప్రణాళికలే గదా.

♦

మనం మాతృభాషలోనే చదువుకోవాలనడానికి ఐదు ప్రధాన కారణాలు:

మాతృభాషా మాధ్యమంలో చదువు సహజం. సులభం, వనరులు ఎక్కువ, ఖర్చు తక్కువ, అది స్వేచ్ఛకు సంకేతం.

మాతృభాషా మాధ్యమంలో చదువుతో ఉపాధి ఉద్యోగావకాశాలు ఎక్కువ, భాషా గుత్తాధిపత్యాన్ని నిలువరించవచ్చు.

ఆంగ్లభాషా మాధ్యమం ఏకభాషాధిపత్య నియంతృత్వానికి బాటలు వేస్తుంది. భాషావైవిధ్యం అంతరిస్తుంది. అది ఆటంబాంబు లాంటిది. జాతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించివేస్తుంది.

ఆంగ్లభాషా మాధ్యమంతో భాషతోపాటు మనవైన ఉపాధి అవకాశాలనూ, మన పరిశ్రమలనూ చేజార్చుకొని పరాధీనులమవుతాం.

ఆంగ్లభాషా మాధ్యమంతో అంతర్జాతీయ ఆర్థిక శక్తుల ప్రాబల్యంతో పాఠశాల, కళాశాల స్థాయిలలో ఔట్ – సోర్సింగ్ మొదలై అన్నీ ప్రవేటు పరమై మనలో సామాజిక అంతరాలు బలమై అవి తరచుగా విద్వేషాలకూ సంఘర్షణలకూ దారితీస్తాయి.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆంగ్లమాధ్యమ పాఠశాలలకు కట్టుబాట్లు లేని అనుమతులు ఇవ్వడం, వాళ్లు వసూలు చేసే ఫీజులపై సరైన నియంత్రణ లేకపోవడం ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యమే ఔతుంది. నిరుద్యోగ సమస్య మూలాల గురించి పాలకులు ఆలోచించాలి గానీ ఇంగ్లీషులో నేర్పితే ఉద్యోగాలు వచ్చేస్తాయనే భ్రాంతిలో ఎట్లాపడ్డారనేది ఆశ్చర్యకరమే. లక్షలాది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఎట్లా మిగిలిపోయారనేది వీళ్లకి శేషప్రశ్నగా మిగిలిపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు.

ప్రపంచీకరణ అంటే ఆంగ్లీకరణ కాదు. స్థానికీకరణ మాత్రమే. ఇది భాషావైవిధ్యం ద్వారానే సాధ్యం. పాఠశాల స్థాయిలో ఇంగ్లీషు మాధ్యమం ఈ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. వందలాది స్థానీయ సాంప్రదాయ వృత్తివ్యాపారాలను ఆధునీకరించి వేలాదిమందికి ఉపాధి అవకాశాలను మెరుగుపరచటం మాతృభాషల ద్వారా మాత్రమే సాధ్యం. స్థానిక భాషలలో విద్యాబోధన, వృత్తివ్యాపారాలూ వాణిజ్యం, పరిశ్రమలను చవకగానూ, సులువుగానూ ఎక్కువమందిని కలుపుకుంటూ నిర్వహించే వీలు కలుగుతుంది. భాషావైవిధ్యాన్ని కాపాడుకుంటేనే విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమాన్ని అనివార్యం చేయాలి. ఇదే ఐరాస నివేదిక, ఐరోపా మండలి భాషా విధానం. మాతృభాషలో చదవడం, రాయడం బాగా నేర్చాకే మరే భాషనైనా నేర్చుకోవడం సులువవుతుంది. అసలు ప్రపంచమంతటా, పిల్లల్ని 5 ఏళ్లు దాటిన తరువాతే బడికి పంపించటంలో మర్మం ఏమిటి? ఎందుకంటే అప్పటికి వాళ్లకి మాతృభాష వచ్చేసి వుంటుంది. తరగతిగదిలో టీచరు చెప్పేది అర్థమౌతుందనే. మరి మన తెలుగు పిల్లలు బడికి వెళ్లేప్పటికే ఇంగ్లీషు నేర్చేసుకొని ఉంటారంటారా? అంటే కొత్తగా ఆ పిల్లవాడికి బడిభాషగా ఇంగ్లీషు మొదలెట్టాలన్నమాట. అంటే క్లాసులో పనిగట్టుకొని ఇంగ్లీషు బాగా వచ్చిన పిల్లలూ, ఒక మాదిరిగా వచ్చిన పిల్లలూ, కొంచెం వచ్చిన పిల్లలూ, అసలే రాని పిల్లలూ అని వాళ్లలో ఇంగ్లీషుభాషని బట్టి హెచ్చు తగ్గుల్ని బట్టి రేపటి వాళ్ల ప్రతిభను నిర్ణయిస్తామన్నమాట.

ఐరాస కార్యకలాపాలలో ప్రధానమైనవి అభివృద్ధీ, మానవ హక్కులే. ఇది భాషా సంబంధమైన వివక్షతను చట్టవ్యతిరేక చర్యగా పరిగణిస్తుంది. అందుకని, బోధనా మాధ్యమంగా మాతృభాష స్థానం నుండి దానిని తొలగించడం

ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘించటమే. మానవ సమాజాల సంక్షేమానికి వాటి గుర్తింపులోనూ విద్య కీలకం. అంతేగాక, ఆధునిక మానవ సమాజాల భద్రతకూ స్వేచ్ఛకూ విద్య తప్పనిసరి. ఈ సందర్భంలో ప్రాథమిక విద్యతో సహా విద్యాభాషా హక్కుల సాధనలో ఆర్థికపరమైన అవాంతరాలను కలగనీయకూడదని ఐరాస నిర్దేశిస్తోంది.

2014లో ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలోని అనువర్తిత భాషాశాస్త్ర విభాగంలోని పరిశోధకులు, బ్రిటిషుకౌన్సిలు సిబ్బంది తోడ్పాటుతో ప్రపంచంలోని 55 దేశాలలో జరిపిన ఆంగ్లమాధ్యమబోధన గురించి ఒక పెద్ద పరిశోధనా నివేదికనే తయారుచేశారు. అందులో కొన్ని అంశాలు ఇట్లా ఉన్నాయి. “సర్వే చేసిన చాలా దేశాలలో ఆంగ్లమాధ్యమ బోధన వేగంగా విస్తరిస్తోంది. కొన్ని దేశాలలో తప్పిస్తే, చాలా దేశాలలో ఆంగ్లమాధ్యమబోధన అధికారిక ప్రభుత్వ అండతోనే నడుస్తోంది. ఐతే, ఆంగ్లమాధ్యమ బోధనను ప్రవేశపెట్టడం లోనూ కొనసాగించడంలోనూ ఆయా ప్రజల నుంచి మద్దతు రాబట్టలేకపోవడంతో ఈ నిర్ణయం ‘వివాదాస్పదంగానూ, అస్పష్టంగానూ ఉన్నా వ్యతిరేకంగా మాత్రం లేదు” అంటూ నివేదికలో పేర్కొన్నారు.

“ఆంగ్లమాధ్యమ బోధన స్వభావంలోనే సామాజిక విభజన ఉంది'' అనే విషయాన్ని నివేదికలో ప్రస్తావిస్తూ, “సామాజికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడినవారికి దీనిలో ప్రవేశం పరిమితం కావడం ఒకటీ, సొంతభాష, జాతీయవాదం మరుగున పడతాయోమోననే భయం మరొకటీ, రెండు రకాలుగా ఔచిత్యం కొరవడిన ప్రయోగంగా మిగిలిపోయింది” అని తమ నిరసనని వ్యక్తం చేశారు. ఇంకా ఆంగ్లమాధ్యమ ప్రయోగం గురించి ప్రస్తావిస్తూ, “ఈ దేశాలలో, నాణ్యమైన ఆంగ్లమాధ్యమ బోధనకు కావలసిన విద్యాపరమైన మౌలిక సదుపాయాల లోపం ఉంది. భాషాశాస్త్రపరమైన అర్హతలున్న ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇంగ్లీషు భాషా నైపుణ్యాల గురించిన ముందస్తు అంచనాలు ఏవీ లేవు” అంటూ ఒక పెద్ద జాబితానే చేర్చారు. ఇంతకీ, బ్రిటిషుకౌన్సిలు పరిశోధనా నివేదికలోని అసలైన విషయం ఏమంటే, “ఈ ఇంగ్లీషు మాధ్యమ బోధనను ఆయా దేశాల ప్రణాళికా రచయితలూ విద్యా విధాన నిర్ణేతలూ విద్యారంగ నిర్వాహకులు నిర్ణయించి అమలుపరుస్తున్నది కాదు, పైనుంచి దిగుమతి చేసుకొన్నదే. అయితే, ఇందులో కీలకమైన భాగస్వాములను సంప్రదించి వారి ఆమోదంతో జరిగితే బావుండేది” అని మెత్తగా చెప్పటాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఎవరు ఈ పైవారు? ఏ పైనుంచి దిగుమతి చేసుకున్నది? ప్రజల ఆమోదం లేకుండా ఏ రాజకీయ ప్రయోజనాలను ఆశించి చేస్తున్న పని? మన పాలన మన చేతులలోనే ఉండాలనే సూత్రం ఎంత సత్యమో మన పాలన మన భాషలోనే జరగాలనేది కూడా అంతే సత్యం. అట్లా కానీ కాదని దొడ్డిదోవన ఇంగ్లీషు మాధ్యమాన్ని నడుపుతున్నదెవరూ నడిపిస్తున్నదెవరు? బహుళజాతి వాణిజ్య సంస్థలా? అంతర్జాతీయ ఆర్థిక సంఘాలా లేక ఆంగ్లో – శాక్సన్ భాషా సాంస్కృతిక వారసత్వాన్ని తుదముట్టించేదాన్నీ మనం సుతారామూ సహించలేం. మాతృభాషా మాధ్యమం కోసం అందరం కలిసిరావాలి. కలిసి ముందడుగు వేయాలి. దీనికోసం తెలుగు సమాజం ఒక్కటవ్వాలి. మన కులం తెలుగు, మన మతం తెలుగు, మన ప్రాంతాలు తెలుగు, ఆడామగా చిన్నా పెద్దా అందరం కలిసి నడుద్దాం. తెలుగు బలగం అనే కట్టడాన్ని అమ్మమాట పునాదులపై నిర్మించే సమయం ఆసన్నమైంది. ఎలాంటి ఇతర సామాజిక అడ్డుగోడలూ దీనికి అడ్డంకి కాగూడదు.

**ఇంగ్లీష్ నైపుణ్యాల గురించిన కొన్ని అపోహలు**

ఎడ్యుకేషన్ ఫస్ట్, ఇఎఫ్ (బెర్టిల్హల్ట్, 1965) అనే సంక్షిప్తనామంతో, ప్రపంచవ్యాప్తంగా సుమారు 43,500 సిబ్బందితో 50 కి పైగా దేశాల్లో 500 కార్యాలయాలూ పాఠశాలలూ ఉన్న ఓ అంతర్జాతీయ ఆంగ్లభాష ప్రమాణాలను మూల్యాంకనం చేసే విద్యా సంస్థ. భాషా శిక్షణ, విద్యాసంబంధ ప్రమాణాలూ, విద్యా డిగ్రీ కార్యక్రమాలూ సాంస్కృతిక మార్పిడులలో ప్రత్యేకమైన కృషిచేస్తున్న అంతర్జాతీయ విద్యాసంస్థ. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అంతర్జాతీయ సంస్థలలో పనివారల ఇంగ్లీష్ నైపుణ్యాల గురించిన కొన్ని అపోహలపై చేసిన పరిశోధనలలో వెలువడిన వాస్తవాలను చూడండి:

1. “యువతరం” మంచి ఇంగ్లీష్ మాట్లాడుతోంది.

తప్పు. ఆంగ్ల సామర్థ్యం 31 నుంచి 36 ఏళ్ళ వయస్సు ప్రజలలో ఎక్కువగా ఉంది. కొద్దోగొప్పో ఇంగ్లీషు భాషలో పని చేయగల సామర్థ్యమే కాలక్రమేణా వారి ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని మెరుగుపరుస్తోంది. (అంటే చిన్నప్పటి నుంచే ఇంగ్లీషు నేర్చుకోవడం కాదు. ఉద్యోగంలో ఉన్నప్పుడు అవసరమైన కార్యక్షేత్రంలో ఆంగ్లనైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి.)

2. మహిళల కంటే పురుషులే మంచి ఇంగ్లీషులో మాట్లాడతారు.

తప్పు. ప్రపంచవ్యాప్తంగా, ఇంగ్లీష్ భాషా నైపుణ్యంలో మహిళలే గణనీయమైన రీతిలో పురుషులని మించిపోయారు. మానవీయ శాస్త్రాలలో ఎక్కువ మంది స్త్రీలు ఉండటమే కారణం.

3. టెలికమ్యూనికేషన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, బ్యాంకింగ్ ఇంకా ఫైనాన్స్ వంటి పరిశ్రమలలోనే బలమైన ఇంగ్లీష్ నైపుణ్యాలు ఉన్నవాళ్లు ఉన్నారు.

తప్పు. విదేశీయుల కోసం సేవలందించే ప్రయాణ పర్యాటక, సంప్రదింపుల వంటి రంగాలలోనే బలమైన ఆంగ్ల నైపుణ్యాలు గలవారు ఉన్నారు. ఈ అధ్యయనం కోసం ఎంపిక చేసిన ఇరవై విభాగాలలోకెల్లా ఇంగ్లీష్లో చాలా ఎక్కువ నైపుణ్యాన్ని కలిగినవారు ట్రావెల్, టూరిజం, కన్సల్టింగ్ వంటి రంగాలవారు మాత్రమే. టెలికమ్యూనికేషన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ వంటి పరిశ్రమలలో పనివారు ఇంగ్లీష్లో కేవలం పరిమిత నైపుణ్యంతోనూ, ఆరోగ్య సంరక్షణ, ఆటోమేటివ్, ఉత్పాదనలూ, శక్తి, గనులూ తదితరాలలో తక్కువ నైపుణ్యంతోనూ, రిటైల్ వ్యాపారాలలోనూ ప్రభుత్వ రంగాలలోనూ చాలా తక్కువ నైపుణ్యాన్ని కలిగినవారూ ఉన్నారు అనీ తెలుస్తోంది. ఆంగ్ల ప్రచారకులూ దాని సమర్ధకులూ చెప్పుకొంటున్నట్లు ఆంగ్లమేమీ మనం వింటున్నంత ప్రాచుర్యం పొందినదేం కాదు.

4. ప్రపంచవ్యాప్తంగా పరిశోధనా పత్రాలు ఆంగ్లంలోనే వెలువడుతున్నాయి.

తప్పు. ఇంగ్లీష్ ప్రచారకులు అన్నిరకాల వ్యాపార వ్యూహాలతో ఉద్వేగపూరిత వాగ్దానాలతో దూకుడుగా వారి భాషను మార్కెటింగ్ చేస్తున్నారు. ఇంగ్లీషేతర భాషలలోని శాస్త్ర ప్రచురణల సంఖ్య మరింత వేగంగా పెరగటం ఆయా దేశాల్లోని శాస్త్ర సంఘాలు (ఉదాహరణకు చైనా, ఇండోనేషియా, ఇరాన్, టర్కీ, దక్షిణ యూరప్ మరియు లాటిన్ అమెరికాలలో) విస్తరించడమూ వైవిధ్యం చెందటమూ కూడా కారణం. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లంలో ప్రచురించబడుతున్న అన్ని శాస్త్ర పత్రికల నిష్పత్తి వాస్తవానికి క్షీణిస్తోంది. (2011, జెబి3369 ఎట్ 3369 కొలంబియా.ఎడ్యు).

చివరిగా 5. అంతర్జాతీయంగా ఇంటర్నెట్ వాడకం ఇంగ్లీషు ఆధిపత్యాన్ని సూచిస్తోంది.

పూర్తిగా నిజం కాదు. విద్యా ప్రయోజనాల కోసం ఇంటర్నెట్ వాడకం పెరగడం ఎలక్ట్రానిక్ సమాచార ప్రసార రంగంలో ప్రపంచంలో ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషల పెరుగుదలనే ప్రతిబింబిస్తోంది.

నేడు శాస్త్రవేత్తలు ఎదుర్కొంటున్న ప్రధాన విషయం, ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది స్థానికంగా పేరు కోల్పోవటమా లేక స్థానికంగా ప్రాచుర్యం పొంది ప్రపంచవ్యాప్తంగా పేరు కోల్పోవటమా అనేది. దీని నుండి బయటపడటానికి యంత్రానువాద సహాయం తప్పనిసరి.

ప్రపంచీకరణ సమర్ధవంతంగా పనిచేయాలంటే అనువాదాలు ఎక్కువ రావటమే కాదు సమాంతరంగా సాగాలి. తద్వారా ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు అనేక రకాల విద్యావిషయక పరిజ్ఞానం అందుబాటులో వస్తుంది.

ప్రతి బహుళజాతి సంస్థ లేదా వ్యాపార వాణిజ్య సంస్థ తన విస్తరణకు ఇంగ్లీషేతర భాషను మాట్లాడే సమాజాన్ని తన అభివృద్ధికి అడ్డంకిగా చూస్తోంది. ముందుగా ఇట్లాంటివారి దృక్పథంలో మార్పుతేవాలి. అందుకు ప్రభుత్వాలు సాంప్రదాయ వ్యాపార వాణిజ్య లావాదేవీలలో భాషను గురించి కొన్ని తప్పనిసరి ఆంక్షలు విధించాలి.

అనువర్తిత శాస్త్రాలలో చెప్పే మొదటి పాఠం ప్రయోగశాల నుండి క్షేత్రానికి తప్పనిసరి ప్రయాణం. అయితేనేం అలవాటుగా పరిశోధనల ప్రచురణలకే పెద్దపీట వేసే మన విశ్వవిద్యాలయాలూ సంబంధిత రాజకీయాల ఒత్తిడితో క్షేత్రాలవేపు నడకను పట్టించుకోలేదు. అయితే సమాజంలో వచ్చే సంక్షోభాలు అప్పుడప్పుడు ఈ నడకను సరిదిద్దవలసిన అవసరాన్ని గుర్తుచేస్తాయి.

కొత్తపుంతలు తొక్కుతున్న టెక్నాలజీ ఇంజనీరింగు ఉత్పాదనలు సమాజంలో సృష్టిస్తున్న విపరీతాల ప్రకంపనలలో ఒకటి భాషాసంక్షోభం. అది 20 ఏళ్ల కిందటే మొదలైనా అది ఒక ఉత్పాతంగా బలంగా మనల్ని తాకడానికి రెండు దశాబ్దాలు పట్టింది. విద్యారంగంలో కేజీ టూ పీజీ ఆంగ్ల మాధ్యమమే అది. ఇకనుండి దాని పర్యవసానాలూ ప్రభావాలకు సమాజం వచ్చే రెండు దశబ్దాలలో కోలుకోలేని దెబ్బకు విలవిల్లాడిపోవాల్సిందే. జరిగే ఘోరాలూ అన్యాయాలూ సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టుతుంది. ఈ సంక్షోభం నుండి బైటపడాలంటే పాఠశాల విద్యలో మాతృభాషా మాధ్యమం తప్పనిసరి చేయాలని ఉద్యమించక తప్పదు. ఈ ఉద్యమానికి

## నేడు నేర్వడానికి ఉండని భాష, రేపు వాడకానికి మిగలదు

ప్రజలు కోరుకున్న భాషలో వ్యవహారాలు సమాజంలోని వ్యక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా సాగాలంటే, ముందు సమాజంలో మాతృభాషామాధ్యమం గురించి శాస్త్రీయ అవగాహన కలిగించాలి. అందరినీ ఒకతాటి పైకి తీసుకురావాలి. అనేక సందర్భాలలో, సభలలో వేదికలపైనుంచి తెలుగు శ్రేయస్సు కోరుతూ పండితులూ, రచయితలూ, సాహితీవేత్తలూ, పాత్రికేయులూ, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక తంత్రజ్ఞులూ, సామాజిక, రాజనీతికోవిదులూ, అధికారులూ, రాజకీయులూ, పాలకులూ ఇంకా అనేకమంది తెలుగు భాష ఇంకా అభివృద్ధి చెందాలి, పారిభాషిక పదాలను నిర్మించుకోవాలి. నిఘంటువులు కూర్చాలి, అనువాదాలు రావాలి. కొన్ని అక్షరాలను తగ్గించుకోవాలి. తెలుగుకోసం కొత్త సంస్థలను ఏర్పాటు చేద్దాం. ఆధునిక భాషగా తీర్చిదిద్దుకోవాలి. ఇట్లా వందలాది సూచనలూ, ప్రస్తావనలూ, ప్రతిపాదనలూ చేస్తున్నారు. ప్రస్తుతం ఇవన్నీ అప్రస్తుత ప్రసంగాలే. విద్యా మాధ్యమంగా తెలుగును తొలగించే జీవోలు విడుదలైనప్పుడు ఇవన్నీ కాలయాపనకే పనికొస్తాయి. తెలుగును బోధనా మాధ్యమానికి దూరం చేస్తే, వచ్చే రెండు దశాబ్దాలలో జరగబోయే విధ్వంసం దానితో కలిగే సామాజిక సంక్షోభం యుద్ధం కంటే భయానకమైనది. నేరుగా మనుషులను చంపటం అనాగరికం. అది నిన్నటి మాట. భాషల్ని చంపితే చాలు. ఇది నేటి మాట. ఇప్పటివరకూ స్థానిక భాషలపై ప్రత్యక్షంగా ఆధారపడి నడుస్తూ లక్షలాది మందికి జీవనోపాధినిస్తున్న టీవీ చానెళ్లూ, సినిమాలూ, పత్రికా ప్రచురణలూ, ప్రకటనా వ్యవస్థలూ, గ్రంథ ప్రచురణలూ, వీటిలో పనిచేస్తున్నవారూ, రచయితలూ, కవులూ, గాయకులూ, అధ్యాపకులూ, ఇతర సాంప్రదాయ వృత్తిపనివారల మీదే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరందరూ తెలుగూ తదితర మాతృభాషలే ఆధారంగా సంపద సృష్టిలో పాలుపంచుకుంటున్నవారు. రెండు దశాబ్దాల తర్వాత వచ్చే ఇంగ్లీషు నేర్చిన యువజనానికి వీటి అవసరాలే లేక వీటి ప్రాముఖ్యత తగ్గి ఇవన్నీ అంతరించే ప్రమాదం అంచుకు చేరతాయి. ఇప్పటివరకూ లక్షలాదిమందికి జీవనాధారమైనవి మూలబడిపోతాయి. దీన్ని అడ్డుకోవాలంటే మాతృభాషా మాధ్యమమే ఉండాలి.

తెలుగులో పనిచేయాల్సిన మన న్యాయవ్యవస్థలో వందలాదిమంది జిల్లా, తాలూకా జడ్జీలతోనూ, వేలాదిమంది అడ్వకేట్లూ వారిపై ఆధారపడ్డ లక్షలాదిమంది చిరుద్యోగులూ (జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ తెలుగులో పనిచేయాలని జీ.ఓ. ఉంది) ఉన్నారు. మాతృభాషా మాధ్యమానికి న్యాయవ్యవస్థ పాదుకాపు కావాలి. భారత న్యాయవ్యవస్థలోని నిష్పాక్షిక నేరవిచారణ సూత్రాల ప్రకారం, ఎవరికి వ్యతిరేకంగానైనా నేరారోపణ జరిగిన పక్షంలో, సంపూర్ణ సమధర్మవిధానంలో, నేరారోపణ స్వభావం, దాని కారణం, ముద్దాయికి తెలిసిన భాషలో పూర్తి సమాచారాన్ని వివరించాలి. ఒకవేళ, నేరారోపణకు ఆధారమైన సాక్ష్యం, తెలియని భాషలో కనుక నమోదు చేయబడితే, దాన్ని నిందితునికి తెలిసిన భాషలో వివరించాలి. అంటే, దోషారోపణ సమాచారాన్ని ముద్దాయికి తప్పనిసరిగా వారి సొంతభాష లోకి అనువదించి అందించాలని అర్థం. ఆరోపణలకు సంబంధించిన ఆధారాల వివరణ లను నిందితవ్యక్తి లేదా వారి తరఫు న్యాయవాదికి అందించడం అవసరం. అంటే, ముద్దాయికి వ్యతిరేకంగా వారికి తెలియని భాషలో సాక్ష్యం గనుక ఉంటే, దాన్ని వారికి తెలిసిన భాషలో వివరాంచాలి; ఒకవేళ ముద్దాయి తరఫు న్యాయవాదికి తనకు తెలియని భాషలో గనక సాక్ష్యం ఉ ంటే, దాన్ని తనకి తెలిసిన భాషలో వివరించాలి. మన న్యాయ వ్యవస్థ న్యాయస్థానాలలో సొంతభాష వాడకం గురించి ఇంత నిక్కచ్చిగా చెబుతుంటే మనం ఏం చేస్తున్నాం. జిల్లాస్థాయి వరకూ న్యాయస్థానాలలో భాషావినిమయం పూర్తిగా స్థానిక భాషలలో జరిగే అవకాశం ఉన్నా నీరుగార్చేస్తున్నాం. ♦

**(తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం పుస్తకం నుండి)**

---

ఊపిరిగా సాంప్రదాయ మాటల మూటలూ తిట్లూ శాపనార్థాలూ కాదు కావలసింది, మాతృభాషల ఆర్థిక జవసత్వాల నిరూపణతో ఇంగ్లీషు ప్రచారకులు లేవనెత్తిన సవాళ్లకు దీటుగా తార్కిక పద్ధతిలో హేతువాద సరళిలో లెక్కలు గట్టి సమాధానాలు కూడగట్టి చూపించాం. ఈ వ్యాసాల్లో మేము చేసింది అదే. ఈ వ్యాసాలు ఇట్లా వచ్చేందుకు ఎంతోమందితో ఎన్నో రోజులు ఎన్నో ఆలోచనలను పంచుకొని చర్చించాం.

**(ముందుమాట నుండి సంక్షిప్తంగా)** ♦

# అమ్మభాష అభివృద్ధి- ఒక ప్రజాస్వామిక అవసరం

**- తెలకపల్లి రవి**

***ఇంగ్లీషు అంతర్జాతీయ భాష గనక దాన్ని నిరోధించాలనుకోవడం ఛాదస్తమని, అసంభవమని అనుకోవడం అంతకంటే పొరబాటు. ఎందుకంటే ఇది కేవలం తెలుగుభాష ఒక్కదానికే సంబంధించిన సమస్య కాదు: కేవలం మనోభావాలకో సంస్కృతీ సాహిత్యాలకో పరిమితమైన అంశం అంతకంటే కాదు. మాతృభాష ఇంకా చెప్పాలంటే అమ్మభాష అభివృద్ధి అనేది ఆయా జనసముదాయాల పురోగమనానికి సంపూర్ణ వికాసానికి అనివార్యమైన షరతు. ప్రజల జీవితాలకే కాదు - ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి కూడా అది తప్పని సరి అవసరం.***

మన దైనందిన జీవితానికి ఇరుసు భాష. సమాజ జీవనానికి సంధానకర్త భాష. సంస్కృతికి వ్యక్తీకరణ భాష. దేశ భాషలందు తెలుగు లెస్స అని కృష్ణదేవరాయలు అంటే పాశ్చాత్యులు తెలుగును ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అన్నారు. యూరోపియన్ భాషలలో ఇటాలియన్‌కు సంగీతపరమైన లక్షణాలు ఎక్కువగా వున్నట్టే ప్రాచ్య భాషలలో తెలుగుకు సంగీతగుణం వుండటం వల్ల ఇలా అన్నారు.

తెలుగు భాషాభివృద్ధిని గురించి, అకారణమైన ఆంగ్లభాషా వ్యామోహం గురించి పదే పదే మాట్లాడుకోవడం సెంటిమెంటుకు సంబంధించిన సమస్య అని ఎవరైనా అనుకుంటే పొరబాటే. ఇంగ్లీషు అంతర్జాతీయ భాష గనక దాన్ని నిరోధించాలనుకోవడం ఛాదస్తమని, అసంభవమని అనుకోవడం అంతకంటే పొరబాటు. ఎందుకంటే ఇది కేవలం తెలుగుభాష ఒక్కదానికే సంబంధించిన సమస్య కాదు: కేవలం మనోభావాలకో సంస్కృతీ సాహిత్యాలకో పరిమితమైన అంశం అంతకంటే కాదు. మాతృభాష ఇంకా చెప్పాలంటే అమ్మభాష అభివృద్ధి అనేది ఆయా జనసముదాయాల పురోగమనానికి సంపూర్ణ వికాసానికి అనివార్యమైన షరతు. ప్రజల జీవితాలకే కాదు- ప్రజా స్వామ్యం పరిఢవిల్లడానికి కూడా అది తప్పని సరి అవసరం.

భాషా, సాహిత్య విషయాలలో ప్రజాస్వామీకరణ జరగకుండా సంపూర్ణ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడ్డం అర్థం లేని విషయమన్నవారు మహాకవి గురజాడ అప్పారావు. ఆయన కేవలం కవి మాత్రమే కాదు, గిడుగుతో కలసి వ్యవహార భాషోద్యమ సారథ్యం వహించిన మహావ్యక్తి. అప్పుడూ ఇప్పుడూ కూడా తెలుగు గురించి మాట్లాడేవారిలో చాలా మంది చాదస్తులని, ఇంగ్లీషులో పట్టులేక అలా మాట్లాడుతున్నారని అపహాస్యం చేసేవారికోసం ఒక్క ముక్క చెప్పాలి. గురజాడ అన్ని విషయాల్లో తన కాలం కన్నా ముందుకు చూడగలిగిన సంస్కర్త, దార్శనికుడు. తెలుగులో కన్నా ముందే ఇంగ్లీషులో కవిత్వం రాసి, ఇంగ్లీషు పత్రికల ప్రశంసలు పొందిన ప్రతిభాశాలి. తెలుగు పాఠాంశాలను, రచనలను సంస్కృత పదభూయిష్టమైన శైలి నుంచి విముక్తి చేయకపోతే తెలుగు భాషావికాసం జరగదని, ప్రజల జ్ఞానమూ పెరగదని ఘంటాపథంగా వాదించి పోరాడిన వ్యక్తి.

సంస్కృతంలో జ్ఞానం వున్నంత వరకూ సామాన్యప్రజలు పై తరగతుల వారుచెప్పిన దానికే తలవంచక తప్పేది కాదు. అచ్చు యంత్రం వచ్చిన తర్వాత చాన్నాళ్లకు కాని అశేష జనబాహుళ్యానికి చదువుకునే అవకాశం లభించలేదు. ఆ దశలో తెలుగులో గ్రాంధిక భాష వుంటేనే ప్రజాస్వామిక స్ఫూర్తి దెబ్బతింటుందని గురజాడ చెప్పారు. మరి ఇన్నేళ్ల స్వాతంత్ర్యం తర్వాత మనది కాని భాషనే మనపైన రుద్దుతుంటే ప్రజాస్వామ్యం ఎక్కడ బతుకు తుంది?

ఇంగ్లీషు అంతర్జాతీయ భాష కావడానికి రాజకీయ కారణాలే ప్రధాన పాత్ర వహించాయి. వారు దేశ దేశాలను వలసలుగా చేసుకుని వుండకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. అలాగే మొదటి వలసాధిపత్యదేశాలైన స్పెయిన్‌వంటివి కూడా తమ భాషను విస్తారప్రాంతంపై రుద్దగలిగాయి. ఇది సామ్రాజ్యవాద పాలన ఫలితం తప్ప సహజపరిణామం కాదు. అయితే స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇదెందుకు కొనసాగగలిగింది? అంటే మనకు రాజకీయ స్వాతంత్రం తప్ప ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదని అనుకున్నట్లే వాటి సాంస్కృతిక ఆధిపత్యం కూడా చాలా మిగిలిపోయింది. హాలివుడ్ సినిమా, పాశ్చాత్య వార్తసంస్థలు, ఇంగ్లీషు భాష, డాలర్ ఇందుకు నాలుగు చక్రాలుగా ఉపయోగపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా వర్ధమాన దేశాలు పోరాటం పూర్తిచేసేలోగానే ప్రపంచీకరణ

వచ్చిపడింది. ఇంటర్‌నెట్‌కూడా పై జాబితాలో చేరింది. ఇప్పుడు దేశాల సార్వభౌమత్వాలకే ముప్పువాటిల్లిన స్థితిలో వాటి భాషాసాంస్కృతిక వికాసాల గురించి మాట్లాడ్డం అనే ప్రసక్తి లేకుండా పోయింది. ప్రపంచమంతటినీ ఒక పెద్ద మార్కెట్‌గా మార్చుకోవాలనే వ్యూహంలో దేశాల సంస్కృతులను భాషలను విధ్వంసం చేయడం శరవేగంతో జరిగిపోతోంది. ఏటా కొన్ని వందల భాషలు అంతర్థాన మవుతున్నాయని ఐక్యరాజ్యసమితికి అనుబంధమైన యునెస్కో సంస్థ నివేదిక చెబుతున్నది.

ప్రపంచీకరణ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజలలో అనేక భ్రమలు వ్యాపింపచేయబడ్డాయి. ఇంగ్లీషు వస్తే ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా చేయొచ్చునని అంటుంటారు. ఎక్కడిదాకానో ఎందుకు ఐరోపాలో దాని సాటిదేశాలైన ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి చోట్లనైనా ఇంగ్లీషు తక్కువ మంది మాత్రమే మాట్లాడతారు. చైనా, జపాన్ వంటివి సరేసరి. ఇంగ్లీషు వలసలుగా అభివృద్ధి చెందిన అమెరికా, ఆస్ట్రేలియాలలో మాత్రమే ఇంగ్లీషును విరివిగా ఉపయోగిస్తారు. అమెరికాకు తనదైన ప్రత్యేక భాష అంటూ లేదు. ఇంగ్లాండుపై పోరాడి తొలిగా స్వాతంత్ర్యం పొందిన అమెరికా దాని తర్వాత ప్రపంచంలో ప్రధాన సామ్రాజ్యవాద శక్తిగా పెరిగింది. కనక దాని అవసరాలకూ ఈ భాష బాగా సరిపోయింది. కాకపోతే ఒక విశేషం చూడగలం- అంతకుముందు కాలంలో ఇంగ్లాండు దేశ దేశాల భాషలలో పదాలు తనలో కలుపుకుంటే ఇప్పుడు అమెరికన్లు ఇంగ్లీషును వాడుకుంటూనే తమ ఇష్టానుసారం మార్చేసి అమెరికన్ ఇంగ్లీషు అనేది సృష్టించుకున్నారు. ఇక్కడా మనకు రాజకీయ ఆధిక్యతే ప్రధానంగా కనిపిస్తుంది.

తెలుగుభాషాభివృద్ధి తగినంతగా జరక్కపోవడానికి అంతర్జాతీయ ఆదిపత్యమే ప్రధానకారణం కాదు. ఇక్కడ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు దానిపై నిజంగా శ్రద్ధ పెట్టకపోవడం కూడా పొరబాటే. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు 1966లో గాని అధికార భాషాసంఘం ఏర్పడలేదు. ఆ తర్వాత నలభై ఏళ్లుగడిచినా ఇప్పటికి తెలుగును అన్ని స్థాయిలలో అధికార భాషగా ప్రతిష్టించాలన్న లక్ష్యం నెరవేరలేదు. అన్నింటికి తెలుగు అనే మాట చేర్చిన ఎన్. టి. రామారావు కూడా ఈ విషయంలో జయప్రదం కాలేకపోయారంటే పాలనా వ్యవస్థలో ఆధిపత్యవర్గాల పట్టు అర్థమవుతుంది. నిజంగా ప్రజల భాషలో వ్యవహారాలన్ని జరిగిపోతే అప్పుడు వారి ఆధిపత్యానికున్న ఒక ప్రాపు కూలిపోతుంది. పైకి ఏమి చెప్పినా పాలకవర్గాలకు కూడా జనసామాన్యానికి అన్ని తెలియజేయాలనే చిత్తశుద్ధి వుండదు. అందుకే ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా తెలుగు దీపం బిక్కుబిక్కుమంటూనే వుంది. సరైన వ్యూహం లేక కృత్రిమ పద్ధతులను అనుసరించడం కూడా తెలుగు అధికార భాషగా, ఉన్నత విద్యాభాషగా వికసించడానికి ఆటంకమైంది. బహుషా చారిత్రికంగా మరికొన్ని కారణాలు తోడవడంతో తమిళం, మళయాలం, బెంగాలీ భాషల వారిలో వున్నమేరకైనా తెలుగువారికి భాషాభిమానం వుండటం లేదు. ప్రతిదానికి 'ఇంతకంటే ఇంగ్లీషే మెరుగు' అనే ధోరణి ప్రబలంగా వుంటోంది. తరచూ ఉదహరించబడే మమ్మీ డాడీ సంసృతి పెరిగింది. మనలను పాలించడానికి వచ్చిన బ్రౌన్ తెలుగు నేర్చుకుని వెలలేని వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదిస్తే మనం వాటిని ఇంగ్లీషు అనువాదంతో చదువుకునే దురవస్థ ప్రాప్తించింది. నాలుగు అంటే ఫోరే కదా అని అడిగే పిల్లలకు నలుగురు కలసి నవ్వాలి అని చెప్పడంలోని తెలుగు దనం ఎలా అర్థమవుతుంది? అమ్మభాషను కోల్పోవడంతో మొదలైన పరాయీకరణ మాతృదేశాన్ని ఆఖరుకు మాతృమూర్తులను కూడా పట్టించుకోని స్థితికి చేరుతున్నది.

మనుషులను కలిపివుంచే అంశాలలో అన్నిటికన్నా ముఖ్యమైన అనుసంధాన పాత్ర భాషది. కులం, మతం, ప్రాంతం వగైరా విభజనలన్ని కృత్రిమమైనవి. అందుకే మన జాతీయోద్యమం భాషా ప్రాతిపదికను గుర్తించింది. విశాలాంధ్రకై ఉద్యమం సాగింది. తెలంగాణా, ఆంధ్ర వంటి విభజనలకు అతీతమైన అంశం తెలుగుభాష. నిజానికి ఆంధ్ర భాషా శబ్దమే ముందుగా ఉపయోగించినట్టు దాఖలాలున్నాయి. తెలుగు, తెనుగు తర్వాత దానికి సమానార్థకాలుగా పెరిగాయి. తెలంగాణా అన్న మాట కూడ తెలుగు నుంచే వచ్చిందని బలమైన వాదనలున్నాయి. త్రిలింగం, తెలుంగం వగైరాలు కూడా ఆ కోవకు చెందినవే. అవాంఛనీయ సంవాదాల సందర్భంలో ఇలాటి పలు వాస్తవాలు మరుగునపడి పోతుంటాయి. తెలంగాణా భాష అంటూ కొందరు చెబుతున్న మాట కూడా చరిత్రకు శాస్త్రానికి నిలిచేది కాదు. తాత్కాలిక భావోద్వేగాలకు అతీతంగా తెలుగు భాష చరిత్రను విశిష్టతను అర్థం చేసుకోవలసిన అవసరముంది. మూడు వేల సంవత్సరాల చరిత్ర గల తెలుగు ప్రపంచంలో అతి ప్రాచీన భాషలలో ఒకటి.

జీవన పోరాటంలో భాష ఒక ఆయుధం అంటాడు మార్క్స్. ఎంగెల్సు స్వయంగా బహుభాషా కోవిదుడు. నేడు

ప్రధానమైన అంతర్జాతీయ భాషగా సాంకేతిక సంధాయినిగా వున్న ఇంగ్లీషును వదులుకోమని కూడా ఎవరూ చెప్పరు. సమస్యంతా దానికి ఇతర భాషలను బలిపెట్టడాన్ని అడ్డుకోవడమే. ఎంతమంది మాట్లాడతారనేదానితో నిమిత్తంలేకుండా ప్రపంచంలో 6000 భాషలు వున్నాయి. వాటన్నిటినీ కాపాడుకోవడం లక్ష్యంగా 2000 సం.నుంచి యునెస్కో ప్రత్యేకంగా కృషి చేస్తున్నది. తక్కువ మంది మాట్లాడే భాషలను కాపాడుకోవడం మరింత అవసరమని అది నొక్కి చెబుతున్నది. లేకపోతే మానవాళి వైవిధ్యాన్ని సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకోవడం సాధ్యం కాదు. ఈ విధంగా చూసినపుడు ఎంతో పెద్దదైన తెలుగును కాపాడుకోవడం కాలానుగుణంగా మెరుగుపరుచుకోవడం ఇంకా కీలకమైన కర్తవ్యమవుతుంది. విశాల ప్రాతిపదికపై బహుముఖ వ్యూహంతో సాగవలసిన పని ఇది. అప్పుడే మన తెలుగు తల్లికి మల్లెపూదండ వేసినట్టు.

## భాష

ఖచ్చితంగా ఇప్పటికి తొంభై సంవత్సరాల కిందట తెలుగులో బోధనా భాష ఎలా వుండాలనే దానిపై భీకర పోరాటం జరిగింది. ఆ పోరాటంలో గిడుగు, గురజాడ వారి మిత్రులు ఒకవైపున వున్నారు. నవ్యాంధ్ర వైతాళికుడుగా ప్రసిద్ధుడైన కందుకూరి వీరేశలింగంతో సహా అనేక మంది మరో వైపున వున్నారు.

“విశాల ప్రజానీకం చదువుకోవడం పూర్వాచార సంప్రదాయంలో భాగం కాదు. నాడు జ్ఞానార్జన సాహిత్యం బ్రాహ్మణుని గుత్తసొమ్ము. అతని దృష్టిలో సంస్కృతం పెట్టిన వరవడి పవిత్రమైనదీ, మీరరానిదీ.... సంస్కృత సాహిత్యం క్షీణదశలో వున్న కాలంలో తెలుగు సాహిత్య సృష్టి ప్రారంభమైనందున ఆ క్షీణదశ లక్షణాలైన భాషా, కళా సంప్రదాయాలు తెలుగు సాహిత్యంలో పాతుకుపోయాయి”... “ రాజకీయ రంగాల్లో లాగానే భాషారంగంలో కూడా ప్రభు వర్గయిక తత్వమూ వేర్పాటుతత్వమూ చివరకు పతనోన్ముఖం కాక తప్పవు. అనేకుల అవసరాలు ప్రయోజనాలు కొద్దిమంది వాటి కన్నా ముఖ్యమైనవి. తుదకు వాటిదే పై చేయి అయి తీరుతుంది..”

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బోధనా భాష విషయమై సాగిన వాదోపవాదాలలో గురజాడ అప్పారావు అసమ్మతి పత్రం తిరగేస్తే ఇలాటి చాలా అంశాలు కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి.

సమాజంలో ఉత్పత్తి సాధనాలు, రాజకీయ సామాజిక పరిస్థితులు మారినప్పుడల్లా భాష కూడా చర్చనీయం కావడం అసహజమేమీ కాదు. అవసరం కూడా. ఎందుకంటే ఏ మార్పునైనా భాషలోనే చూడగలం. భాషను భావ వ్యక్తీకరణ సాధనం అంటారు. ఎక్స్‌చేంజి అఫ్ ఐడియాస్ అన్నమాట.

ప్రవాహం లాటి భాషలో ప్రమాణాలు ఎప్పుడూ సాపేక్షమే. ప్రమాణీకరణ అనే అనుకుంటే ఏ ప్రమాణం అన్నది ప్రశ్నార్థకమవుతుంది. అత్యధిక జనానికి అందుబాటులో వుండటం, ఆమోదయోగ్యంగా వుండటం, అభివృద్ధికి ఉపకరించేదిగా వుండటం, ఆధునీకరణ అవకాశాలు కలిగివుండటం ఇవే భాషా విధానంలో కీలకాంశాలని తరతరాలుగా అన్ని అన్ని దేశాల అనుభవం చెబుతున్నది.

దురదృష్టవశాత్తూ భాషగురించిన చర్చలో తరచూ ఈ మౌలికాంశాలు విస్మరించబడుతుంటాయి. తక్షణ రాజకీయ ప్రభావాలూ, దీర్ఘ కాలిక ప్రయోజనాల మధ్య అంతస్సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకోవడంలో వైఫల్యం కనిపిస్తుంటుంది. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిలుగా వున్న బోధనా భాష, సాహిత్య భాష, మీడియా భాష, శాసన భాష, వాడుక భాష వీటన్నిటినీ విడివిడిగానూ ఉమ్మడిగానూ చూడటంలో పాటించవలసిన సమగ్ర దృక్పథం లోపిస్తుంటుంది. ఏమైనా అది కూడా భాషాభివృద్ధిలో భాగమైన పరిణామంగానే చూడాల్సి వుంటుంది.

ఉదాహరణకు ఈ నాటి మన వాదనలను బట్టి ఒకనాడు వ్యవహార భాష లేదా వాడుకభాష వాదన చేసిన వారి చిత్తశుద్ధిని విశాల దృష్టిని తప్పుపట్టనవసరం లేదు. ఛాందసులకు వ్యతిరేకంగా జన సామాన్యం మేలు కోసమే వారు ఆ పనిచేశారు. తెలుగుకు ప్రామాణికత్వం లేదు అన్నప్పుడు వుంది అని నిరూపించడానికి కృష్ణా, గోదావరి మండలం భాష ఎక్కువ ఆమోదయోగ్యంగా వుందని గురజాడ గిడుగు చెప్పారు తప్ప దానికి మిగిలిన భాషలకన్నా ఆధిక్యత వుందని చెప్పలేదు. ఆ పరిస్థితి రావడానికి రాజకీయ చారిత్రిక కారణాలు కూడా గురజాడ చెప్పారు. ఆ నాటికి తెలంగాణా ఇంకా నైజాం పాలనలో వున్నందున, ఆంధ్ర విశ్వవిద్యాలయం చర్చలో దాని విషయం ప్రస్తావనకు వచ్చే అవకాశం లేదు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ తర్వాత యాభై ఏళ్లలో మూడు ప్రాంతాల ప్రజలూ అర్థం చేసుకుని ఆనందించగల తెలుగు రూపొందింది. కనకనే పత్రికలు, టీవీలు, సినిమాలు, వ్యాపారాలు, పెళ్లిపేరంటాలు వగైరాలన్ని నిరాటంకంగా సాగిపోతున్నాయి. ఇదంతా ఎవరో పనిగట్టుకుని రుద్దారని

## పాట

చేయెత్తి జై కొట్టు తెలుగోడా
సొంత భాషలో చదువు లేనోడా
ఇంగ్లీషు నేర్పితే ఎవరు వద్దన్నారు
తెలుగు వద్దంటేనే దిగులుపడుతున్నారు
అమ్మ పాలతో మనము పెరిగాక
తల్లిభాష వద్దనుట తప్పేకదా ॥ చేయెత్తి ॥

అర్థరహితంబైన ఆంగ్లవ్యామోహంబు
అట్టడుగువర్గాల అభివృద్ధికే చేటు
అవగాహనేలేని ఆకర్షణ
ఆచరణ చూస్తేనే ఆందోళన ॥ చేయెత్తి ॥

సన్నాహమేలేని అర్జంటు మార్పులు
సాగేటి చదువులకు వేసేను బ్రేకులు
కాస్త ఆలోచించు జగనన్నా
మంచి చెడ్డలు తెలియు నిజమన్నా

చేయెత్తి జై కొట్టు తెలుగోడా
సొంతభాషను కోరు మొనగాడ !

- తెలకపల్లి రవి

అనడంలో వాస్తవికత లేదు. ఎవరో కొందరిలో అలాటి సంకుచితత్వాలు వున్నా వాటిని కొలబద్దలుగా తీసుకోనవసరం లేదు. ఏ భాషా ప్రయోగమూ ప్రత్యేకించి గొప్పది కాదు, ఏదీ హీనమైనది కాదు. అన్ని భాషలూ, మాండలికాలు తమ తమ పరిమితులలో సమాజ పరిణామ క్రమంలో పెరిగినవే. రాజకీయ చారిత్రిక కారణాల వల్ల వాటిలో బహుళవ్యాప్తి పొందిన అంశాలను పనిగట్టుకుని మార్చాల్సిన అవసరమూ లేదు, ఆచరణలో సాధ్యమూ కాదు. ఆనాడు వీర గ్రాంధిక వాదుల రచనలలో కూడా వ్యవహారిక ప్రయోగాలను గిడుగు ఎత్తిచూపించి నట్టే ఈనాడు ఫలానా మాండలికం గొప్పదని వాదించే ఎవరి రచనలోనైనా మరో మాండలికం ప్రభావాన్ని చూపించవచ్చు. ఎందుకంటే వాస్తవంగా వున్న పరస్పరత వాదనలతో అదృశ్యమై పోదు. ఈ వాస్తవాన్ని గుర్తించగలిగితే అనవసరమైన చాలా వాదనలు నిలవవు.

ప్రాథమిక దశలో పదాలు, వాక్యాలు నేర్చుకోవడానికి పిల్లలకు పరిచితమైన భాష వుండాలని అన్ని పరిశోధనలూ, అన్ని అధ్యయనాలూ చెబుతున్నాయిది. పరిసరాల భాషలో ప్రాథమిక భాషాభ్యసనం తేలిగ్గా త్వరగా జరుగుతుంది. టీచర్ రాసిన సిల్వియా, పిల్లలపై అనేకపరిశోధనలు చేసిన జాన్‌హోల్డ్, గిజుభాయి అందరి అనుభవాలూ ఈ ప్రాథమిక సత్యాన్ని చెబుతాయి. భాషపై ఒకసారి పట్టు చిక్కితే ఆ పైన వైరుధ్యాలు, మెళకువలు నేర్చుకోవడం మరింత సులభం. తరచూ ఉటంకించబడే కొఠారీ కమీషన్ సిఫార్సులలో కమ్యూనిటీ పాఠశాలలు అన్న భాగం మన వాళ్లు పట్టించుకోలేదు. పరిసరాలకు అనుగుణంగా వున్న పాఠశాలలే పిల్లల చదువును సులభతరం చేస్తాయని ఆయన నొక్కిచెప్పారు. తెలిసిన విషయాలు తెలిసిన భాషలో చెప్పుకోగల అవకాశం వుంటుందనే ఆయన ఆ సిఫార్సు చేశారు.

పరిసరాల భాషలో పాఠ్యపుస్తకాలు ఎన్ని తయారు చేయగలమనే ప్రశ్న ఒకటి. ఒక్క పుస్తకమే సక్రమంగా అందించలేని సర్కార్లు అన్ని రకాలై వైవిధ్యభరితమైన పుస్తకాలు అందించగలవని ఎవరూ నమ్మరు. ఆ పనిచేయలేకపోతే కనీసం పాఠాల చివరలో ప్రత్యామ్నాయపదాలనైనా పొందుపరచొచ్చు.

ఇంగ్లీషు వల్ల తెలుగుకు ప్రమాదం వుందా లేదా అనే చర్చ అప్రస్తుతం. ఆధిపత్య సంస్కృతి వేటు అన్ని రంగాలపైనా పడుతుంది. వేషభాషలలో భారతీయులైనా మనలా ఆలోచించగలవారిని తయారు చేసే విద్యావిధానం కావాలని మెకాలే ఎప్పుడో చెప్పాడు. ఈనాడు మన ప్రధాని నేరుగా లండన్ వెళ్లి మీరే మాకు సంస్కార ప్రదాతలని సాష్టాంగపడుతున్నారు. అక్కడి నుంచి నేరుగా వాషింగ్టన్‌లో ఆగి వారి ప్రజాస్వామ్య స్ఫూర్తికి జేకొట్టి ప్రత్యక్ష తనిఖీలకు ఆహ్వానిస్తున్నారు. కనక ప్రపంచీకరణ దాడి ఏ ఒక్క అంశానికో పరిమితమైంది కాదు. సామాజిక జీవితంలో అతికీలకమైన భాష అందుకు మినహాయింపూ కాదు. ప్రజల చైతన్యం పెరగాలన్నా, అందుకు ప్రాతిపదిక అయిన జ్ఞానం విస్తరించాలన్నా అత్యధికులకు అందుబాటులో వుండే భాషా విధానం తప్పనిసరి. ఎనభై తొంభై ఏళ్లనాటి వ్యవహార భాష ప్రమాణాలు పరిస్థితులతో పాటు మారుతూనే వున్నాయి. వాటిని మరోసారి సాకల్యంగా సమీక్షించుకుని ప్రజాస్వామిక దృక్పథం రూపొందించుకోవడమే ఇప్పుడు జరగాల్సింది. ఇందులో ఉద్వేగాలకు, ఉద్రేకాలకు ఆస్కారం ఎంత తక్కువైతే అంత మంచిది.

ఉపేక్షిత వర్గాలు చదువు దరిదాపుల్లోకి రాకపోవడానికి ఆర్థిక కారణాలతో పాటు బోధనా పరమైన కారణాలూ వున్నాయన్న మాట అనుభవంతో చెబుతున్నది తప్ప వూహాత్మకమైనది కాదు. దానికి పరిష్కారమూ ఆచరణ యోగ్యంగా వుండే పరిష్కారం వెతకడం అందరి బాధ్యత. ♦

# మాతృభాషను రక్షించుకుందాం

**- చేకూరి రామారావు**

***తెలుగు భాషకు అన్ని వైపుల నుంచి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. తెలుగు భాషాభిమానులు తగిన చర్యలు తీసుకోకపోతే కొన్నాళ్లకు తెలుగు అనేది లేకుండా పోవచ్చు. భాషకు పుట్టుక ఉన్నట్టే మరణం కూడా ఉండొచ్చు. బహుశః తెలుగు ఇప్పుడిప్పుడే మరణించకపోవచ్చు గాని తెలుగు పేరుతో మిగిలింది మనం అనుకునే తెలుగుతో పోలికలేని పరిస్థితి రావచ్చు. చరిత్రలో అట్లాంటి ఘట్టాలు లేకపోలేదు. భాషా మిశ్రమాల వల్ల ఏర్పడ్డ భాషలు అంగవికలురతో సమానం. అయితే "మాతృభాష నేర్చుకోకపోతే ఏం? ఏం కొంప మునిగింది? సెంటిమెంటు కోసం మాతృభాష నేర్చుకోవాలి?" వంటి ప్రశ్నలు మనకెదురవుతాయి, మాతృభాషపై సెంటిమెంటు, భక్తి, ప్రేమ ఉండటం నేరం కాదు. కాని మాతృభాషను రక్షించుకోవాలనటం కేవలం సెంటిమెంటల్ వ్యవహారం మాత్రం కాదని మనవి చెయ్యదల్చుకున్నాను.***

తెలుగు భాషకు అన్ని వైపుల నుంచి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. తెలుగు భాషాభిమానులు తగిన చర్యలు తీసుకోకపోతే కొన్నాళ్లకు తెలుగు అనేది లేకుండా పోవచ్చు. భాషకు పుట్టుక ఉన్నట్టే మరణం కూడా ఉండొచ్చు. బహుశః తెలుగు ఇప్పుడిప్పుడే మరణించకపోవచ్చు గాని తెలుగు పేరుతో మిగిలింది మనం అనుకునే తెలుగుతో పోలికలేని పరిస్థితి రావచ్చు. చరిత్రలో అట్లాంటి ఘట్టాలు లేకపోలేదు. భాషా మిశ్రమాల వల్ల ఏర్పడ్డ భాషలు అంగవికలురతో సమానం.

అయితే "మాతృభాష నేర్చుకోకపోతే ఏం ? ఏం కొంప మునిగింది? సెంటిమెంటు కోసం మాతృభాష నేర్చుకోవాలి?" వంటి ప్రశ్నలు మనకెదురవుతాయి, మాతృభాషపై సెంటిమెంటు, భక్తి, ప్రేమ ఉండటం నేరం కాదు. కాని మాతృభాషను రక్షించుకోవాలనటం కేవలం సెంటిమెంటల్ వ్యవహారం మాత్రం కాదని మనవి చెయ్యదల్చుకున్నాను.

భాషాశాస్త్రజ్ఞులు భాషను అర్థం చేసుకోటానికి చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. వాళ్ల ఆలోచనలో ఉన్నది మాతృభాషగా వ్యవహరించే భాషే. మాతృభాష అంటే ప్రజలు తమ ఆలోచనలు అన్ని విధాలా వ్యక్తీకరించగల భాష. దీనికి మాతృభాష అనే పేరులో అర్థస్ఫూర్తి కన్నా సెంటిమెంటుకు అవకాశం ఇచ్చే పద సంయోజన ఉంది. ఇప్పుడు దాని పేరు మార్చుకోవాల్సిన అవసరం లేదు గాని అర్థ స్పష్టత ఏర్పర్చుకోవాలి. మాతృభాష తొలుత తల్లి దగ్గర నేర్చుకునేదే అయినా తల్లిభాషకే పరిమితం కాదు. కుటుంబం బయట నుంచి కూడా నేర్చుకుంటాం. భాషకు ఎన్ని రకాల నిర్వచనాలున్నా అవి అన్నీ అసమగ్రాలే. నిర్వచనాలపై అంత పట్టింపు అక్కర్లేదు. కొన్ని నిర్వచనాలకు లొంగనంత మాత్రాన వాటిని గురించి తెలుసుకోటం మానం. అధ్యయనానికి నిర్వచనం ఒక ఆరంభం మాత్రమే.

భాషకూ భాషేతర భావ ప్రకటన సాధనాలకూ మధ్య ఉన్న భేదాలను అధ్యయనం చెయ్యటం ద్వారా భాషను గురించి తెలుసుకోవచ్చు. అందులో భాషకు మాత్రమే ఉన్నట్లు లక్షణాలు చెప్పబడుతున్నాయి. భాషలో చెప్పే భావాలకు దేశకాలావధుల్లేవు. భాషలో చెప్పే భావాలకు సత్యనిర్ధత లేదు. భాషలో వాక్యాలకు గరిష్ఠ పరిమితి లేదు. ఆ మాట కొస్తే వాక్య దైర్ఘ్యా0నికి కూడా పరిమితి లేదు. ఇవన్నీ వేరు వేరు లక్షణాలుగా చెప్పినా వీటి అన్నిటి మూల తత్త్వం ఒకటే. దాన్నే హాకెట్ openness అనీ, ఛామ్స్కీ infinity అనీ అన్నారు. ఈ రెంటినీ కలిపి 'అనవధికత' అనవచ్చు. ఈ అనవధికతనే మరోకోణం నుంచి చెపితే సృజనశక్తి (creativity) అనవచ్చు. సృజనశక్తి అంటే అభావాన్ని భావించటం, ఒక్కోసారి భావనను రూపించటం. దీన్నే కల్పనశక్తి అనవచ్చు. మొదటే అనుకున్నట్టుగా ఈ శక్తి మాతృభాషలోనే ఉంటుంది. అయితే మనవాళ్లు కొందరు ఇంగ్లీషులోనో, ఉర్దూలోనో కవిత్వం చెప్పటం లేదా అని అడగొచ్చు. అయితే అది కవిత్వం అని ఆ భాషా వ్యవహర్తలు అంగీకరించాలి. అట్లాంటి అంగీకారాన్ని పొందగిలిగితే, బహుశా వాళ్ళు పరభాషను మాతృభాషలాగే నేర్చుకొని ఉంటారు. ఇక్కడ కవిత్వం గురించి చెప్పటం కవిత్వం ఒక్కటే సృజనాత్మక వ్యాపారమని కాదు. అందరికీ తెలిసిన వ్యాపారమని.

పిజిన్ (pidgin) , క్రియోల్ (creole) వంటి భాషల్లో

కవిత్వం ఉండకపోవటం కూడా గుర్తించదగింది. మొదటిది సంకరభాష, రెండోది సరళీకృత సంకుచిత భాష.

మనిషికీ, జంతువుకూ ప్రధానభేదం సృజనాత్మకత. అందుకవకాశమిచ్చేది భాష. భాష అంటే పైన చెప్పిన అర్థంలో మాతృభాష. మానవుల సృజనశక్తికి భాష ఒక వేదిక, ఒక సాధనం. స్వభాషపై తగిన పట్టు లేకపోతే ఆ వ్యక్తి సృజనశక్తి కుంటుపడుతుంది. ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ఏ భాషా అధీనంలో ఉండదు. ఏ భాషనూ క్రియేటివ్‌గా ఉపయోగించలేరు. వీళ్లు చివరికి డబ్బు సంపాయించే యంత్రాలుగానో, మందిపై పెత్తనం చేసే ప్రభుత్వోద్యోగులుగానో తయారవుతారు. వివిధ విషయాలను వివేచించి నూత్నాంశాలను ఆవిష్కరించే శక్తి వీళ్ళకుండదు. వీరిలో కాస్త తెలివైన వాళ్లు బహుళజాతి సంస్థల వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగపడినంతగా దేశప్రజలకు ఉపయోగపడరు.

ప్రధాన యంత్రాంగాల్లో భాషలన్నీ సమానమే కావచ్చు. మౌలికమైన వ్యక్తీకరణ విధానాలు అన్ని భాషల్లోనూ కనిపించవచ్చు. అయితే అన్ని విషయాల్లోనూ భాషలు సమానం కాదు. పదనిర్మాణంలో సంస్కృతానికి ఎక్కువ సౌకర్యాలున్నాయి. ఆ పదనిర్మాణ రీతుల్ని భారతీయ భాషలు గ్రహించాయి. సమాన, పద కల్పన సౌకర్యాల వల్ల సాంకేతిక పద నిర్మాణంలోనూ, వివిధార్థచ్ఛాయల్లో సమానార్థక పదాల నిర్మాణంలోనూ సంస్కృతం తెలుగుకు ఉపయోగించింది. సంస్కృతం అవసరానికి పనికి వచ్చిన పెన్నిధి. ఇప్పుడు, ఈ ఆధునిక సాంకేతిక యుగంలో సంస్కృతాన్ని వెలివేయాలనటం సాధ్యమయ్యేది కాదు. ఆ అవసరమూ లేదు. సంస్కృతం ఏ సామ్రాజ్యవాద సంస్కృతినీ ప్రతిబింబించదు. సంస్కృతంలో భాషా నిర్మాణ రీతులతోనే మనకు పని. భావజాలంతో మనకంత పనిలేదు. సంస్కృతంతో పొత్తు ప్రాచీన సమాజ పునరుద్ధరణ కోసం కాదు, నవ భావవ్యక్తీకరణ కోసం. అందువల్ల ఇవాళ తెలుగంటే సంస్కృతం మూలధనంగా ఉన్న తెలుగు అనే. మాతృభాషను నేర్చుకునే పద్ధతిని భాషాశాస్త్రజ్ఞులు acquisition అంటారు. ఇది సహజ స్థితిలో నేర్చుకునే విధానం. పిల్లలు చాలా చిన్నతనం నుంచే మాతృభాష మాట్లాడటం నేర్చుకుంటారు. దాదాపు ఐదేళ్ల ప్రాయానికే మాతృభాషలో ఉన్న వాక్య నిర్మాణ రీతుల్ని స్వాధీనం చేసుకుంటారని నోమ్ ఛామ్‌స్కీ అంటారు. అంతేకాక తన పరిసరంలో ఉన్న భాషా వ్యవహారాన్ని గమనించి దాని నుంచి సూత్రాలు నిర్మించుకుంటారని ఛామ్‌స్కీ ప్రతిపాదన. పిల్లలకు పుట్టుకతోనే భాష సంపాదన సాధనం Language acquisition device ఒకటి అధీనంలో ఉంటుందనీ, అది అలిఖిత వ్యాకరణాన్ని నిర్మిస్తుందనీ ఆయన ప్రతిపాదన. వివరాల్లో వివాదాంశాలున్నా భాషా సంపాదన అనుకరణ ద్వారా కాక సృజనాత్మక వాక్య ప్రయోగం ద్వారా జరుగుతుందనీ, అట్లాంటి వాక్యనిర్మాణ దక్షన, సదసద్వాక్య నిర్మాణ వివేచన కలిగించే *యంత్రాంగం* పిల్లలకు అంటే మానవులకు పుట్టుకతో వస్తుందనేది ఛామ్‌స్కీ ప్రధాన ప్రతిపాదన. అంటే అది మానవ జీవ స్వభావమన్నమాట (biological endowment) మాతృభాషా సంపాదన, మాతృభాషా ప్రయోగం సృజనాత్మక వ్యాపారాలుగా ఛామ్‌స్కీ పరిగణించారు. అంతేగాక ఇది మానవుల ప్రత్యేక లక్షణంగా (species specific) కూడా పరిగణించారు. మాతృభాషా సంపాదన వ్యవహర్త సొంతంగా వ్యాకరణం నిర్మించుకోటం ద్వారా చేస్తాడు. చిన్నప్పుడే పరభాషను నేర్చుకుంటే ఇదే పద్ధతి – అంటే అలిఖిత వ్యాకరణ నిర్మాణ పద్ధతి ద్వారా జరుగుతుందని ఊహించవచ్చు. అప్పుడా పిల్లలు రెండు భాషలకు వ్యాకరణాలు నిర్మించుకుంటారు. వీళ్లు రెండు భాషల్లోనూ సమాన సృజనశక్తిని పెంపొందించుకుంటారు. దాంట్లో ఎక్కువ తక్కువలుంటే ఉండొచ్చు. తేల్చే ప్రమాణాలు లేవు.

మాతృభాష వ్యవహర్తలు భాషలో వాక్య నిర్మాణ రీతులు మాత్రమే నేర్చుకుంటారనుకోకూడదు. వాటిని తప్పకుండా నేర్చుకుంటారు. ప్రయోగవైచిత్రిని, వైవిధ్యాన్నీ కూడా నేర్చుకుంటారు. పాత హాస్యోక్తులను ఆనందిస్తారు. కొత్త వాటిని సృజిస్తారు. సామెతలు ప్రయోగిస్తారు. కొత్త సామెతలను సృజిస్తారు. జాతీయాలు, పలుకుబళ్లు అర్థవంతంగా వాడతారు. భాషలో ఉండే సదృశీకరణ పద్ధతులను (metaphorization processes) పదస్థాయి నుంచి వ్యవహార ఖండికల స్థాయి వరకు వ్యవహర్తలు పాతవి గ్రహిస్తారు. కొత్తవి సృజిస్తారు. అంతేకాదు, భాషలో లయాత్మక స్పృహ కూడా భాషా వ్యవహర్తలకుంటుంది. పదాల ఎన్నికలో ధ్వని సమత, అర్థపుష్టిపై దృష్టి ఏర్పడుతుంది. ఇవన్నీ సృజన వ్యాపారాలే. అయితే వీటిని ఐదేళ్లలోపునే మనుషులంతా సంపూర్ణంగా గ్రహిస్తారనుకోను. బహుశా మరికొంతకాలం (ఎంత కాలం అని చెప్పలేం!) పడుతుంది. జీవితాంతం సాగుతుందా? మధ్యలో ఆగిపోతుందా అనే దాన్ని గురించి ఇదమిత్థమని చెప్పలేం. ఈ రకపు భాషా సృజన వ్యాపారం విద్యార్థి దశలో ఎక్కువ జరగటం చూస్తాం. అంటే సహజ పద్ధతిలో కాక,

శిక్షణ పద్ధతిలో సాగుతుంది. భాషా శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిన acquisition (సహజ సంపాదన) చాలదనీ, conscious learning (స్పృహతో కూడి శిక్షణ) అవసరం అనీ తేలుతుంది. చాలాకాలంగా భాషా పరిశోధకులు భాషంటే మాట్లాడే భాషే అనుకున్నారు. అంతేకాదు, మాట్లాడే భాషను అక్షరాల్లో పెడితే రాసే భాష అవుతుందనుకున్నారు. ఇందుకు కారణాలనేకం. అవన్నీ ప్రస్తుతం మనకవసరం లేదు గానీ స్థూలంగా కొంత తెలుసుకుందాం.

ప్రపంచంలో అన్ని భాషలనూ మాట్లాడతారు. కొన్ని భాషలకే లిపి ఉంది. అన్ని భాషలకూ సరిపడే సిద్ధాంతాలను ప్రతిపాదించాలన్నా, సర్వభాషా నిర్మాణ సూత్రాలను నిర్వచించాలన్నా, అన్ని భాషలకూ వ్యాకరణ పద్ధతులను తయారు చేయాలన్నా మాట్లాడే భాషలనే ప్రధానంగా గ్రహించారు. ఈ పద్ధతి కొంత ప్రజాస్వామికంగా కనిపించింది. రాసే భాషలకే వ్యాకరణం ఉంది. మాట్లాడే భాషలకు ఒక పద్ధతీ పాడూ లేదు అనే ప్రాచీన స్థితి నుంచి మాట్లాడే భాషలకు నియమ నిష్ఠలున్నాయి. వ్యాకరణం ఉంది అనటం ఒక పెద్ద గెంతు. ఈ దృష్టి మన దేశంలో వ్యావహారిక భాషోద్యమానికి బాగా పనికొచ్చింది. అంతేకాదు, మాట్లాడటం సహజం, రాయటం కృత్రిమం అనే వాదం వరకూ వచ్చింది. మాట్లాడే భాషకు భిన్నంగా ఉన్నదంతా కృత్రిమమనో, తప్పు అనో ముద్ర వేసే వరకూ ఈనాటి వ్యావహారిక భాషలో “అభివృద్ధి” సాధించారు. చారిత్రకావసరం కోసం వచ్చిన ఏ ఉద్యమమైనా కాలాంతరంలో వెర్రితలలు వెయ్యొచ్చు. ప్రస్తుతం తెలుగులో సాంప్రదాయిక వ్యావహారిక భాషావాదుల వాదనలు ఈ స్థితిలోనే ఉన్నాయి. వీళ్లతో పేచీ పడటం ప్రస్తుతం నా పని కాదు. కాని ఈ దృష్టి సమగ్రం కాదని మాత్రం చెప్పక తప్పదు.

ఒక జాతి అభివృద్ధిలో భాష నిర్వహించే పాత్రను గురించి ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. అందులో లిఖితభాష పాత్ర అమోఘమైనది. ఒక కాలంలో ఒక జాతి సంపాదించిన విజ్ఞానాన్ని, చేసిన సృజనను, లిఖిత భాష భద్రపరచి కాలాంతరంలో తరవాత తరాలకు అందిస్తుంది. దానిపై మరింత చేర్చే అవకాశం మలి తరాలకు వస్తుంది. భాషలో చెప్పే భావాలకు దేశకాలవధుల్లేవు అన్నాం. అయితే భాషా ప్రసారానికా పరిమతులున్నాయి. ఏ యంత్రసాయం లేని రోజుల్లో భాషా ప్రసారం వక్తృశ్రోతల సామీప్యానికే పరిమితమయింది. లిఖిత వ్యవస్థ ఈ పరిమితిని అధిగమించే అవకాశం భాషకు ఇచ్చింది. విస్తృత భాషా సమాజాలకు ఈ లిఖిత వ్యవస్థ అవసరం కూడా అయింది. సమాజ విస్తృతికీ, అభివృద్ధికీ లిఖిత భాషకీ ప్రత్యక్ష సంబంధం ఉంది. గిరిజన భాషలకు, సమాజాలకు రాసే భాష లేదు. సమాజాభివృద్ధీ లేదు.

విస్తృత సమాజాల్లో రాసే భాష ‘మాట్లాడే భాషా రెండూ ఉంటాయి. ఈ రెంటికీ వేరు వేరు పరిమితులున్నాయి. వేరు వేరు ప్రయోజనాలున్నాయి. ఈ రెంటికీ ఇచ్చి పుచ్చుకునే సంబంధాలుంటాయి. అందువల్ల రాసే భాషకూ, మాట్లాడే భాషకూ తప్పని సరిగా సామ్యాలుంటాయి. కాలక్రమంలో వేరుదారుల్లో పయనించటం వల్ల భేదాలు కూడా ఉంటాయి. వీటిని శాస్త్ర దృష్టితో అర్థం చేసుకోవాలిగాని, ఒకటి సహజమైనది వేరొకటి కృత్రిమమైనది అనుకోటం హ్రస్వదృష్టి.

రాసే భాష ఉన్న సమాజాల్లో విద్యాబోధకు పాఠ్యాంశాలు రాసే భాషలో ఉంటాయి. మనకు కొంత కాలంగా రాసే భాష అంటే ప్రాచీన కావ్యభాష. ప్రాచీన కాలంలో లిఖిత భాషకు సాహిత్యమే ప్రధాన ప్రయోజనంగా ఉండేది. అది ఒకానొక రకమైన సాహిత్యం మాత్రమే. అందుకే అది కేవలం కావ్యభాష. సంకీర్తన, పద సాహిత్య భాష, యక్షగాన భాష, శాసనభాష, కైఫీయత్తుల భాష, వ్యాఖ్యానాల భాష ప్రధాన సంప్రదాయంలో భాగాలుగా కాక సమాంతర సంప్రదాయాలుగా ప్రాచీన కాలం నుంచీ ఉన్నాయి. రచనా వైవిధ్యానికి, పాలనాది రాజకీయ, సాంఘికావసరాలకి మనకు సాంప్రదాయికంగా వచ్చిన ఏ ఒక్క పద్ధతీ చాలదు. ఆధునికావసరాలకు ఆధునిక రచనా భాషనొకదానిని తయారు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. అది మాట్లాడే భాష పునాదిగా, పైన పేర్కొన్న సాంప్రదాయిక రీతుల సహకారంతో తయారవుతున్నది. ఈ దశలో ఏకవాక్యత ఉండకపోవచ్చు. అది దోషమూ కాదు, అసహజమూ కాదు. ఆధునిక రచనా భాషకు అనేక రచనారీతులను ఇముడ్చుకోగలిగిన శక్తి ఉంది. ఒకవేళ ఈ శక్తి చాలకపోతే మనకున్న అన్ని వనరులనూ, అంటే మాట్లాడే భాషతో సహా అన్ని సాంప్రదాయిక రీతులనూ వీలైనంతగా కొల్లగొట్టి ఆ శక్తిని సంపాదించాలి. ఇతర భాషల నుంచి గ్రహించగూడదని కాదు. అత్యవసరమైనప్పుడు ఎట్లాగూ తప్పదు, అవసరానికి మించి పరభాషలకు పెత్తనమిస్తే పేనుకు పెత్తనమిచ్చినట్టు అవుతుంది.

ఇంగ్లీషు మీడియం స్కూళ్లు ఆ పని బాగా చేస్తున్నాయి. కేంద్రం వారు మూడు భాషల సిద్ధాంతం, హిందీకిచ్చిన పెత్తనం వల్ల ఇదే పని ఇంకో వైపు నుంచి జరుగుతుంది. అర్ధశతాబ్ద కాలంగా మనకు సంక్రమించిన రాష్ట్ర ప్రభుత్వాల

నిర్లక్ష్యం ఈ పరిస్థితిని అనుమతించాయి. అగ్నికి ఆజ్యం పోసినట్లు తెలుగు విద్యావంతుల అలసత్వం తోడయింది. తెలుగు భాషపై ఆసక్తి ఉన్న విద్యావంతులుగా ఇప్పుడు మన కర్తవ్యాలేమిటి? తెలుగును రక్షించుకోవాలి. తెలుగు పిల్లలను తెలుగు పౌరులుగా తయారు చేసుకోవాలి. తెలుగు రాష్ట్రంలో తెలుగు వాతావరణాన్ని కలిగించాలి. ఇందుకు పరిమిత పరిధుల్లోనూ, విస్తృత రంగాల్లోనూ ఏకకాలంలో కృషి చెయ్యాల్సి ఉంది. ఎవరి పరిధుల్లో వారు కృషి చేస్తూనే తమ శక్తియుక్తులను ఏకోన్ముఖం చెయ్యాల్సి ఉంది. వలస పాలకులు మనకు ఇంగ్లీషు ఇస్తే, మనం వారికన్నా ముందుకు పోయి ఇంగ్లీషు మీడియం స్కూళ్లను ఏర్పార్చుకున్నాం. వీటిని ప్రజాస్వామ్య పద్ధతులతో నిరోధించాలి. వాటిని తగ్గించే మార్గాలను అన్వేషించాలి. తెలుగు పిల్లలకు తెలుగు తప్పనిసరిగా నేర్పే అవకాశాలను కల్పించాలి ఈ స్కూళ్ల పైన వత్తిడి వచ్చేట్టు చెయ్యాలి. అది ఒక వైపు తల్లి తండ్రుల నుంచి రావాలి. మరోవైపు ప్రభుత్వం నుంచి రావాలి. ఆచరణ యోగ్యమైన ప్రతిపాదనలను వారి దృష్టికి తీసుకురావాలి. ఇదే సందర్భంలో తెలుగు అధ్యాపకులుగా మన కర్తవ్యాల గురించి ఆలోచించాలి. పాఠశాలా, కళాశాల, విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాలను పునఃపరిశీలించి తగిన మార్పులు చెయ్యాలి.

మనం చాలాకాలంగా ఒక వైపు సాహిత్య బోధనకూ, భాషా బోధనకూ తేడా గమనించటం లేదు. మరోవైపు భాషా బోధనకూ, వ్యాకరణ బోధనకూ వ్యత్యాసం చూపించటం లేదు. సాహిత్యం తప్పకుండా చదవాల్సిందే. సాహిత్యం మానసికావసరం. భాష భౌతికావసరం. సాహిత్యం రచన, పఠనాలపై అందరికీ ఆసక్తి ఉండక్కర్లేదు. భాష అందరికీ అవసరమైనది. తెలుగు పాఠ్యాంశాలలో వచన రచనపై చూపించవలసిన శ్రద్ధ చూపిస్తున్నామా? అని మనం ఆత్మ విమర్శ చేసుకోవాలి. వచనంలో మనకు అనేక రచనా భేదాలున్నాయి. వాటిలో కొన్ని రకాలు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉన్నా, ఈపాటికే అభివృద్ధి చెందినవి ఉన్నాయి. ఉదాహరణకి మనకు నిర్దిష్ట శాస్త్ర వచనం అంత సుష్ఠుగా ఏర్పడలేదు. అలంకారాలు, వ్యంగ్య సూచనలు, అనేకార్థ బోధలు లేకుండా విషయ ప్రధానం వచనం రాయలేకపోతున్నాం. పత్రికల పతాక శీర్షికలు చూడండి. వాటిల్లో పదాల విరుపులు చూడండి. వార్తా కథనం చూడండి. తెలుగు పత్రికలు కవిత్వ వచనం రాయటంలో పోటీ పడుతున్నాయి. సాహిత్య వ్యాసాలు చూడండి. సిద్ధాంత వ్యాసాలు చూడండి. కాస్త కవిత్వం, మరికొంత కథ, బోలెడు ఊకదంపుడు కనిపిస్తుంది. అర్థాంతర బోధలూ, చమత్కారాలూ, సభంగాభంగా శ్లేషలూ వచానికి వన్నె తెచ్చేవి అనుకొంటున్నాం. అలంకారికత మంచి వచనానికి గీటురాయి అనుకుంటున్నాం. శాస్త్ర వచనంలో ఇది అర్థ నిర్దిష్టతకు ఆటంకాలని మనం ఇంకా గుర్తించలేదు. దిన పత్రికా వ్యాసానికి పరిశోధక పత్రానికి భేదం చూపించలేకపోతున్నాం. దీని విషయమై చెప్పవలసింది చెయ్యవలసింది చాలా ఉంది. శాస్త్ర సంక్షిప్తతకు, నిర్దిష్టతకూ కొంత గ్రాంథికమే నయం. శాస్త్ర సంక్షిప్తత అంటే ప్రకరణానికి అవసరమైనదంతా చెప్పటం. అవసరమైనది మాత్రమే చెప్పటం. అర్థాంతర బోధ, వ్యంగ్య వైభవమూ వగైరా లేకపోవటం, హాస్య, చతురోక్తులు లేకపోవటం, చెప్పింది తార్కికంగా, సహేతుకంగా ఉండటం, శాస్త్ర వచనం ద్వారా మనం ఆశించేది వినోదం కాదు. మనోల్లాసం కాదు, హృదయహ్లాదం కాదు, విజ్ఞానం.

తెలుగులో అందరూ కవిత్వం రాయరు, చదువుకున్న వాళ్లంతా వచనం రాస్తారు. ఆ వచనంలో రకరకాల సంప్రదాయాలు కొన్ని ఏర్పడి ఉన్నాయి. కొన్ని ఇంకా ఏర్పడాల్సి ఉన్నాయి. సాహిత్య వచనం (creative prose) లో మనకు కొన్ని శైలీ భేదాలు ఉన్నాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చలం, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, నార్ల వంటి రచయితల వచన రచనలను శైలి కోసం అధ్యయనం చెయ్యాల్సిన, చేయించాల్సిన అవసరం ఉంది. తెలుగు పత్రికల సంపాదకీయాలలో, ఇతర కాలమ్స్‌లో కొన్ని వచన రీతులేర్పడ్డాయి. ఇవి రచనా రీతులు. వీటిని సవిమర్శకంగా బోధించే లక్ష్యాలతో పాఠ్య భాగాలుగా చేర్చవచ్చు. పాలనా రంగంలో భాషకు కూడా నిర్దిష్టత అవసరం. విషయబోధ ప్రధానం. ఇప్పటి వరకు తెలుగు అమలులో భాష విషయంలో వస్తున్న చిక్కులను అధ్యయనం ద్వారా పరిష్కరించుకోవాలి. ఇట్లా వివిధ రంగాలలో భాషా ప్రయోగంలో జరిగిన అభివృద్ధి ఎంత? జరగాల్సింది ఎంత? అని బేరీజు వేసుకొని ముందుకు సాగాలి.

ఇతర భాషల దురాక్రమణ నుంచి తెలుగును రక్షించుకుందాం. తెలుగు భాషా ప్రయోగాన్ని అన్ని రంగాలకూ విస్తరింపజేద్దాం. తెలుగులో ఇంకా ఏర్పడని రచనా రీతులను ఏర్పర్చుకుందాం. తెలుగు భాష సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రయత్నిద్దాం.

*('భాషానువర్తనం' పుస్తకం నుండి)* ♦

# విద్యలందు ప్రాథమిక విద్య వేరయా...

- డాక్టర్ పమిడి శ్రీనివాస్ తేజ

*ప్రాథమిక విద్య అంటే కేవలం చదవటం, రాయటం, నేర్చుకోవటం మాత్రమే కాదు. వ్యక్తి మొత్తం ఎదుగుదలకు పునాది వేయటం. విద్య లక్ష్యం బిడ్డను ఇంట్లో నుంచి సమాజంలోకి ప్రవేశ పెట్టడం. ఈ క్రమంలో ప్రాథమిక విద్య మొదటి దశ. ఈ దశలో బిడ్డ తన గురించి, తన కుటుంబాన్ని గురించి, చుట్టూ వున్న సమాజం, పరిసరాలను గురించి తెలుసుకోవాలి. సమాజపు నియమాలూ, జనంతో సంబంధాల గురించి తెలుసుకోవాలి. బిడ్డ ఎదిగాక ఏమవుతాడనే దానితో సంబంధం లేకుండా ప్రాథమిక విద్య వుండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే బిడ్డ వ్యక్తిగా ఎదగటంలో మొదటి మెట్టు ప్రాథమిక విద్య.*

ప్రాథమిక విద్యకు ఒక ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. బిడ్డ సమాజంలో తనేమిటో, స్థానిక పరిసరాలతో తన సంబంధం ఏమిటో తెలుసుకునేది ప్రాథమిక విద్య. దేశాన్ని గురించీ, ప్రపంచాన్ని గురించీ, ప్రకృతిని గురించి తెలుసుకునేది ఉన్నత విద్య. తను బ్రతకడానికి ఉపాధిని చూపించేది వృత్తి విద్య లేదా యూనివర్శిటీ విద్య.

ప్రాథమిక విద్య అంటే కేవలం చదవటం, రాయటం, నేర్చుకోవటం మాత్రమే కాదు. వ్యక్తి మొత్తం ఎదుగుదలకు పునాది వేయటం. విద్య లక్ష్యం బిడ్డను ఇంట్లో నుంచి సమాజంలోకి ప్రవేశ పెట్టడం. ఈ క్రమంలో ప్రాథమిక విద్య మొదటి దశ. ఈ దశలో బిడ్డ తన గురించి, తన కుటుంబాన్ని గురించి, చుట్టూ వున్న సమాజం, పరిసరాలను గురించి తెలుసుకోవాలి. సమాజపు నియమాలూ, జనంతో సంబంధాల గురించి తెలుసుకోవాలి. బిడ్డ ఎదిగాక ఏమవుతాడనే దానితో సంబంధం లేకుండా ప్రాథమిక విద్య వుండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే బిడ్డ వ్యక్తిగా ఎదగటంలో మొదటి మెట్టు ప్రాథమిక విద్య.

ప్రాథమిక విద్య పూర్తయ్యేనాటికి బిడ్డకు ఈ క్రింది అంశాలలో కనీసం పరిజ్ఞానం పొందగలిగి వుండాలి.

- తన సొంత భాషను సంపూర్ణంగా మాట్లాడటం, చదవటం, రాయటంలో పట్టు కలిగి వుండాలి.
- వ్యక్తులు, ప్రసార సాధనాల నుంచి పొందే సాధారణ సమాచారాన్ని విని అర్థం చేసుకోగలిగి వుండాలి.
- విషయాన్ని అర్థం చేసుకొనే క్రమంలో అసమగ్రంగా తోచిన వాటి గురించి స్వేచ్ఛగా, సంకోచం లేకుండా అడిగి చెప్పించుకోగలగాలి.
- ఇతరులు ఇచ్చే సూచనలను అర్థం చేసుకోగలిగి, వాటికి సమాధానాలూ, వివరణలు ఇవ్వగలగాలి.
- తన భావాలను, ఉద్వేగాలను స్వేచ్ఛగా తెలియజేయ గలగాలి.
- తనకు తెలిసిన సమాచారాన్ని ఇతరులతో స్వేచ్ఛగా పంచుకోగలగాలి.

పై విషయాలన్నింటినీ ఒకసారి పరిశీలించి చూస్తే అవన్నీ భాషతో జరగాల్సినవి. భాష నేర్చుకోవటం, దాన్ని ఉపయోగించి కుటుంబం, సమాజంతో పరస్పర సంబంధాలు కొనసాగించటం వల్ల అవసరమైన మెళకువలను నేర్చుకుంటాడు. అయితే సమాజం అందించే సమాచారం లేదా విజ్ఞానం కాని ఒక క్రమ పద్ధతి ప్రకారం ఉండకపోవచ్చు. అదీకాక సమాజం కేవలం ఒక బిడ్డ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోదు. అందువల్ల వీటిని ఒక పద్ధతి ప్రకారం నేర్పించాల్సి ఉంటుంది. ఆ క్రమ పద్ధతే పాఠశాల విద్య. అందులో మొదటిది ప్రాథమిక విద్య.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. పాఠశాల విద్య సమాజం అందించే విజ్ఞానానికి కొనసాగింపే కాని ప్రత్యామ్నాయం కాదు. విద్యలో బోధించే అంశాలు సమాజంలోనివిగా వుండాలి. అప్పుడే బిడ్డలు చదివే అంశాలను సమాజంతో సమన్వయ పరుచుకొని పరిణతి చెందుతారు. బోధించే అంశాలు వారికి సంబంధంలేనివిగా ఉన్నా, చెప్పేది

అర్థం కాకపోయినా వాటిని సరిగా అన్వయించుకోలేరు. అందువల్ల పుస్తకాలలో వున్న విషయ పరిజ్ఞానం బుర్రలోకి దూరేది చాలా తక్కువ. అయితే ఇక్కడ ఒక సందేహం రావచ్చు. ఇంగ్లీషు మీడియం పిల్లలకు విషయ పరిజ్ఞానం ఉండదా? అని. తప్పకుండా ఉంటుంది. కానీ ఆ పరిజ్ఞానంలో అత్యధిక భాగం సమాజపు భాష ద్వారా పొందేదే తప్ప ఇంగ్లీషులో చదవటం వల్ల నేర్చుకునేది కాదు.

పిల్లలకు భాష రాకుండా చదివితే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవటానికి ఇంగ్లీషులో ఒక కథను వారు ఎలా అర్థం చేసుకుంటారో పరిశీలిద్దాం. ఇంగ్లీషు మీడియంలో నాలుగు లేదా ఐదవ తరగతి చదివే పిల్లల్ని ఉద్దేశించి "మీకో మంచి కథ చెప్తాను. తెలుగులో చెప్పమంటారా? ఇంగ్లీషులో చెప్పమంటారా?" అని అడగండి. ఎంత మంది పిల్లలు ఇంగ్లీషులో కావాలని అడుగుతారో గమనించండి. ఉపాధ్యాయులు అయితే స్కూలు పిల్లల మీద, ఉపాధ్యాయులు కాని వాళ్ళైతే మీ ఇంటి చుట్టు ప్రక్కల పిల్లలందర్నీ పోగేసి ఈ ప్రయోగం చేయొచ్చు. ఒకవేళ ఎవరైనా ఇంగ్లీషులో చెప్పమని అడిగితే అలాగే మీకు తెలిసిన ఓ కథను ఇంగ్లీషులో చెప్పి, తిరిగి ఆ కథను వారిదైన శైలిలో ఇంగ్లీషులో కానీ, తెలుగులో కానీ చెప్పమనండి. ప్రశ్నలు వేయటం ద్వారా ఎంత వరకు అర్థమయ్యిందో పరిశీలించవచ్చు. మీకు ఏ కథా తోచకపోతే నర్సరీ విద్యార్థుల కోసం ఇంగ్లీషులో నిర్వహిస్తున్న 'మ్యాజిక్ పాట్' పత్రికలో నుండి తీసుకున్న సరళమైన ఈ కథను చదివి చెప్పండి. తెలుగులో దాని అర్థం చెప్పొద్దు.

Long long ago, a proud woodpecker called Woody living in a forest. He always frightened small animals and birds by saying "Hey! Don't you dare come near me! I will peck you with my sharp beak!" At times, in a fit of anger, he actually pecked some small birds hard with his beak.

No one wanted to be friend with Woody because they were afraid of being pecked. One day, as Woody sat on a jackfruit tree, he proudly pecked a huge, jack fruit.

But alas! He did't know that he had pecked an unripe jack fruit! The sticky sap from the fruit oozed out, and stuck Woody's beak. He couldn't open his mouth! Woody flew through the jungle with his upper and lower beak stuck together. The other animals and birds in the forest made fun of him. Woody hung his head in shame and flew away quickly.

ఈ కథ పూర్తయిన తర్వాత తిరిగి ఆ కథను ఇంగ్లీషులోనే వాళ్ళదైన శైలిలో చెప్పమనండి. ఎంతమంది చెబుతారో చూడండి. ఆ కథ మీద చిన్న చిన్న ప్రశ్నలు వేసి సమాధానాలు అడగండి. ఎలా చెబుతారో చూడండి. దాదాపు చెప్పలేరు. పోనీ తెలుగులో అయినా ఆ కథను తిరిగి చెప్పమని ప్రోత్సహించండి. బహుశా కొద్దిమంది పిల్లలు కొంత ప్రయత్నం చేయవచ్చు. ఇప్పుడు అదే కథను మూడేళ్ళ వయసున్న పిల్లలకు తెలుగులో చెప్పండి.

***అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక వడ్రంగి పిట్ట ఉండేది. దాని పేరు 'వుడీ'. దానికి వొళ్ళంతా పొగరే! అడవిలో ఉన్న చిన్నాచితకా జంతువుల్నీ, పక్షుల్నీ పొడుస్తానని తెగ భయపెడుతుండేది. వాటిని చూసి "మీలో ఎవరికైనా నా దగ్గరకు వచ్చే ధైర్యం వుందా? నా కూసుముక్కుతో మిమ్మల్నందిరిని పొడిచేస్తాను జాగ్రత్త!" అంటూ విర్రవీగేది. అప్పుడప్పుడు తోటి పక్షుల్ని తన వాడి ముక్కుతో పొడిచి గాయపరిచేది కూడా. దీంతో ఇతర పక్షులేవి దాని దగ్గరకు వచ్చేవి కావు. పైగా దాన్ని చూస్తేనే భయపడి దూరంగా పారిపోయేవి. అందుకని దానికి స్నేహితులంటూ ఎవరూ లేరు. ఒక రోజు ఈ వడ్రంగి పిట్ట ఓ పనస చెట్టు మీద కూర్చొని గర్వంగా ఒక పనస కాయను తన ముక్కుతో పొడవటం మొదలెట్టింది. అది పొడుస్తున్నది పచ్చికాయ అన్న విషయం ఆ పొగరుబోతు పిట్టకి తెలిస్తేగా! దాంతో అది పొడిచిన పనసకాయలో నుండి జిగురు పాలు కారి, దాని ముక్కు అతుక్కుపోయింది. దాంతో అది నోరు తెరవలేకపోయింది. లబోదిబోమంటూ అడవంతా తిరిగింది. ఇది చూసి అడవిలో జంతువులన్నీ 'పొగరుబోతు వడ్రంగి పిట్టకు తగిన శాస్తే జరిగిందిలే' అని ఆనందించాయి. దీంతో దానికి తల తీసేసినట్లయ్యింది. అవమానంతో దూరంగా ఎక్కడికో ఎగిరిపోయింది.***

ఈ కథ చెప్పటం పూర్తయ్యాక తిరిగి చెప్పమని అడగండి. పిల్లలు ఖచ్చితంగా చెప్పగలరు. కథ మీద ప్రశ్నలు వేయండి. పోటీలు పడి మరీ సమాధానాలు చెపుతారు. నాలుగు, ఐదవ తరగతి పిల్లలకి ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నా, ఇంగ్లీషులో చెప్పినప్పుడు అర్థం కాని కథ, తెలుగులో చెప్పడం వల్ల మూడేళ్ళ పిల్లలకు సైతం సులభంగా అర్థమవుతుంది. ఇక్కడ చెప్పదల్చుకున్నది మొదటి పిల్లలు తెలివి తక్కువ వాళ్ళని కాదు. ఆ కథ వాళ్ళకు అర్థం కావాలంటే వాళ్ళకు తెలిసిన

భాషలో చెప్పాలి. ఆ వయసుకి పూర్తిగా ఇంగ్లీషు రాదు. వచ్చిన భాష తెలుగే కాబట్టి ఆ భాషలో చెబితేనే అర్థం అవుతుంది. అందుకనే ప్రాథమిక దశలో పిల్లల చదువు వాళ్ళ సొంత భాషలో జరగాలనేది. ఒక చిన్న కథ సంగతే ఇలా ఉంటే, ఇక శాస్త్ర విజ్ఞానం పిల్లలకు ఎలా వంటబడుతుందీ?

చాలామంది తల్లిదండ్రులకు, ఆ మాటకొస్తే బాగా చదువుకున్న వారిలో సైతం ఒక దురభిప్రాయం నాటుకుపోయింది. అదేమిటంటే ఇంగ్లీషు మీడియంలో చదివితే ఇంగ్లీషు బాగా మాట్లాడగలరనీ, ఇంగ్లీషు మీద పాండిత్యం వస్తుందని. వీళ్ళు గమనించాల్సింది ఏమిటంటే, చదువంటే కేవలం ఇంగ్లీషులో మాట్లాడటమే కాదు. విజ్ఞానాన్ని నేర్చుకోవటం. విజ్ఞానాన్ని నేర్చుకోవటానికి ఏ భాషైనా ఒక్కటే. కాకుంటే ఆ భాష మీద విద్యార్థికి పట్టు ఉండాలి. పసి వయసులో ఆ విధమైన పట్టు ఉండేది సొంత భాషలోనే. ప్రాథమిక స్థాయిలో విజ్ఞానం సొంతభాషలో అర్థమైనంతగా ఇతర ఏ భాషలోనూ అర్థం కాదు. ఇక్కడ బిడ్డ భాషతో కుస్తీ పడాల్సిన అవసరం ఉండదు. వేరే భాషలో అయితే బిడ్డ ఇంకా భాష నేర్చుకొనే క్రమంలో వుంటాడు. వచ్చీరాని భాషలో చెప్పటం వల్ల బోధించిన విషయాలు సమగ్రంగా అర్థం కావు.

**కోడిగుడ్డుకు ఈకలు పీకే వాదనలు**

మాతృభాషలో విద్యా బోధన అశాస్త్రీయం అని ఇంతవరకూ ఎవరూ అనలేదు. ఇది శాస్త్రీయమేనని నూటికి నూరు శాతం అంగీకరిస్తారు. చివరికి ఇంగ్లీషు మీడియాన్ని సమర్థించేవారు సైతం "శాస్త్రీయమే కానీ..." అంటూ తమ వాదానికి ఏవో కొన్ని ఆధారాలు వెతుక్కుంటారు. నూటికి నూరుశాతం మాతృభాషలో విద్యాబోధన శాస్త్రీయం అని అందరూ అంగీకరిస్తున్నప్పటికీ, దాన్ని అమలు చేసుకోవటంలో మాత్రం రానురాను వెనుకబడుతున్నాం. ఇకనైనా మేల్కొని బిడ్డల్ని కనీసం ప్రాథమిక విద్య వరకైనా తెలుగులో చదివిద్దాం అని ఎవరైనా అనుకుంటే వారికి సవాలక్ష సందేహాలు. ఈ విషయాన్ని ఎవరితోనైనా అంటే ఇక చూస్కో... రకరకాల ప్రశ్నలు, అనర్గళంగా వాదనలు, లేనిపోని అనుమానాలు, సవాలక్ష సందేహాలు బయలుదేరతాయి. ఎక్కువ మంది చేసే వాదనలు, లేవదీసే అంశాలు ఎలా వుంటాయంటే...

- తెలుగులో చదివితే ఇంగ్లీషు ఎలా వస్తుంది?
- ఇప్పటి రోజుల్లో ఇంగ్లీషు లేకుండా జ్ఞానం ఎలా వస్తుంది?
- ఉన్నత విద్య చదవాలంటే ఇంగ్లీషు నేర్చుకోవాలి కదా?
- విదేశాలకు వెళ్ళాలంటే తెలుగులో చదివితే ఎలా?
- సాఫ్టువేరు ఉద్యోగాలు ఎలా వస్తాయి?
- ఇంగ్లీషు అంతర్జాతీయ భాష. దాన్లో చదవకపోతే ఎలా?
- తెలుగులో రెఫరెన్సు పుస్తకాలు దొరకవు కదా?
- ఇంగ్లీషు కాదని బ్రతకటం సాధ్యమా?
- సాంకేతిక పదాలకు తెలుగు అర్థాలు లేవు కదా?
- డాక్టర్లు, ఇంజనీర్లు కావాలంటే ఇంగ్లీషు లేకపోతే ఎలా?

ఇలా ఒక్కొక్కరూ ఒక్కోరకంగా ప్రశ్నల వర్షం కురిపిస్తారు. కొంతమందైతే పోట్లాడతారు కూడా. ఒక అశాస్త్రీయ పద్ధతిని సమర్థించడానికి ఇంత బలమైన వాదనలు ముందుకు రావటానికి కారణం ఏమిటంటే, ఈ రకంగా వాదించే వాళ్ళు విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా మాట్లాడటమే. వీరిలో సామాన్య మానవుడి నుండి యూనివర్సిటీ ప్రొఫెసర్లూ, మేధావుల వరకూ అనేక మంది వున్నారు. "ప్రాథమిక విద్య తెలుగులో బోధించాలి" అని ఎవరైనా అంటే, ఆ మాటలు వీళ్ళు ఎలా అర్థం చేసుకొంటారంటే...

- ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్నట్టు
- ఇంగ్లీషును పూర్తిగా వద్దంటున్నట్టు
- తెలుగు మీడియంలో చదివితే, తెలుగు తప్ప ఇంగ్లీషు రాదన్నట్టు
- ఇంగ్లీషు రాకపోతే ఉపాధి దొరకనట్టూ
- ఉపాధికల్పనా కోర్సులంటే ఇంజనీరింగు, సాఫ్టువేరు, మేనేజిమెంటు కోర్సులే అయినట్టు
- స్వంత రాష్ట్రంలో, స్వంత దేశంలో ఉపాధి దొరకనట్టు
- విదేశాలకు వెళ్ళటమే చదువు పరమార్థం అన్నట్టు

ఇలా రకరకాలుగా, తప్పుగా అర్థం చేసుకోవటం వల్లే ఈ రకంగా వాదిస్తారు. కాబట్టి చర్చ ప్రాథమిక విద్య మీద కాక, సాంకేతిక విద్య మీదకు, వృత్తి విద్య మీదకు, ఉపాధి అవకాశాలు మీదకు పోతుంది. దీనితో అసలు చర్చ దారి మళ్ళి, గందరగోళంగా మారుతుంది. ప్రాథమిక విద్య అంటే ఉన్నత విద్య, కాలేజీ విద్యలు కాదనీ, సాంకేతిక విద్య, యూనివర్సిటీ చదువులూ, వృత్తి విద్యలు అసలే కాదని ఈ మేధావులకు చర్చ జరుగుతున్నంత సేపు మళ్ళీ మళ్ళీ గుర్తు చేసి మాట్లాడాల్సిన అవసరం వుంది. అవన్నీ ఇంగ్లీషులో చదువుకోవచ్చు. చదువుకోవాలంటే ముందు ఆ భాష నేర్చుకోవాలి కదా? ప్రాథమిక స్థాయిలో సొంత భాషను ఎదగనిచ్చి, క్రమంగా ఇంగ్లీషును నేర్పించి, ఆ తరువాత అవసరం అయిన వారికి దాన్ని బోధనా భాషగా ప్రవేశ

పెట్టవచ్చు. భాష రాకుండా బోధన ఏమిటి అనేది వీరికి ఎంత చెప్పినా తలకు ఎక్కకపోతే ఎలా?

**తాడెక్కే ప్రజలు – తలదన్నే ప్రభుత్వం**

అశాస్త్రీయమని తెలిసినా ధనిక, ఉన్నత మధ్య తరగతి ప్రజలలో ఇంగ్లీషు మీడియం పట్ల ఆదరణ పెరుగుతుందనేది వాస్తవం. సామాజికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఈ వర్గాన్ని అనుసరించటం మధ్య తరగతి లక్షణం. ఇక మిగిలింది పేద ప్రజానీకం. వ్యాపార వస్తువు అయిన విద్యను తమ బిడ్డలకు కొనివ్వలేక ప్రభుత్వ బడులకు పంపి, తెలుగు మీడియంలో చదివిస్తున్నారు. అయితే సమాజంలో తక్కువ శాతంగా ఉన్న ధనిక, మధ్య తరగతి వారిని ప్రతి విషయంలో గుడ్డిగా అనుసరించే దిగువ మధ్య తరగతి వర్గం సైతం అక్కడికి తమ బిడ్డలేదో ఇంగ్లీషులో ఇరగబొడుస్తున్నట్టు, తెలుగులో చదివే వారిని చూసి "అయ్యో! మీ పిల్లల్ని తెలుగు మీడియంలో చదివిస్తున్నారా!" అని వారేదో తప్పు చేసినట్టుగా సానుభూతి చూపేంత వరకు వెళ్ళింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదివే గ్రామీణ ప్రజానీకం, బలహీన వర్గాలు, దళితులు దీన్ని అవమానంగా భావిస్తూ "మీ పిల్లలకు ఏబీసీడీలు మా పిల్లలకు అఆ ఇఈ లా" అని నిలదీస్తున్నారు. దీన్ని సరిచేసి శాస్త్రీయమైన బోధనా పద్ధతుల్ని ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాల్సింది ప్రభుత్వం. అయితే ప్రభుత్వాన్ని నడిపే వారి సంకుచిత ప్రయోజనాలకోసం, ఓట్ల రాజకీయం కోసం ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశ పెడుతాం అంటున్నారు.

ఉన్నత విద్యావిధానం పట్ల ఎవరి అభిప్రాయాలు వారికి ఉండొచ్చు. కానీ ప్రాథమిక విద్యకు సంబంధించి ఏ విషయాన్ని ప్రస్తావించాలన్నా దాన్ని అనేక కోణాల నుంచి పరిశీలించాలి. ఎందుకంటే ప్రాథమిక విద్యలో కేంద్ర బిందువు ఇంకా 'వికసించని' బిడ్డ. విద్యా బోధనకు సంబంధించినంత వరకు ప్రత్యేకించి ప్రాథమిక విద్యాబోధనకు, ఒక శాస్త్రీయ పద్ధతి ఉంది. దాన్ని కాదని ప్రణాళికలు తయారు చెయ్యటం సరైన పద్ధతి కాదు. బిడ్డ శారీరక మానసిక సామర్థ్యాన్నీ, బిడ్డ పెరుగుతున్న సమాజం, సంస్కృతి, వారసత్వాన్నీ దృష్టిలో ఉంచుకోవాలి. అంతే కాకుండా సామాజిక పరిస్థితుల్ని, ప్రాంతీయ, జాతీయ విలువల లాంటి అనేక కోణాల నుంచి చూడాలి. వీటి ఆధారంగా ప్రాథమిక విద్య ఎలా ఉండాలనేది నిర్ణయిస్తే అది శాస్త్రీయంగా ఉంటుంది. అనుకున్న ఫలితాలూ వస్తాయి.

ఒక అశాస్త్రీయమైన అంశాన్ని సరి చేయాల్సింది పోయి వంద మందిలో ముగ్గురో నలుగురో దొరికే ఉద్యోగ అవకాశాల గొర్రెతోక పట్టుకొని అందరూ కట్టకట్టుకొని గంగలో దూకటం ఎంత వరకు సబబు? ఈ పోకడలు మారకపోతే తెలుగువాళ్ళు తమకోసం కాక, పరులకోసం బ్రతికే "కూలి చీమల జాతి" గా చరిత్రలో మిగిలిపోక తప్పదు.

మొత్తం మీద మార్పు రావాల్సింది ప్రజల్లో అయినప్పటికీ జాతి, సంస్కృతి, భాషల మనుగడకే ప్రమాదం ఏర్పడినప్పుడు వాటిని కాపాడుకొనేందుకు ప్రభుత్వం నడుం బిగించాలి. అవసరం అయితే చట్టాన్ని ప్రయోగించాలి. అంతే కాకుండా అశాస్త్రీయ పద్ధతుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాలుపంచుకోవాలి. జరుగుతున్న పొరపాటు దిద్దటానికి ప్రభుత్వం స్పందించాలి. మొత్తంగా మార్పు రావటానికి సమయం పట్టొచ్చు. అంతవరకూ ఎవరిస్థాయిలో వారు కొన్ని జాగ్రత్తలు అయినా పాటిస్తే కనీసం గుడ్డిలో మెల్ల అవుతుంది.

**తల్లిదండ్రులు**

ఇంగ్లీషులో చదవటం, ఇంగ్లీషు మాట్లాడటం రెండూ ఒకటి కాదని ముందుగా గుర్తించండి. కేజీ క్లాసులతో సహా ప్రాథమిక విద్య పరమార్థం పిల్లల బుర్రలు వికసించటానికే తప్ప ఉపాధికి కాదని గుర్తించండి. జ్ఞానాన్ని తెలిసిన ఏ భాషలోనైనా బోధించవచ్చు. పిల్లలకు ఏ భాషలో అర్థం అయితే ఆ భాషలోనే చెప్పాలి. అర్థంకాని భాషలో చదువు చెబితే మీ బిడ్డల బుర్రలు ఎలా ఎదుగుతాయో ఆలోచించండి. సొంత భాష ద్వారా పొందిన విజ్ఞానమంతా ఆ తరువాత మీ పిల్లలు ఎన్ని భాషలు నేర్చుకున్నా దానంతట అదే అన్ని భాషల్లోకి మారుతుంది. తెలుగులో నేర్చుకున్నంత మాత్రాన అది తెలుగులోనే ఉండదు. ఒకవేళ మీ పిల్లల్ని పై తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో చదివించాలనుకున్నా ఆ భాష కనీసంగా నేర్చుకొనే వరకు తెలుగులోనే చదివించండి. ఇంగ్లీషు నేర్చుకున్నాక ఆ మీడియంలో చదివించుకోవచ్చు. అప్పుడు ఇబ్బంది ఉండదు.

చాలామంది తల్లిదండ్రులకు ప్రాథమిక విద్య వరకూ తెలుగులోనే చదివించాలని ఉన్నా వ్యాపార ధోరణిని నషాళానికి అంటించుకున్న విద్యావ్యాపారులు తెలుగు మాధ్యమంలో బోధించేందుకు సిద్ధంగా లేవు. దీనికి వారిని ఆడిపోసుకొని ఉపయోగం లేదు. "గిరాకీ" ఉన్న వస్తువును అమ్మటం వ్యాపార

**బెట్రాండ్ రస్సెల్:** **"మానవుడి విజ్ఞానాన్ని పెంచి సంస్కృతినిచ్చి, అతని శక్తి సామర్థ్యాలు వీలయినంతగా అభివృద్ధి చెందేందుకు దోహదపడటం విద్య లక్ష్యం. వ్యక్తి దృక్పథాన్నుంచి కాక సామాజిక దృక్పథాన్నుంచి విద్య ప్రయోజనాన్ని గురించి ఆలోచించాలి. ఉత్తమ పౌరుల్ని తయారు చేయటమే విద్య పరమార్థం"**

లక్షణం. తెలుగు మీడియానికి మంచి గిరాకి ఉండాలే కానీ విద్యావ్యాపారులంతా కలిసి ఇంగ్లీషును బంగాళాఖాతంలోకి విసిరేస్తారనే విషయాన్ని మరువద్దు.

తప్పని పరిస్థితుల్లో మీ పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో చదివిస్తుంటే పాఠశాల యాజమాన్యాన్ని అర్థంకాని అంశాలను తెలుగులో చెప్పమని డిమాండు చేయండి. అలాగే మీ బిడ్డలకు తెలుగు బాగా నేర్పమని అడగండి. మీరు చదువుకొని వుంటే పుస్తకాల్లోని విషయాలను పిల్లలకు తెలుగులో చెప్పండి.

ఈ పుస్తకం చదివాక కూడా చంటి బిడ్డలు ఇంగ్లీషు మీడియంలో చదవటం ఉపయోగకరమని అనుకుంటే అలాగే కానివ్వండి. కానీ తెలుగు మీద పట్టు లేకుండా ఇంగ్లీషు రాదని గుర్తించండి. మధ్య మధ్యలో మీ బిడ్డ ప్రొగ్రెస్ రిపోర్టుల్లో ఉన్న మార్కులకు, బిడ్డ తెలివికి పొంతన కుదురుతుందో లేదో తనిఖీ చేస్తూ ఉండండి. మీ బిడ్డలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభ పాఠశాలలో విరబూయదని గుర్తించండి. చదువు అర్థం కానందువల్ల అదంతా మరుగున పడే అవకాశం ఉంది. అలాగే మీ బిడ్డకు లేని ప్రతిభను అంటగడుతున్నారేమో మొదట్లోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోండి. పై తరగతులకు పోయేకొద్దీ జరిగిన పొరబాటును గుర్తించినా సరిచేయటం కష్టం. వాస్తవం గుర్తించినా గుర్తించనట్టు మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటే మిమ్మల్ని మీ బిడ్డని ఎవరూ కాపాడలేరని గమనించండి.

తెలుగులో చదివే వాళ్ళను తక్కువ చేసి చూడకండి. మీరు ఏ మీడియంలో చదివిస్తున్నా పిల్లల్ని మన భాష పట్ల, సంస్కృతి పట్ల గౌరవం కలిగించే విధంగా పెంచండి. బిడ్డలకు బట్లరు ఇంగ్లీషు కాకుండా మంచి ఇంగ్లీషు నేర్పండి. సొంత భాష మీద పట్టు లేకుండా మంచి ఇంగ్లీషు రాదని మరోసారి గుర్తించండి.

**పాఠశాల స్థాయిలో**

మీది ప్రయివేటు పాఠశాల అయితే, పిల్లలకు చదువు చెప్పటంలో మీ నిజాయితీని ఒకసారి పరీక్షించుకోండి. మీరు చేసేది వ్యాపారమే కావొచ్చు. మీరు అమ్మేది గిరాకీ ఉన్న ఇంగ్లీషు మీడియం అయినప్పటికీ అది అశాస్త్రీయం అన్న విషయాన్ని మనసులో ఉంచుకోండి. బడిలో పిల్లలు మంచి ఇంగ్లీషు మాట్లాడాలంటే అంతకు ముందు వారికి మంచి తెలుగు వచ్చి ఉండాలని గుర్తించండి. బోధించే విషయాలు పిల్లలకు అర్థమవుతున్నాయో లేదో చూడండి. తెలుగులో చెప్తే అర్థం అవుతున్నాయనుకుంటే అలానే చెప్పండి. ఇంగ్లీషు మీడియం కదా అని ఇంగ్లీషులోనే చెప్పటానికి ప్రయత్నిస్తే మీరు చెప్పేది ఉపయోగం లేదని గుర్తించండి.

పిల్లలను బట్టీ పద్ధతికి అలవాటు చేయొద్దు. రాని మార్కులను వెయ్యవద్దు. తెలుగు సబ్జెక్టును నిర్లక్ష్యం చేయకండి. పిల్లలకు చదవటం, రాయటం బాగా నేర్పించండి. పిల్లల్ని ఆయా ప్రత్యేక పిరియడ్‌లో ఇంగ్లీషులోనే మాట్లాడమని ప్రోత్సహించాలే కాని బలవంతం చెయ్యవద్దు. అలా చేసి వాళ్ళ స్వేచ్ఛను హరించకూడదు. ముందు మీ టీచర్లందరికి ఇంగ్లీషు మాట్లాడటం బాగా నేర్పించండి. ఇంగ్లీషును తెలుగు ద్వారా నేర్పాలి తప్ప ఇంగ్లీషును ఇంగ్లీషు ద్వారా నేర్పటం అశాస్త్రీయం. వ్యాపారంలో నిజాయితీ ఉన్నప్పుడే నాలుగు కాలాలపాటు నిలబడతారనేది కాలం తేల్చిన సత్యం.

మీరు తెలుగులో బోధించే ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తుంటే మీ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించండి. ప్రాథమిక స్థాయిలో ప్రయివేటు పాఠశాలల్లో దాదాపుగా పదోతరగతి, మహా అంటే ఇంటరో చదివిన వాళ్ళు. మీలా విద్యాబోధనలో శిక్షణ పొందిన వారు కాదు. మీరు మనసు పెట్టి చెప్పాలే కాని ప్రయివేటు పాఠశాలల్లో చెప్పే చదువు కంటే నాణ్యమైన బోధనని అందించగలరు. ముఖ్యంగా ఒకటి, రెండు, మూడు తరగతుల ఉపాధ్యాయులు. మీరు చదవటం, రాయటం నేర్పించకుండా పై తరగతులకు పంపిస్తే పిల్లలు ఎంత తెలివిగల వారయినా ఉపయోగంలోకి రారని గుర్తించండి. మీ బాధ్యతారాహిత్యం వల్ల ఒక నిండు జీవితం వికసించకుండా పోవటం మీకు ఇష్టమా? అని ప్రశ్నించుకోండి. అంటే పిల్లలకు బాగా చదువు చెప్పండి. ప్రయివేటు పాఠశాలకు ధీటుగా విద్యార్థుల్ని తీర్చిదిద్దండి. పిల్లలకు మంచి ఇంగ్లీషు నేర్పండి. మీ విద్యార్థులకు తెలుగు బాగా వచ్చి ఉంటుంది కాబట్టి ఏబీసీడీలతో విద్యాభ్యాసం చేసిన పిల్లలకంటే త్వరగా, బాగా ఇంగ్లీషు నేర్చుకోగలిగి ఉంటారు. ఆ అవకాశాన్ని ఉపయోగించండి. ♦

# వినదగు నెవ్వరు చెప్పిన...



**మహాత్మాగాంధీ:** "విద్య వ్యక్తికి జీవిత సూత్రాలను నేర్పేదిగా ఉండాలి. అందుకు ప్రాథమిక విద్య పునాది వేసేదిగా ఉండాలి. బిడ్డ శరీర పోషణకు తల్లిపాలు ఎంత అవసరమో, మనో వికాసానికి మాతృభాష కూడా అంతే అవసరం. శిశువు తన తొలి పాఠాన్ని తల్లిదగ్గరే నేర్చుకుంటుంది. కాబట్టి బిడ్డలపై విదేశీ భాషను రుద్దటం మాతృదేశానికి ద్రోహం చేయటమే అని నా అభిప్రాయం."

**రవీంద్రనాథ ఠాగూరు:** "ఆంగ్లాన్ని ప్రత్యేక మెళుకువలతో, జాగ్రత్తగా ద్వితీయ భాషగా నేర్పాలి. కానీ బోధన మాత్రం మాతృభాషలోనే జరగాలి. యూనివర్శిటీ స్థాయి వరకూ మాతృభాషలో చదివే అవకాశాలు కలిగించాలి. ఇందుకు నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయి. 1. మాతృభాషలో మాత్రమే జీవితానికి సంబంధించిన లోతుల్ని స్పృశించగలరు. 2. ఏ విషయంలోనైనా ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలంటే అందుకు భాష అడ్డంకిగా ఉండకూడదు. 3. వ్యక్తి సామర్థ్యం కొత్త భాష నేర్చుకొనేందుకే సరిపోతుంది తప్ప, అవసరం అయిన పరిజ్ఞానాన్ని నేర్చుకోవటంలో వెనుకపడతారు. 4. మాతృభాషలో విద్యాబోధన వల్ల బాలికల చదువు మెరుగవుతుంది. భారతీయ సమాజంలో మహిళా విద్యకు తక్కువ ప్రాధాన్యత ఉంది కాబట్టి మాతృభాషలో విద్య బోధన వల్ల బాలికల్లో విద్యకు సంబంధించిన అదనపు భారం లేకుండా ఉంటే వారి విద్యావకాశాలు మెరుగవుతాయి".





**ఎ.పి.జె. అబ్దుల్ కలాం:** "నేను తమిళంలో చదివాను. మనం మాతృభాషను నేర్చుకోవాలి. బాగా పుస్తకాలు చదవాలి. స్థానిక భాషల్లో చదువు బోధించడానికి ఉపాధ్యాయులకిచ్చే శిక్షణమీద మనం దృష్టి సారించాలి."

**కోయిషిలో మత్సురా, యునెస్కో డైరెక్టర్ జనరల్** (1999–2009) : (అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశం నుండి) "21 ఫిబ్రవరి గుణాత్మక విద్య అందరికీ అందించాలనే ధ్యేయంతో, శైశవం నుంచి పాఠశాల విద్యా విధానంలో మాతృభాష ఉపయోగించాలి. అధికార జాతీయ భాషతో పాటు మాతృభాషను కూడా ఉపయోగించడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఇటీవలి అధ్యయనాలు స్పష్టంగా చెబుతున్నాయి. అంతేగాక విద్యార్థులకు జ్ఞానాభివృద్ధినీ, అధ్యయన శక్తినీ అవి ఇనుమడింపజేస్తున్నాయి. ప్రస్తుతం సగటున నెలకు రెండు భాషలు కనుమరుగైపోతున్నాయి. కనుక ఈ మాతృభాషాదినోత్సవం నాడు భాషా వైవిధ్యాన్ని కాపాడే చర్యలు చేపట్టాలి. నేడు ప్రధానంగా ప్రపంచంలోని ప్రాచీన తెగల భాషల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. వారి వారసత్వాన్ని వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికీ, వారి మాతృభాషను రక్షించుకోవడమనేది వారి కీలకమైన హక్కుగా మనం గుర్తించాలి. భాషా బోధన, ప్రత్యేకంగా మాతృభాషలో బోధన అనేది ప్రపంచ వ్యాప్తంగా నేడు అత్యంత ప్రధానమైన విషయంగా వుంది. విశ్వవ్యాప్తంగా తమ భావాలను ఈ భాషలు తెలియజేయగలిగి వుండాలి. ప్రతివ్యక్తి తన సొంత భాషను కాపాడుకొంటూ, దాన్నొక వ్యక్తీకరణ రూపంగా జీవితాంతం ఉపయోగించుకోవాలి.



"చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి క్లాసురూం బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, క్లాసు రూంలో పరాయి భాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదే కాక చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది."

**- డి.ఎస్. కొఠారి**

# పురస్కారాలు

## *సాహిత్య ప్రస్థానం నవంబర్ 2019 పురస్కారాలు*

**మళ్ళీ మనం కలవలేక పోవచ్చు**
*కవితకు: రూ.500/-*
రచయిత: **ఏ. భైరవ స్వర్ణకుమార్**

**చంద్రన్న**
*కథకు : రూ. 500/-*
రచయిత : **డా॥ పెరుక రాజు**

■■■

***కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,***
***కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.* ***- ఎడిటర్***

## చరిత్ర పరిశోధకులు రంజిత్ అందించిన ఓ పరిశోధనా ఫలితాలు.

పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని ప్రముఖ చరిత్ర పరిశోధకులు రంజిత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. మాతృభాషపై పట్టు లేకుండా, వేరే ఏ భాషా నేర్చుకోవడం కుదరదని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ 'ఇక్కడి విద్యార్థులకు ఆంగ్లం రావాలన్నా తెలుగుపై పట్టు ఉండటం తప్పనిసరి. ఎన్నో పరిశోధనలూ ఇదే విషయాన్ని తేల్చిచెప్పాయి. ఒక భాష మాట్లాడటం రావాలంటే ఆ భాషలో విద్యాభ్యాసం చేయాల్సిన అవసరం లేదు. ఆంగ్లం రావాలంటే ఇంగ్లిష్ మాధ్యమం తప్పనిసరి కాదు. పాఠశాల స్థాయిలోనే "స్పోకెన్ ఇంగ్లిష్" నేర్పితే సరిపోతుంది' అని ఆయన వివరించారు.

తరగతి గదిలో అధ్యాపకుడు మాతృభాష వాడితేనే పిల్లలకి విషయం స్పష్టంగా అర్థమవుతుందని, ఈ అంశంపై లోతైన పరిశోధన చేసినట్లు రంజిత్‌కుమార్ తెలిపారు. దీనికోసం 10లక్షల కన్నా ఎక్కువ జనాభా ఉన్న దేశాలను (170) పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. తన పరిశోధనలో బయటపడ్డ కొన్ని ఆసక్తికరమైన అంశాలను ఉదహరించారు. మనం ఇంగ్లిషను విద్యలో మాధ్యమంగా ఎలా ఉపయోగిస్తున్నామో, అలానే బ్రిటిష్ పాలన అనుభవించిన ఎన్నో ఇతర దేశాలు కూడా ఉపయోగిస్తున్నాయి. ఫ్రెంచ్, స్పానిష్, పోర్చుగల్ వలస పాలన ఉన్నచోట్ల ఫ్రెంచ్, స్పానిష్, పోర్చుగీసు భాషలను ఉపయోగిస్తాయి. 2017 వరకూ నోబెల్ బహుమతి (శాంతి బహుమతి మినహా) పొందినవారిలో 98శాతం పైగా మాతృభాషలో విద్యను బోధించే దేశాలకి చెందినవారే. కొనుగోలు శక్తి ఆధారిత తలసరి ఆదాయం దృష్ట్యా ప్రపంచంలోని తొలి 30 దేశాల్లో 28చోట్ల మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతోంది. సింగపూర్, హాంగ్‌కాంగ్ పేరుకు దేశాలే అయిన వాటి జనాభా మన ముంబై అంత కూడా ఉండదు. కనుక అక్కడి విధానాలు మనకు ఆదర్శం కాదు. ప్రపంచీకరణకు ఇంగ్లిష్ తప్పనిసరి అనే భావన ప్రజల్లో బలంగా ఉంది. కానీ అందులో నిజం లేదు. కేఓఎఫ్ గ్లోబలైజేషన్ సూచీ-2018లో భాగమైన మొదటి 50 దేశాల్లో 48 మాతృభాషనే వాడుతున్నాయి.

ఆధునిక పరిశోధనలు చెయ్యడానికి ఇంగ్లిష్ తప్పనిసరి అని మరొక భావన కూడా ఉంది. అదికూడా తప్పే. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వివిధ దేశాల ఆవిష్కరణల సామర్థ్యాన్ని అత్యంత శాస్త్రీయంగా విశ్లేషించి ఏటా నివేదిక ఇచ్చే "గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్", "బ్లూమ్బెర్గ్ ఇన్నోవేషన్ ఇండెక్స్" జాబితాలలో మొదటిది 40- 50 స్థానాల్లో ఉండే 90శాతంపైగా దేశాలూ మాతృభాషనే తమ విద్యాబోధనలో ఉపయోగిస్తాయి. జాంబియా, టాంజానియా, ఘానా వంటి ఎన్నో ఆఫ్రికా దేశాలు సైతం మాతృభాషలో విద్యాబోధన మొదలు పెడుతుంటే, మనం మాతృభాషలో బోధిస్తున్న పాఠశాలలను కూడా ఆంగ్ల మాధ్యమంలోకి మార్చడం దురదృష్టకరం. *(ఆంధ్రజ్యోతి దినపత్రిక **9-11-2019** )* ♦

# అమ్మభాషలో చదువుకో... ఆంగ్లమూ నేర్చుకో!

- ఆచార్య పులికొండ సుబ్బాచారి

*రెండు తెలుగు రాష్ట్రాల్లో పదమూడు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. ఇవి ఇంకా పెరగవచ్చు. వీరందరూ తెలుగువారి కోసమే పనిచేయాలి. పరిపాలన అంతా తెలుగులో ఉంటే ఈ ఉద్యోగులు అందరూ తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించాల్సి ఉంటుంది. అప్పుడు ఈ పదమూడు లక్షల మందికీ తెలుగు మాధ్యమమే అవసరం. ఆంగ్ల మాధ్యమంతో పనిలేదు. అయినా ఒక పార్శ్యాంశంగా ఇంగ్లిష్ ఉంటుంది కాబట్టి ఆ పరిజ్ఞానం సరిపోతుంది. తెలుగువారందరికీ వారి ప్రభుత్వ కార్యకలాపాలు మాతృభాషలోనే జరుపుకోవడం వారికి సంక్రమించిన హక్కు. గ్రామంలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయం తనకు తెలియని భాషలో ఎందుకు పనిచేయాలి? ప్రతి పౌరుడూ ప్రభుత్వం తన మాతృభాషలో పనిచేయాలని కోరుకోవడం అతడికి ఉన్న హక్కు. దీన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. దీన్ని విస్మరించి ఆంగ్లంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయని చెప్పడం బాధ్యతారాహిత్యం. ఫలానా వర్గాలవారి అభివృద్ధికి ఆటంకమని భావించడమూ సరికాదు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అధికార భాషగా తెలుగును అన్ని స్థాయుల్లో అమలు చేయాలి.*

తెలుగు బోధన భాషగా ఉండాలని, కనీసం పాఠశాల చదువు వరకైనా తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధన జరపాలనే ఉద్యమానికి పెద్దదెబ్బ తగిలింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరో తరగతి వరకు సర్కారీ బడుల్లో ఆంగ్ల మాధ్యమంలోనే చదువు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. కొన్నేళ్ల నుంచి అధికారభాషగా తెలుగు పూర్తిస్థాయిలో అమలు జరపాలని కనీసం పాఠశాల విద్య వరకైనా తెలుగు మాధ్యమంలో విద్యాబోధన చేయాలని భాషోద్యమకారులు చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఉత్తర్వు శరాఘాతంగా మారింది.

**నాణ్యత ప్రశ్నార్థకం**

బహుజన సిద్ధాంతకారులు దళిత సిద్ధాంతకారులు విద్యాబోధన తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలోనే ఉండాలని, ఉన్నత వర్గాల పిల్లలు అందరూ ఇంగ్లిష్ మీడియం చదువులు చదువుతుంటే... దళిత బహుజనుల పిల్లలు సర్కారీ బడుల్లో తెలుగు మాధ్యమంలో చదివి ఎల్లకాలం వెనకబడి ఉండాలా అనే కొత్తవాదన తెస్తున్నారు.

దళిత కులాలు, వెనకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత చదువుల అనంతరం విదేశాలకుపోయి మంచి ఉద్యోగాలు చేయాల్సిందే. అందుకు కావలసింది ఆంగ్లభాషలో ప్రావీణ్యం కాని, ఇంగ్లిష్ మీడియంలో చదువు కాదు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో బోధించే ఇంగ్లిష్ మీడియం చదువుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం బాగోలేవన్నది వాస్తవం. ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివినవారిలో కొందరిని పరిశీలిస్తే అటు తెలుగులో, ఇటు ఇంగ్లిష్‌లో సరైన ప్రావీణ్యం వారికి లేదని గ్రహించవచ్చు. అరకొర సౌకర్యాలతో, అర్ధజీతాలతో పనిచేసే ప్రైవేటు కళాశాలలు ఏ ప్రమాణాలు పాటిస్తున్నాయో ప్రభుత్వ పరిశీలనలోనే చాలాసార్లు బయటపడింది. మన దగ్గర ఆంగ్ల మాధ్యమ విద్యార్థులు ఎక్కువమంది ఇంగ్లాండు, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాలకు పోతున్నారు. అక్కడ వారికి నేరుగా విద్యా ప్రవేశాలు, ఉద్యోగాలు లభించడం లేదు. టోఫెల్, జీఆర్ఈ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలి. ఆంగ్ల భాష పాటవానికి సంబంధించిన పరీక్షలివి. మన దగ్గర ఇంగ్లిష్ మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులూ మొదటిసారే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. కోచింగ్ కేంద్రాలకు వెళ్లి, డబ్బులు పోసి శిక్షణ పొందుతున్నారు. రెండు పరీక్షలు దాటకుండా ఎవరూ పై దేశాల్లో ఉన్నత విద్యలో ప్రవేశం పొందలేరు. ఉద్యోగాలూ సాధించలేరు. జపాన్, చైనాల్లో తయారైన యంత్రాలను చాలా దేశాల్లో వాడుతున్నారు. తర్ఫీదు ఇవ్వడానికి ఆ రెండు దేశాల నిపుణులు ఆయా దేశాలకు వెళ్తుంటారు. వారంతా ఇంజినీరింగ్, ఇతర కంప్యూటర్ సాంకేతిక విద్యలను వారి భాషల్లో నేర్చుకున్నారు. ఇంగ్లిష్‌ను

కనీస వ్యాపార లావాదేవీలు, దైనందిన వ్యవహారాలు నడుపుకొనేవరకే నేర్చుకుంటారు. మన దేశంలో ఇంజినీరింగ్ కంప్యూటర్ విద్యలను ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు ఆ సాంకేతిక రంగంలో వారితో పోటీ పడగలుగుతున్నారా? అలాకాక ఇంజినీరింగ్, వైద్యవిద్యలను ఇతర శాస్త్రాలను భారతీయ భాషల్లోనే ఆయా ప్రాంతాలవారు నేర్చుకున్నా- ఇంగ్లిష్‌ను ఒక భాషగా నేర్చుకోగలిగితే, ఇటు ఈ శాస్త్రాలనూ సులభంగా అభ్యసించవచ్చు. ఆంగ్లాన్ని ఒక భాషగా అన్ని తరగతుల్లో నేర్చుకోవడం వల్ల ఇతర దేశాల్లోనూ పని చేయడానికి వీలవుతుంది. సాంకేతిక విద్యలో మనకన్నా చాలా ముందున్న చైనా, రష్యా, జపాన్ దేశస్థులు వారి భాషల్లో విద్యాబోధన సాగిస్తూ మెరుగ్గా రాణిస్తున్న ఉదాహరణ మన ఎదురుగానే ఉంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయన్నది విడ్డూర వాదన. పౌరుల్లో ఏ వర్గం వారైనా ప్రభుత్వం నుంచి కోరవలసింది- చదువు తెలుగు మాధ్యమంలోనే ఉండాలి కాని, తమకు చక్కటి ఆంగ్లాన్ని పాఠశాల స్థాయిలోనే నేర్పించాలని, అందుకు వీలుగా మంచిశిక్షణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయులను ఇవ్వమని అడగాలి. పైగా తెలుగులో చదువుకుంటేనే శాస్త్రాలు సులభంగా బోధపడి, ఎవరైనా అభివృద్ధిలోకి రాగలుగుతారు. ప్రభుత్వ బడుల్లోనే కాదు- అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధన సాగాలని భాషావాదులు కోరుకుంటున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని 1918లో నిజాం ప్రారంభించారు. విద్యాబోధన అంతా ఉర్దూ మాధ్యమంలో జరిగేలా నిర్దేశించారు. దేశంలో తొలిసారిగా ఓ భారతీయ భాష విద్యాబోధన మాధ్యమంగా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం చాలా మెచ్చుకోదగిన అంశమంటూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అప్పట్లో ఉత్తరం రాశారు. వందేళ్ల క్రితమే ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి సాంకేతిక విద్యను, ఉన్నత విద్యను ఉర్దూ మాధ్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం అందించింది. మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి లాంటి వారు ఉర్దూలోనే మెడిసిన్ చదువుకున్నారు. స్వాతంత్ర్యానంతరమే ఇక్కడ మీడియం మారింది. 1970 దశకం నుంచి డిగ్రీ వరకు తెలుగు మాధ్యమంలో పాఠ్యగ్రంథాలు తయారు చేయించి బోధించారు. కొన్ని సామాజిక శాస్త్రాల్లో పీజీ పుస్తకాల్నీ తెలుగులో రాయించారు. ఈ పని అంతా తెలుగు అకాడమీ చేసింది. నాడు కేంద్రమంత్రిగా ఉన్న పి.వి.నరసింహారావు ముందుచూపువల్లే తెలుగు అకాడమీ ఏర్పాటు, తెలుగు మాధ్యమం అమలు సాధ్యమయ్యాయి. విద్యారంగంలో ప్రైవేటు వ్యాపారం పుంజుకొన్న దరిమిలా ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే తప్పుడు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు ఇకనైనా విజ్ఞత చూపించి నిజమైన అభివృద్ధి సొంత భాష ద్వారా సాధ్యమనే విషయాన్ని ప్రజలకు గట్టిగా తెలియజెప్పాలి.

తెలుగులోనే ప్రభుత్వ పాలన వ్యవహారాలు జరగడానికి అంటే అధికార భాష అమలుకు ఉద్యోగాలకు, తెలుగు మాధ్యమానికి విడదీయలేని సంబంధం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పదమూడు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. ఇవి ఇంకా పెరగవచ్చు. వీరందరూ తెలుగువారి కోసమే పనిచేయాలి. పరిపాలన అంతా తెలుగులో ఉంటే ఈ ఉద్యోగులు అందరూ తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించాల్సి ఉంటుంది. అప్పుడు ఈ పదమూడు లక్షల మందికీ తెలుగు మాధ్యమమే అవసరం. ఆంగ్ల మాధ్యమంతో పనిలేదు. అయినా ఒక పాఠ్యాంశంగా ఇంగ్లిష్ ఉంటుంది కాబట్టి ఆ పరిజ్ఞానం సరిపోతుంది. తెలుగువారందరికీ వారి ప్రభుత్వ కార్యకలాపాలు మాతృభాషలోనే జరుపుకోవడం వారికి సంక్రమించిన హక్కు. గ్రామంలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయం తనకు తెలియని భాషలో ఎందుకు పనిచేయాలి? ప్రతి పౌరుడూ ప్రభుత్వం తన మాతృభాషలో పనిచేయాలని కోరుకోవడం అతడికి ఉన్న హక్కు. దీన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. దీన్ని విస్మరించి ఆంగ్లంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయని చెప్పడం బాధ్యతారాహిత్యం. ఫలానా వర్గాలవారి అభివృద్ధికి ఆటంకమని భావించడమూ సరికాదు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అధికార భాషగా తెలుగును అన్ని స్థాయుల్లో అమలు చేయాలి. తెలుగు మాధ్యమంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయని చెప్పగలగాలి. అలాకాదు - వేము ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తామనే వాళ్లు ఆంగ్లభాషలో మరింత నైపుణ్యం సంపాదించుకోవచ్చు. కేంద్రప్రభుత్వం సరికొత్తగా రూపొందిస్తున్న విద్యావిధానంలో బోధన అంతా మాతృభాషలో సాగాలని చెప్పింది. దీన్ని ఒక చట్టంగా తప్పనిసరిగా దేశమంతా అమలయ్యేలా చేయవలసిన అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల విద్యవరకైనా తెలుగు మాధ్యమం ఉండాలి.



# గాంధీజీ ప్రతిపాదించిన బేసిక్ విద్య యొక్క మూలసూత్రాలు

1. ఏ విద్య గాని సత్యమైనదైతే స్వయం పోషకమైనదిగా వుండాలి. అనగా విద్య పూర్తి అయ్యేసరికి, మూలధనం అలా వుండగా తన ఖర్చును తాను భరించగలిగినదై వుండాలి.

2. విద్య ముగిసేవరకు కూడా చేతుల యొక్క కౌశలం వినియుక్తం కావాలి. అనగా, విద్యార్థులు ప్రతి దినము కొంతసేపు హస్త కౌశలంతో కూడిన పరిశ్రమ నెరవేర్చాలి.

3. విద్య అంతా ప్రాంతీయ భాషలోనే నేర్పాలి.

4. ఈ విధానంలో వర్గీయమైన మత విషయక శిక్షణకు స్థానం లేదు. మౌలికమూ, విశ్వజనీనమూ అయిన నైతిక శిక్షణకు పూర్తిగా అవకాశం ఉంటుంది.

5. ఈ విధానం ద్వారా విద్య నభ్యసించేవారు పిల్లలైనా, వయోజనులైనా, బాలురైనా, బాలికలైనా, వారు అభ్యసించిన విద్య వారి వారి గృహాలలో వ్యాప్తి పొందగలిగినదై వుండాలి.

6. ఈ పద్ధతిని విద్యాభ్యాసం పొందే లక్షలాది విద్యార్థులంతా తాము భారతదేశమంతటికీ చెందినవారుగా భావించుకుంటారు. కనుక వారొక అంతర రాష్ట్ర భాషను నేర్చుకొని వుండాలి. అట్టి అంతర రాష్ట్ర భాష నాగరిక లిపిలో గాని, ఉర్దూ లిపిలో గాని రాయబడే హిందూస్థానీ భాష ఒక్కటే కావున విద్యార్థులకు పై రెండు లిపులను కూడా నేర్పాలి.

మన దేశం వంటి పేద దేశంలో దైహిక పరిశ్రమ విధానాన్ని ప్రవేశపెట్టడం రెండు విధాలుగా ఉపయుక్తం అవుతుంది. ఒక వంక అది మన పిల్లల చదువు ఖర్చును ఆర్జిస్తుంది. రెండవ వంక మున్ముందు వారు తమకు ఇష్టమైతే జీవనోపాధికి వినియోగించుకొనుటకు పనికి వచ్చే ఒక వృత్తి విద్యను ఒసగుతుంది. అట్టి పద్ధతి మన పిల్లలకు స్వయంపోషక శక్తిని చేకూరుస్తుంది. శ్రమ అంటే గౌరవంగా చూడటం అనేదే జాతీయ నైతిక బలాన్ని అన్నిటికన్నా ఎక్కువగా పెంచుతుంది. ♦

**వికాసంలో వెనకబాటు**

రాజకీయ నాయకులు మామూలు సందర్భాల్లో కాని లేదా ఎన్నికల ప్రచారంలో కాని ఆయా ప్రాంతాల భాష యాసల్లో ఎందుకు మాట్లాడుతున్నారు? జాతీయ స్థాయి నాయకులు వేరే రాష్ట్రాల్లో హిందీలో మాట్లాడి, దాన్ని మరొకరితో అనువాదం చేయిస్తున్నారు. ఎందుకు? తాము చెప్పదలచుకున్నది సూటిగా ప్రజలకు చేరాలనే కదా! ప్రజల భాషతో అధికారంలోనికి వచ్చినవారు అదే భాషలో చదువు చెబితే ప్రజలకు తేలిగ్గా మనసుకు హత్తుకునేలా చెప్పవచ్చు- అనే ప్రాథమిక విషయాన్ని ఎందుకు గుర్తించడం లేదు. బాగా అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాలు కొన్ని వారి మాతృభాషలో విద్యాబోధన చేస్తుండగా దాన్ని మనం ఎందుకు గ్రహించడం లేదు? తెలుగు భాషకు అత్యంత అధికంగా ఉత్పాదక శక్తి ఉంది. ఎన్నో పారిభాషిక పదాలు సిద్ధంగా ఉన్నాయి. పారిభాషిక పద నిఘంటువుల్నీ తయారు చేసింది తెలుగు అకాడమీ. ఉర్దూ వంటి తక్కువమంది మాట్లాడే భాషలోనే శతాబ్దం క్రితమే ఇంజినీరింగ్, వైద్య విద్యలను బోధించగలిగితే, తెలుగులో ఎందుకు చెప్పలేమని మనవారు ఆలోచించడం లేదు. కర్ణాటకలో పీజీ వరకు కన్నడ మాధ్యమం ఉంది. తమిళులు మరింత ముందుకెళ్లి హైకోర్టు తీర్పులు కూడా తమిళంలో ఉండాలని పట్టుబడుతున్నారు. కేరళలో మాతృభాషలోనే విద్యాబోధన ఉంది. మన తెలుగువారికే ఈ దుస్థితి ఎందుకు?

ఏ భాషలో విద్యాబోధన జరగదో ఆ భాష 40 సంవత్సరాల్లో నశించిపోతుందని యునెస్కో అధ్యయనం శాస్త్రీయంగా చాటిన విషయం గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వాలు ఇంగ్లీషు మీడియం విద్యను ప్రోత్సహిస్తే రాబోయే కాలంలో తెలుగు కేవలం 'మౌఖిక భాష'గా మిగిలిపోతుంది. చదవడం, రాయడం చేతకాని జాతిగా మిగిలిపోతుంది. పక్క రాష్ట్రాలవారు భాషా వికాసంలో ముందుకెళ్తుంటే, తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి అతిదీనంగా ఉండటం మన దురదృష్టం. ఈ స్థితిలో భాషను కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది!

***(ఈనాడు 12.11.2019)*** ♦

# భాష అంటే మనం ఏమనుకుంటున్నాం

- కృష్ణకుమార్

*ప్రతి పిల్లా, పిల్లవాడూ తన మాతృభాష ఏదైనప్పటికి కొన్ని తక్షణ ప్రయోజనాల పరిపూర్తి కోసం భాషను ఉపయోగిస్తారు. ఒక ముఖ్యమైన ప్రయోజనం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. దీనికి భాష అద్భుత సాధనంగా పనిచేస్తుంది. పిల్లవాడి దృక్పథాన్ని స్వీకరించి, అతని జీవితంలో భాష నిర్వహించే కార్యకలాపాలను అవగాహన చేసుకుంటే తప్ప అధ్యాపకులుగా, రక్షకులుగా, తల్లితండ్రులుగా మనం మన పాత్రను సముచితంగా నిర్ధారించలేం.*

భాష అనగానే భావ వినిమయ సాధనం అని నిర్వచించడం మనకు బాగా అలవాటయిపోయింది. ఈ అలవాటులో భాషను ఒక ఆలోచనా సాధనంగా విషయాలకు అనుభూతి పొందించే, ప్రతిస్పందింపజేసే సాధనంగా దాని ప్రయోజనాన్ని తరచుగా మరిచిపోతూ ఉంటాం. చిన్న పిల్లలతో పనిచేయాలనుకొనే వారికి భాషకు సంబంధించిన ఈ విస్తృత ప్రయోజనం ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే బాల్యంలో భాష పిల్లల వ్యక్తిత్వ, సామర్థ్యాల అభివృద్ధిలో ఒక నిర్మాణాత్మక పాత్రను నిర్వహిస్తుంది. ప్రపంచం పట్ల అవగాహనను, ఆసక్తులను, సామర్థ్యాలను చివరికి విలువలను, ఆలోచనా సరళులను (వైఖరులనూ) పిల్లలలో రూపొందించడంలో భాష సూక్ష్మమైనదే అయినా బలమైన శక్తిగా పనిచేస్తుంది.

మొదటగా సాధారణంగా ఎంతో వివాదాన్ని సృష్టించే ఒక విషయంలో స్పష్టంగా వుండవలసిన అవసరం వుంది. పాఠశాల అధ్యాపకులు 'హిందీ', 'ఇంగ్లీషు', లేదా మరో భాషను ఒక స్కూలు సబ్జక్టుగా (పాఠ్యాంశంగా) చూస్తుంటారు. అందువల్ల ఒక ప్రత్యేక భాషను బోధించడం గురించిన పుస్తకంగా ఈ పుస్తకాన్ని ఊహించుకుంటారు. మరో వైపున నిపుణులు బిడ్డ మాతృభాష, ద్వితీయభాష మొదలయిన విధంగా బలమైన వ్యత్యాసాలు చూపుతుంటారు. అధ్యాపకులూ, నిపుణులూ కూడా భాషా బోధన గురించిన పుస్తకం ఒక ప్రత్యేక భాషను నియంత్రించే సూత్రాలు, సాధారణ నిర్మాణాలు, పదజాలం మొదలయిన వాటిని వర్ణించడంతో మొదలవుతుందని ఊహిస్తారు.

ఇది అటువంటి పుస్తకం కానేకాదు. ఏదో ఒక ప్రత్యేకభాషను బోధించడానికి ఇది గైడు ఎంతమాత్రం కాదు. పిల్లలు జీవితంలో ఏ భాష అయినా నిర్వహించే కార్యాలను గురించి రాసిన పుస్తకం. ప్రతిపిల్లా, పిల్లవాడూ తన మాతృభాష ఏదైనప్పటికీ కొన్ని తక్షణ ప్రయోజనాల పరిపూర్తి కోసం భాషను ఉపయోగిస్తారు. ఒక ముఖ్యమైన ప్రయోజనం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. దీనికి భాష ఒక అద్భుతమైన సాధనంగా పనిచేస్తుంది. పిల్లవాడి దృక్పథాన్ని స్వీకరించి, అతని జీవితంలో భాష నిర్వహించే కార్యకలాపాలను అవగాహన చేసుకుంటే తప్ప అధ్యాపకులుగా, వారి మంచిచెడ్డలు చూసేవారిగా, తల్లిదండ్రులుగా మనం మన పాత్రను సముచితంగా నిర్ధారించుకోలేం.

### భాష – చేష్ట

పిల్లల భాష వాళ్ళ తమ చేతులతో, శరీరాలతో చేసే పనులకు, వాళ్ళ పరిధిలోకి వచ్చిన వస్తువులకు సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటుంది. బాల్యంలో మాటలూ, చేష్టలూ ఒకటిగా ఉంటాయి. చేష్టలూ అనుభవాలూ మాటల అవసరాన్ని సృష్టిస్తాయి. అనుభవం పూర్తయిన తర్వాత మాటలు ఆ అనుభవాన్ని అందుబాటులోకి తెస్తాయి. పిల్లలు తమ పరిధిలోకి వచ్చిన వస్తువులతో మాటల సహాయం ద్వారా సంబంధాన్ని సుసంపన్నం చేసుకుంటారు. మరో విధంగా చెప్పాలంటే చేష్టలుగాని వస్తువులతో సబంధాన్ని కలిగి లేకపోయినట్లయితే పిల్లలకు మాటలు శూన్యంగానూ, ప్రాణరహితంగానూ తయారవుతాయి. పిల్లి, పరిగెత్తడం,

పడదం, నీలం, నది, గరుకు వంటి మాటలు తొలిసారి ఆ వస్తువుతో గాని, చర్యతో గాని పిల్లవాడు ప్రత్యక్షంగా పాల్గొన్న సందర్భంలో వాడక పోయినట్లయితే పిల్లవాడికి వాటితో అంత లాభం ఉండదు. ప్రత్యక్ష సంబంధం తర్వాత మాత్రమే ఈ మాటలు ఒక ఆకారంతో అన్వయిస్తాయి. భవిష్యత్తులో ఒక అర్థవంతమైన ప్రయోగానికి ఉపయోగపడతాయి.

పిల్లవాడి ఈ భౌతిక అనుభవాలకూ మాటలకూ మధ్య ఉన్న సంబంధం పెద్దల మీద ముఖ్యంగా అధ్యాపకుల మీద ఒక విశిష్టమయిన బాధ్యతను ఉంచుతుంది. ప్రస్తుతం నీ అజమాయిషీలో ఉన్న పిల్లలకు అప్పటికే తల్లిదండ్రులు ఒక విస్తృత పరిధిలో అనుభవాలను కలిగించి ఉంటారని ఒక అధ్యాపకునిగా నీవు ఆశించవచ్చు. కాని ఎంతో మంది తల్లిదండ్రుల విషయంలో ఇది నిజం కాకపోవచ్చు. బాల్యంలోనే ఒక విస్తార వస్తుశ్రేణితో తమ పిల్లలకు పరిచయం కలిగించేంత ఆత్మవిశ్వాసం చాలా మంది తల్లిదండ్రులకు ఉండదు. పిల్లలు ఒక పని చేయాలన్నా, దేనినైనా గమనించాలన్నా మెల్లగా చేస్తారు. దీన్ని భరించే ఓపిక, తీరిక చాలామంది తల్లిదండ్రులకు ఉండదు. పిల్లలు పంపుదగ్గర నీటిధార కింద వేళ్ళుపెట్టి ఒక అరగంట నిలబడ్డా, పాత్రలన్నీ తీసి నేలమీద పెట్టినా, గొడుగును అనేకమార్లు తెరవడం మూయడం చేసినా పెద్దలకు అసందర్భంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు వస్తువులు పాడైపోకుండా ఉండడం కోసం, పిల్లలకు హాని కలగకుండా ఉండడం కోసం కొద్ది అనుభవాలకు మాత్రమే పరిమితం చేసి తక్కిన అన్ని అనుభవాలనూ పెద్దలు నిషేధిస్తారు.

తల్లిదండ్రులు ఏమిచేసినా, చేయకపోయినా ఉపాధ్యాయుని పని మాత్రం సుస్పష్టమే. జీవితానుభవాలకు, వస్తువులకు భాష ఉపయోగాన్ని జోడించడానికి పిల్లలు నిరంతరం ప్రయత్నించడాన్ని అనుమతించే వాతావరణాన్ని ఉపాధ్యాయుడు కల్పించాలి.

ఏ పాఠశాలలో పిల్లలు తమ చేతులతో అనేకరకాల పనులు చేయరో, కేవలం కూర్చుని ఉపాధ్యాయుడు చెప్పేదే వింటూ ఉంటారో, తాకడానికి, వాడడానికి, పగలగొట్టడానికి, పునర్నిర్మించడానికి వస్తువులుండవో అది భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి తగిన మంచి స్థలం కాదు.

**పిల్లలు భాషతో చేసే పనులు**

పిల్లల భాషను అధ్యయనం చేసిన వాళ్లు పిల్లలు మాట్లాడడంలోని ప్రాథమిక సామర్థ్యాల మీద అధికారం సంపాదించగానే భాషను ఆశ్చర్యకరంగా వివిధ ప్రయోజనాలకు ఉపయోగించడం ప్రారంభిస్తారని చెప్తారు. అటువంటి ప్రయోజనాలలో కొన్ని ఈ కింద ఇచ్చినవి.

**తన కార్యకలాపాలను నిర్దేశించుకోవడం**

పిల్లలు ఒక పనిచేసేటప్పుడు ఆ పని గురించి తరచుగా మాట్లాడుతూ ఉంటారు. ఒక విధంగా అది తమ పని మీద తాము స్వగతంగా చేస్తున్న వ్యాఖ్య. తరచుగా ఈ వ్యాఖ్యానం వాళ్లు తమ పనిని దీర్ఘకాలం కొనసాగించడానికి తోడ్పడుతున్నట్లుగా తోస్తుంది. ఆ పనిలో ఆసక్తిని నిలబెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. ఎవరైనా ఈ వ్యాఖ్యానాన్ని వింటున్నా వారికి పట్టదు. ఉదాహరణకు కొంతమంది చిన్న పిల్లలు తడి ఇసుకతో కోటలూ, సొరంగాలూ నిర్మిస్తున్నారనుకోండి. ప్రతి పిల్లవాడూ విడివిడిగా ఒక వ్యాఖ్యానం చేస్తూ ఉండవచ్చు. చాలాసార్లు అది కేవలం మెల్లగా వినిపిస్తున్న గొణుగుడే కావచ్చు.

**ఇతరుల కార్యకలాపాలను, ధ్యానాన్ని నిర్దేశించడం:**

ఇది ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు బాగా తెలుసు. ఎందుకంటే మన సమయంలో చాలా భాగం పిల్లల కోరికలు తీర్చడానికే సరిపోతుంది. వాళ్ల భౌతిక అవసరాల స్పృహ మనకు బాగానే ఉంటుంది. ఇతర విధాల అవసరాలు కూడా ముఖ్యమైనవే. ఇవి మేధో పరమైనవి కాని, భావాత్మకమైనవి కాని కావచ్చు. తమకు కుతూహలాన్ని కలిగించే, ఆసక్తి కలిగించే వాటివైపు దృష్టిని మరలించడానికి పిల్లలు భాషను ఉపయోగిస్తారు. తమ ధ్యానాన్ని ఆకర్షించిన దానిపట్ల తమ మాటలు వినేవాళ్లు కూడా ఆసక్తిని చూపించాలని పిల్లలు కోరుకుంటారు.

ఒక పిల్లల గుంపును మీరు పరిశీలించినట్లయితే వాళ్లు ఏదైనా వస్తువు వైపుగాని, ఇతరులు గమనించలేదని తాము భావించే ఒక లక్షణం వైపుగాని పరస్పర ధ్యానాన్ని ఆకర్షించడం గమనిస్తాం. భాషను ఈ విధంగా ఉపయోగించుకోవడంలోని ప్రాధాన్యం అది వ్యక్తంచేసే ఆకాంక్ష మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఆకాంక్ష ఏమిటంటే 'నేను గమనించిన దాన్ని ఇతరులు కూడా చూడడానికి ఇష్టపడతారు' అన్నది. మానవ సంబంధాలు, కలిసి ఉండడంలోని ఆనందం గురించి మనలో గాఢంగా పాతుకొని ఉన్న అభిప్రాయాలపై ఈ ఆకాంక్ష ఆధారపడి ఉంది. ఎవరి ధ్యానాన్ని ఈ విధంగా ఆకర్షించడానికి ప్రయత్నం

జరుగుతుందో అది నెరవేరక పోయినట్లయితే భాషాభివృద్ధికి ఒక ప్రాథమిక హేతువును నిర్లక్ష్యం చేసినట్లవుతుంది.

**ఆడుకోవడానికి**

రెండున్నర ఏళ్లపైబడ్డ పిల్లలు చాలామందిలో ఆడుకోవడానికీ, వినోదానికీ ఒక గొప్ప సాధనంగా మాటలుపయోగపడతాయి. రకరకాల గొంతుల్లో మాటలను పునరుచ్చరించడం, వాటిని వికృతం చేయడం, విచిత్రమైన పదబంధాలను కల్పించడం మొదలయిన ప్రక్రియలన్నీ వాళ్లకెంతో వినోదాన్ని చేకూరుస్తాయి. మాటలను అసందర్భంగా ఉపయోగించడం వాళ్లకు ఇష్టంగా ఉంటుంది. మాటల్ని ఈ విధంగా వికృతం చేసే పద్యాలు వాళ్లు తేలిగ్గా నేర్చుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే పిల్లలకు మాటలు ఆటవస్తువులు. మాటలతో ఆటలు సృజనాత్మకతనూ, శక్తిని వ్యక్తం చేయడానికి గొప్ప సాధనాలుగా ఉపయోగపడతాయి.

**విషయ వివరణం**

ఒక విషయం ఎట్లా జరిగిందో తమ జ్ఞానాన్ని చూపించుకోవడానికి ఆ విషయం గురించి పిల్లలు మాట్లాడతారు. ఉదాహరణకు ఒక మూడేళ్ల పిల్లవాణ్ణి వర్షం ఎట్లా కురిసిందని అడిగారనుకోండి, ఆకాశాన్ని తెల్లని మబ్బులు కప్పివేశాయని, తర్వాత చిన్న చిన్న తుంపరలు మొదలయ్యాయని, ఆ తర్వాత మనకేమీ కనిపించనంతగా పెద్దవాన కురిసిందనీ పిల్లవాడు మనకు చెప్పవచ్చు. ఈ ఉదాహరణలో జరిగిన సంఘటనలను ఒక క్రమంలో చెప్పడం ద్వారా పిల్లవాడు ఒక పెద్ద సంఘటన ఎలా జరిగిందో వివరిస్తున్నాడు. ఈ విషయ వివరణం నుండే కథలు పుడతాయి. ఈ విధంగా చూసినప్పుడు కథలన్నీ విషయ వివరణలే. అయితే అన్ని కథలూ విషయాలకు విశ్వసనీయమైన, శాస్త్రీయమైన వివరణలిస్తాయని అనుకోకూడదు. జీవితానికి అర్థం చెప్పాలనే కోరికకు ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి. రాజకీయాలలోగాని, ప్రపంచంలోగాని జరిగిన సంఘటనలను వివరించాలనే కోరిక పెద్దవాళ్ళలో ఎంతగా ఉంటుందో చిన్న పిల్లలలో కూడా తమ జీవిత సంఘటనలకు అర్థం చెప్పాలనే కోరిక అంతగానే ఉంటుంది.

**జీవితానికి ప్రాతినిధ్యం**

భాష ఉపయోగాలన్నింటిలోనూ ఇది ఇమిడి ఉంది. అయినా దీన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి. లేకపోతే మరచిపోయే ప్రమాదం ఉంది. పెద్దల్లాగానే పిల్లలు కూడా గతాన్ని నెమరువేసుకోడానికి – ఒక సంఘటనను గాని, వ్యక్తిని గాని, మరో చిన్న విషయాన్ని గాని గుర్తుచేసుకోవడానికి భాషను ఉపయోగిస్తారు. మన చుట్టూ లేని ఒక విషయాన్ని పున:సృజించడానికి మాటలు ఉపయోగపడతాయి. మనం పున:సృష్టిచేసిన ఈ విషయం తరచుగా ఎంతో వాస్తవంగా కనిపిస్తుంది. దాన్ని గురించి మనం చాలాకాలం వరకు చెప్పుకోవచ్చు.

ఒక తీవ్ర ఉద్వేగ స్థాయిలో ఒక విషయంతో సమాధానపడడానికి దాని గురించి పదేపదే మాట్లాడుతారు. ఏదైనా ఒక దానికి భయపడ్డ శిశువు ఆ భయం పోయేంతవరకు దాన్ని గురించి అనేకసార్లు మాట్లాడవచ్చు. ముఖ్యంగా జీవితం ఒక హఠాత్ పరిణామాన్ని శిశువు ముందు పెట్టినప్పుడు దాన్ని (దానిలో వున్న అనిశ్చిత, గందరగోళం, కొన్నిసార్లు భయంతో సహా) దాటడానికి, ఆ సంఘటనను ఎన్నోసార్లు మాటల సహాయంతో పునర్నిర్మిస్తారు. ఈ ప్రక్రియ శిశువుకు ఆ సంఘటనతో సాన్నిహిత్యం కలిగేవరకు సాగుతుంది.

**తన్మయీ భావం**

ఎవరైనా చెప్తూ ఉన్న కథను విన్నప్పుడు – అది అతని అనుభవమైనా కావచ్చు, మరెవరి అనుభవమైనా కావచ్చు – ఈ కథలోని పాత్రలతోనూ సన్నివేశాలతోనూ తన్మయమై స్పందిస్తాము. మన ప్రస్తుత జీవితానికి దూరంగా చివరికి మన పరిమిత అనుభవాలను దాటి కథలో తన్మయత్వం చెందుతాం. ఒక ఆటబొమ్మ అనుభూతుల్ని గురించి అడిగినప్పుడు, పిల్లవాడు తనను ఆ ఆట బొమ్మగానే ఊహించుకుంటాడు. ఇతరులు పొందుతున్న అనుభవాన్ని తాముకూడా పొందడానికి భాష ఉపయోగపడుతుంది.

**భావిని ఊహించడం**

అప్పటికి జరిగి ఉండనివి, అసలు సంభవాలు కానివీ మన సంభాషణలకు తరచూ వస్తువులవుతుంటాయి. విచిత్ర పరిస్థితులలో ఏం జరుగుతుందని తామనుకుంటారో దాన్ని గురించిన భయాలనూ, ప్రణాళికలనూ, ఊహలనూ పిల్లలు తరచుగా వ్యక్తం చేస్తారు. ఒక భవిష్యత్తు చిత్రాన్ని నిర్మించుకోవడంలో వారికి మాటలు ఉపయోగపడతాయి. ఒక్కొక్కప్పుడు ఈ చిత్రం భవిష్యత్తును వాస్తవీకరించుకోవడానికి ఉపయోగపడుతుంది. కొన్నిసార్లు భవిష్యత్తును యథాక్రమంగా స్వీకరించడానికి ఉపయోగపడుతుంది.

### ప్రశ్నించడం, హేత్వీకరణ

పిల్లవాడు ఏదైనా విషయం అట్లా ఎందుకుందో తెలుసుకుంటేనే తప్ప పరిష్కారం కాని ఒక సమస్యను ఏదో ఒక పరిస్థితి కల్పించవచ్చు. చాలా సమస్యలు చిన్న పిల్లలు స్వయంగా పరిష్కరించుకోగలిగినవే, ఉదాహరణకు బస్సు హఠాత్తుగా ఎందుకు ఆగిపోయిందో, స్నానం చేసేటప్పుడు తలమీద నీళ్లు పోయడం తనకెందుకు ఇష్టంలేదో తేలిగ్గానే తెలుసుకోవచ్చు. ఒక మూడేళ్ల పసివాడు సాధారణంగా ఈ 'సమస్యల్ని అర్థం చేసుకుంటాడు. అయితే ఆ వయస్సు పిల్లలంతా సరయిన హేతువులను మాటల్లో వ్యక్తం చేయలేక పోవచ్చు. వ్యక్తం చేయగలిగిన పిల్లలు తమ పెద్దలు ఒక విషయాన్ని గురించి ప్రశ్నించడానికి, వాదించడానికి భాషను వాడడం విని ఉండడానికి ఎక్కువ అవకాశం ఉంది. వాళ్ళు కూడా ప్రశ్నించడానికి, వాదించడానికి పెద్దలు ప్రోత్సహించే ఉంటారు.

పైన చెప్పినటువంటి సమస్యలు గాక, ఒక శాస్త్రీయమైన రీతిలో చిన్న పిల్లలు అర్థం చేసుకోలేని ఇతర సమస్యలు కూడా ఉంటాయి. ఉదాహరణకు వర్షం కురవడానికి అసలయిన కారణం ఏమిటి? గాలి బలంగా వీచినప్పుడు ఒక చెట్టు ఎందుకు పడిపోతుంది? ఇటువంటి ప్రశ్నలు నాలుగయిదేళ్ల పిల్లలు అర్థం చేసుకోలేరు. అయినా ఇటువంటి సమస్యలు హేతువును గ్రహించడానికి సాధనంగా భాషను ఉపయోగించడానికి అద్భుతమైన అవకాశాలు. లభించిన హేతువు సరయినదా కాదా అన్నది ముఖ్యం కాదు. పిల్లవాడు హేతువును తెలుసుకోవడానికి, ఒక తెలియని విషయాన్ని గురించి ప్రశ్నించడానికి భాషను సాధనంగా ఉపయోగించడమే ముఖ్యం. పెద్దలు భాషను ఈ విధంగా ఉపయోగించడాన్ని పిల్లవాడు ఎంత ఎక్కువగా వింటే, భాషను ఈ పద్ధతిలో ఉపయోగించడం పిల్లవాడికి అంత అందుబాటులోకి వస్తుంది.

### మనం అనే మాటలు మనసును ప్రభావితం చేస్తాయి

పిల్లల జీవితాలలో భాష నిర్వహించే వివిధ పాత్రలను గురించిన చర్చ నుండి మనం ఒక విషయాన్ని గ్రహించవచ్చు. భాష చాలా వెసులుబాటు కలిగిన మాధ్యమం అని. జీవితంలో ఎటువంటి సన్నివేశానికైనా దాన్ని మలుచుకోవచ్చు. ఒక పరిస్థితి అవసరానికి అనుగుణంగా భాషను మలచుకోవడం ద్వారా మనం పరిస్థితితో అనుకూలత్వాన్ని మెరుగుపరుచుకోవచ్చు. మన నిత్య జీవితంలో ఈ ప్రక్రియకు సంబంధించి ఎన్నో ఉదాహరణలు లభిస్తాయి. ఎదుటి వాళ్లకు కోపం వచ్చిందనుకోండి, పరిస్థితిని మన ఉద్దేశానికి అనుగుణంగా మలచుకోవడానికి తగిన పదాలతోనూ, గొంతుతోనూ ప్రతిస్పందిస్తాము. అంటే తగాదా పడాలనుకుంటే తీవ్రమైన మాటలను, వాతావరణంలో వేడి తగ్గించాలంటే మెత్తని మాటలను, అనునయంతో కూడిన గొంతును ఉపయోగిస్తాం.

భాషను మన ఇష్టం వచ్చిన రీతిగా విస్తృతంగా ఉపయోగించే సామర్థ్యం జీవితంలో ఎదురయ్యే అనేక విధాల పరిస్థితులను ఎదుర్కొనడంలో మనశక్తిని నిర్ణయిస్తుంది. ఒక స్థాయిలో మన భాష ఒక పరిస్థితికి మన స్పందనను వ్యక్తం చేస్తుంది. మరోస్థాయిలో మనభాష మనం ఎదుర్కొనే సమస్యలను మలుస్తుంది. నిరంతరమూ మనచుట్టూ జరుగుతూ వుండే విషయాలను అర్థం చేసుకోవడంలో భాష తోడ్పడుతుంది. మనం శారీరకంగా ఆ సంఘటనలలో పాల్గొంటున్నా, లేక కేవలం వాటి గురించి ఆలోచిస్తున్నా భాష ఈ విధంగా ఉపయోగపడుతుంది.

మనం భౌతికంగా ఒక సంఘటనను చూసినా, చూడకపోయినా, దాన్ని మనకు తెలియజేయడానికి వాడిన భాష ఆ సంఘటనకు మన స్పందనను ప్రభావితం చేస్తుంది. మనకెంతో దూరంగా ప్రతిరోజూ వేలాది సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వార్తా పత్రికలు మనకు వీటి గురించి తెలియజేస్తాయి. ఒక విధంగా ఒక సంఘటన ఎలా జరిగిందో దాని చిత్రాన్ని ఊహించుకోవడానికి వార్తా పత్రిక ఉపయోగపడుతుంది. వీధిలో చూసిన ఒక విషయాన్ని పిల్లవాడు తల్లికి చెప్పడం ఇటువంటిదే. వార్తా పత్రిక కాని, పిల్లవాడు చిత్రించిన చిత్రం వాళ్ళు దాన్ని చిత్రించడానికి వాడిన భాష ఎంత ఖచ్చితమైనదో అంతే ఖచ్చితమైనది. భాష మాట్లాడే వాడి ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది కాబట్టి దాని యధార్థత డిగ్రీలలోనే ఉంటుంది. పిల్లవాడు ఒక ప్రమాదాన్ని చూసి, భయపడినట్టయితే దాన్ని వాడు కొంత అతిశయోక్తిగానే చెప్తాడు. ఈ అతిశయోక్తి ద్వారా వాడు తన భయానికి న్యాయం చేకూరుస్తాడు. ఈ విధంగా తాను చూసిన దృశ్యానికి మెరుగ్గా అద్దపట్టయిన అనుభూతి పొందుతాడు.

చివరగా భాష మన ఆకాంక్షలకు రూపునిస్తుంది. ఓర్పుగా, ఒక పద్ధతి ప్రకారం విషయ వివరణం చేసే వ్యక్తి ఇతరులు కూడా అట్లాగే చేయాలని కోరతాడు. విషయాలను

# బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది నా కచ్చితమైన అభిప్రాయం



*"విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం. విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదని నా కచ్చితమైన అభిప్రాయం"*

**(డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్. వాల్యూమ్ 2, పేజి 312)**

గురించి లోతుగా విచారించే వ్యక్తి ఎదుటి వాళ్లు కూడా ఆ విచారణలో అటువంటి ఆసక్తిని కలిగి వుంటారని భావిస్తాడు. భాషను వివరణలకు, విచారణకు ఉపయోగించడం ద్వారా ఇటువంటి వ్యక్తులు వివరణ, విచారణల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తారు. ఒక సమాజంలో కాని, సంస్థలో కాని భాషను ఇటువంటి ప్రయోజనాలకు వాడక పోయినట్లయితే అక్కడ పెరుగుతున్న పిల్లలకు జాగ్రత్తగా వివరించడమూ, ఓపికగా వాదించడమూ అలవాటు కాదు. తల్లిదండ్రులు గాని, ఉపాధ్యాయులు గాని భాషను కేవలం పిల్లల్ని అదుపులో పెట్టడానికి మాత్రమే వినియోగిస్తే, పిల్లలు కూడా ఇతరుల్ని అదుపులో పెట్టే సాధనంగా మాత్రమే భాషను గుర్తిస్తారు. ఆజ్ఞలిస్తే తప్ప పని చేయని వ్యక్తులుగా ఎదుగుతారు.

పిల్లవాడి వ్యక్తిత్వాన్ని, అవగాహనలు, సామర్థ్యాలు, ధోరణులు, ఆసక్తులు, విలువలతో సహా భాష సృష్టించిన వాతావరణంలోనే శిశువు జీవిస్తాడు, పెరుగుతాడు కాబట్టి భాష వాడి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుతుందని మనం ఇప్పుడు జవాబు చెప్పవచ్చు. ఈ వాతావరణానికి ఉపాధ్యాయుడు చాలా ముఖ్యమైన తోడ్పాటునిస్తాడు. పిల్లవాడి జీవితంలో భాష వివిధ ప్రయోజనాల స్పృహ ఉపాధ్యాయుడికి ఉన్నట్లయితే పిల్లవాడి వేంధో, భావనాత్మక అవసరాలకు చక్కగా ప్రతిస్పందించగలుగుతాడు. వివిధ సందర్భాలలో పిల్లవాడు ఉపయోగించిన భాషకు ఉపాధ్యాయుని స్పందనలు చాలా ముఖ్యమైనవి. భాషను ఒక పద్ధతిలో ఉపయోగించడంలో పిల్లవాడి లక్ష్యాన్ని ఉపాధ్యాయుడు అర్థం చేసుకున్నట్లు ఈ స్పందనలు వెల్లడిచేస్తే అటువంటి స్పందనలు ఆ మార్గంలో పిల్లవాడి భాషా ప్రయోగాన్ని వృద్ధి చేస్తాయి. దీనికి భిన్నంగా ఏది సరయినది, ఏది కాదు అనే విషయంలో ఉపాధ్యాయుడి స్పందనలు ముందే ఏర్పరచుకున్న భావాలపై ఆధారపడి నట్లయితే అటువంటి స్పందనలు భావ వ్యక్తీకరణ, భావ వినిమయాలలలో పిల్లవాడి స్వాతంత్ర్యాన్ని నిరోధిస్తాయి.

*('పిల్లల భాష – ఉపాధ్యాయుడు' పుస్తకం నుండి–*
*ప్రచురణ: ప్రజాశక్తి బుక్‌హౌస్)* ♦

# ఏక కాలంలోనే ఉభయులూ ఉపాధ్యాయులూ, విద్యార్థులూ అయ్యేట్టు చేయాలి

**- పాలో ఫ్రెయిరె**

విమోచనా విద్యలోని హేతుబద్ధత భేదాల్ని తొలగించే వైపు సాగే బోధనలో వుంది. విద్య ఉపాధ్యాయ – విద్యార్థి వైరుధ్యాల పరిష్కారంతో మొదలవ్వాలి. వైరుధ్యపూరిత ధ్రువాల్ని సమన్వయ పరచాలి. ఆ రకంగా ఏక కాలంలోనే ఉభయులూ ఉపాధ్యాయులూ, విద్యార్థులూ అయ్యేట్టు చేయాలి.

ఈ పరిష్కారం యీ (బ్యాంకింగ్) "నిధి" భావనలో దొరకదు, (దొరకలేదు కూడా). అందుకు విరుద్ధంగా యీ నిధి విద్య యీ వైరుధ్యాన్ని నిలబెట్టే వుంచుతుంది. యింకా చెప్పాలంటే ప్రోత్సహిస్తుంది కూడా. మొత్తంగా పీడక సమాజం ప్రతిబింబించే యీ కింది దృక్పథాలు, ఆచరణలు అందుకు కారణం.

- ఉపాధ్యాయుడు బోధిస్తాడు, విద్యార్థులకు బోధన అందుతుంది.
- ఉపాధ్యాయుడు సర్వజ్ఞుడు, విద్యార్థి పరమ అజ్ఞాని.
- ఉపాధ్యాయుడు ఆలోచన చేస్తాడు. విద్యార్థి తన గురించి యితరులు ఆలోచించేటట్టు వుంటాడు.
- ఉపాధ్యాయుడే మాట్లాడుతూ వుంటాడు, విద్యార్థి వింటూ వుంటాడు– అణుకువగా.
- ఉపాధ్యాయుడు క్రమశిక్షణ అమలుచేస్తాడు, విద్యార్థులు అందుకు బద్ధులవుతూ వుంటారు.
- ఉపాధ్యాయుడే తనకి నచ్చినదాన్ని ఎంచుకుని అమలు జరిపిస్తాడు. విద్యార్థులు దాన్నే నెత్తిన పెట్టుకుంటారు.
- ఉపాధ్యాయుడు ఆచరిస్తాడు. ఆ ఉపాధ్యాయుడి, ఆచరణ ద్వారా విద్యార్థులు ఆచరిస్తున్నామన్న భ్రమలో వుంటారు.
- కార్యక్రమ విషయం ఉపాధ్యాయుడు ఎంపిక చేస్తాడు, విద్యార్థులు (వాళ్ళని ఎవళ్ళైనా అడిగితే గదా) అనుసరిస్తారు.
- జ్ఞానంవల్ల వచ్చే అధికారాన్ని తన వృత్తిపరమైన అధికారాన్ని ఉపాధ్యాయుడు గజిబిజి చేసుకుంటాడు. దాన్ని విద్యార్థుల స్వేచ్ఛకు పోటీగా పెడతాడు.
- నేర్చుకునే పద్ధతిలో ఉపాధ్యాయుడు కర్త. విద్యార్థులు కేవలం దానికి బద్ధులు (కర్మ) మాత్రమే.

విద్యకు సంబంధించిన యీ నిధి భావన మనుషుల్ని సర్దుకుపోయేవాళ్ళుగా, ఎలాపడితే అలా లాక్కుపోగల వాళ్ళుగా చూడ్డంలో వింత ఏమీ లేదు. విద్యార్థులు తమ ఖాతాలో ఎంత మొత్తం నిలవ చేసుకుంటే అంతటా విమర్శనాత్మక చైతన్యం నష్టపోతూ వుంటారు. కాని విమర్శనాత్మక చైతన్యం వాళ్ళకి అందితేనే ప్రపంచాన్ని పరివర్తన చేసేవాళ్ళుగా ప్రపంచంలో జోక్యం కలిగించుకోగలరు. అలాగాక వాళ్ళు తమ నెత్తిమీద రుద్దుతున్న నిష్క్రియాపర పాత్రని ఏ మేరకు భరిస్తే, ఆ మేరకు యీ ప్రపంచాన్ని వున్నదున్నట్టుగా భావించి సర్దుకుపోతారు. తమలో కుక్కిన యదార్థ పరిస్థితి ఖండిత శకలాలతో సర్దుకుపోతారు.

విద్యార్థుల సృజనాత్మక శక్తిని కనీస స్థాయికి తగ్గించడమో, రద్దు చేయడమో యీ 'నిధి' విద్య చేస్తుంది. ఆ సామర్థ్యం దానికి వుంది. దాంతోబాటు దేన్నయినా తేలిగ్గా నమ్మే స్వభావానికి నీళ్ళు పోసి పెంచుతుంది. ఆ విధంగా పీడకుల ప్రయోజనాలకే అది ఊడిగం చేస్తుంది. ఈ ప్రపంచాన్ని విశదం చేసుకోవాలనిగాని, అది మార్పు చెందాలని గాని, వాళ్ళు వీసమెత్తు చూడరు. తమ 'మానవతావాదాన్ని' పీడకులు లాభసాటి పరిస్థితిని నిలబెట్టేందుకు వాడతారు. దాంతో విద్యాబోధనలో విమర్శనాత్మక దృష్టిని పెంపొందించే ఏ చిన్న ప్రయోగాన్నీ భరించలేరు. విమర్శనాత్మక దృష్టి కలిగితే ప్రపంచం గురించిన ఏకపక్ష భావన బీటలు వారుతుంది కదా? ఈ దృష్టి వస్తే ఒక అంశానికీ మరో అంశానికీ మధ్య సంబంధం ఏమిటోనన్న శోధన కలుగుతుంది. అందుకనే పీడకులు స్వతహాగానే ఆ ప్రయోగాలకు వ్యతిరేకంగా వుంటారు.

*('విముక్తి – విద్య 'పుస్తకం నుండి)* ♦

ప్రపంచాన్ని అబ్బురపరిచే

# ఫిన్లాండ్ విద్య

*ఫిన్లాండ్‌లో బోధన ఓ 'స్టార్ ఉద్యోగం'. కుర్రాళ్లంతా టీచర్‌గా మారడానికి ఉవ్విళ్లూరతారు. యూనివర్శిటీలో చదువుకొనే రోజుల్నుంచే దానికోసం కసరత్తు మొదలుపెడతారు. కానీ ఆ ఉద్యోగం పొందడం అంత సులువైన పనికాదు. ఓ ఆర్నెల్లు పుస్తకాలు తిరగేసి, పరీక్ష రాసి టీచర్‌గా మారిపోదాం అంటే కుదరదు. ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా చేరాలంటే కనీసం మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. సెకండరీ స్కూల్ టీచర్లకైతే పీహెచ్‌డీ తప్పనిసరి. ఏటా టీచర్ పోస్టులకు వచ్చే దరఖాస్తుల్లో కేవలం పదిశాతమే తుది పరిశీలనకు ఎంపికవుతాయి. వాటిని జల్లెడపడితే ఎక్కువశాతం మంది వివిధ యూనివర్శిటీల టాపర్లే కనిపిస్తారు. ఉద్యోగ ప్రవేశ పరీక్ష ద్వారా వాళ్లలోంచి ఇంకొందర్ని ఎంపిక చేస్తారు. ఆ తరువాతి దశ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిత్వం, విజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అంచనా వేస్తారు. కేవలం జీతం కోసం కాకుండా బోధనపైన ప్రేమతో ఆ వృత్తిలో అడుగుపెట్టేవాళ్లనే చివరికి ఎంపికచేస్తారు. రెండు మూడు నెలలపాటు సాగే ఆ ప్రక్రియ మన సివిల్ సర్వీసు అభ్యర్థుల ఎంపికకు ఏ మాత్రం తీసిపోదు. ఎంపికైనా టీచర్లకు ఏడాదిపాటు పిల్లలకు బోధించే విధానాలపైన శిక్షణ ఉంటుంది. అన్ని కఠినమైన దశల్ని దాటొస్తారు కాబట్టే టీచర్లంటే అక్కడివాళ్లకి అంత గౌరవం.*

అక్కడ ఏ పిల్లాడూ బడికెళ్లనని మారాం చేయడు. ఏ చిన్నారీ భుజాన పుస్తకాల సంచీతో ఆపసోపాలు పడుతూ కనిపించడు. యూనిఫాంలూ, హోంవర్కులూ, వార్షిక పరీక్షలు, మార్కులు, ర్యాంకుల బూచీలూ, రోజంతా సాగే స్కూళ్ళు, స్టడీ అవర్స్, ట్యూషన్లు.... ఒక్కమాటలో చెప్పాలంటే విద్యార్థులకు కష్టం కలిగించే ఏ చిన్న విధానాన్ని అనుసరించని ఏకైక దేశం ఫిన్లాండ్. అయితేనేం. ప్రపంచంలోని అత్యద్భుతమైన విద్యావ్యవస్థల్లో ఆ దేశానిది నిలకడగా తొలిస్థానం. అక్కడ ప్రతి విద్యార్థీ తరగతిలో టాపరే! పిల్లల్ని స్కూలుకి పంపించే ముందు తల్లిదండ్రులూ, పాఠాలు మొదలు పెట్టే ముందు టీచర్లూ..... ఫిన్లాండ్ వాసులు అనుసరిస్తోన్న పద్ధతుల్ని ఓసారి స్మరించుకోవడం మహా ఉత్తమం.

**అక్షరాస్యతలో నంబర్ 1**

గతేడాది కనెక్టికట్ విశ్వవిద్యాలయం నిర్వహించిన సర్వే ప్రకారం, ప్రపంచంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన దేశాల్లో తొలిస్థానం ఫిన్లాండ్ ది (100 శాతం). చదువుతో పాటు చదువుకున్న వాళ్ల వ్యవహారశైలినీ పరిగణనలోకి తీసుకొని నిర్వహించిన నాగరిక దేశాల సర్వేలోనూ దానికి తొలిస్థానం దక్కింది.

– తరగతిలోని విద్యార్థుల మధ్య ప్రతిభ విషయంలో అతి తక్కువ వ్యత్యాసం ఉన్న దేశం ఫిన్లాండ్. తెలివైన విద్యార్థులు కంటే, త్వరగా పాఠాలను అర్థం చేసుకోలేని పిల్లల దగ్గరే టీచర్లు ఎక్కువ సమయం గడపటం, సగటున పదిహేను మంది పిల్లలకు ఒక టీచర్ ఉండటం దానికి కారణం. ప్రతిభ ఆధారంగా పిల్లల్ని వేర్వేరు సెక్షన్లలో కూర్చోబెట్టే పద్ధతే వాళ్లకు తెలియదు.

– ప్రపంచవ్యాప్తంగా అతితక్కువ బోధనా గంటలూ, స్కూళ్లకు ఎక్కువ సెలవులూ ఉన్న దేశం ఫిన్లాండే. అక్కడ స్కూళ్లు గరిష్ఠంగా 180 రోజులు మాత్రమే పనిచేస్తాయి. భారత్‌లో దాదాపు 240 రోజులపాటు తెరిచి ఉంటాయి. అక్కడ సగటున ఒక ఉపాధ్యాయుడు ఏడాదికి 600 గంటల పాటు పాఠాలు చెబుతాడు. అదే మన దేశంలో ఆ సంఖ్య దాదాపు 1700 గంటలు. అంటే ఫిన్లాండ్ కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ.

– భవిష్యత్తులో విద్యార్థుల వృత్తిగత జీవితంలో పెద్దగా ఉపయోగపడని జాగ్రఫీ, హిస్టరీ లాంటి కొన్ని సబ్జెక్టులను ఈ ఏడాది నుంచి ఫిన్లాండ్ హైస్కూళ్ళలో తొలగించాలని నిర్ణయించారు. వాటి స్థానంలో ప్రస్తుత తరంలో జోరు మీదున్న రెస్టారెంట్లూ, జిమ్‌లూ, స్టార్టప్‌లూ లాంటి సమకాలీన అంశాల గురించి బోధిస్తారు.

– ఫిన్లాండ్‌లో స్కూల్ సిలబస్‌ను తయారుచేసే బాధ్యత పూర్తిగా టీచర్లదే. వివిధ ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త పాఠ్యాంశాలను చేరుస్తూ, పాతవాటిని తొలగిస్తూ ఉంటాయి.

– ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పిల్లల పుస్తకాల్ని ప్రచురించే దేశం ఫిన్లాండే. ప్రతి సిటీబస్సులో, రైల్లో ఓ పుస్తకాల స్టాండ్ కనిపిస్తుంది. విదేశీ కార్యక్రమాలని అనువదించకుండానే అక్కడి టీవీల్లో ప్రసారం చేస్తూ, వాటికింద సబ్‌టైటిళ్ళు వేస్తారు. టీవీ చూస్తూనే పిల్లలు స్థానిక భాషను చదవడం నేర్చుకునేందుకు ఆ పద్ధతి.

– పదకొండేళ్ళు వచ్చాకే ఫిన్లాండ్ పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు మొదలవుతాయి. అప్పటిదాకా బోధనంతా ఫిన్నిష్, స్వీడిష్ భాషల్లో సాగుతుంది. అక్కడ ఒక్కో విద్యార్థి సగటున నాలుగు భాషలు మాట్లాడగలడు.

– పోటీ పరీక్షలూ, కాలేజీలకు ప్రవేశ పరీక్షలూ, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లూ లేని దేశం ఫిన్లాండ్. హైస్కూల్ దశలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుని నిర్ణయించుకుని దానికి తగ్గ కోర్సులే చేస్తారు. ఆ విద్యార్థుల సంఖ్యకు సరిపడా వృత్తి విద్యా సీట్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుంది.

### అదే తేడా

'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో – ఆపరేషన్ డెవలప్‌మెంట్' అనే సంస్థ మూడేళ్లకోసారి ప్రపంచస్థాయిలో లెక్కలూ, సైన్స్‌లాంటి వివిధ అంశాల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తుంది. నాలుగేళ్ళ క్రితం ఆ పోటీలో పాల్గొన్న భారత్‌కు చివరి నుంచి రెండో స్థానం దక్కింది. దాంతో తరువాతి పరీక్షలో భారత్ పాల్గొనలేదు. అదే పోటీలో ఫిన్లాండ్ ఎన్నో ఏళ్లుగా నిలకడగా తొలి స్థానాన్ని సాధిస్తోంది. అక్కడి తలసరి ఆదాయంలో ఏడు శాతాన్ని చదువుపై ఖర్చు చేస్తుంటే, భారత్‌లో 3.3 శాతాన్నే ఖర్చు చేస్తున్నారు. అక్కడ హైస్కూల్ టీచర్ల సగటు నెలసరి ఆదాయం రెండున్నర లక్షలు. ఇక్కడది 31 వేలు. అక్కడ నెల రోజుల్లో చెప్పే పాఠాల్ని ఇక్కడ వారంలోనే ముగిస్తున్నారు. ఇలా ఎన్నో అంశాల్లో భారత్‌లాంటి అనేక దేశాల్లో ఫిన్లాండ్‌కి ఉన్న స్పష్టమైన తేడాలే, ఆ దేశ విద్యా వ్యవస్థని తిరుగులేని స్థానంలో నిలబెట్టాయి.

### నలభై ఐదేళ్ళ క్రితం...

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో తీవ్రంగా నష్టపోయిన దేశాల్లో ఫిన్లాండ్ ఒకటి. 1970 వరకూ అక్కడి విద్యా వ్యవస్థ నాసిరకంగా ఉండేది. సహజ వనరుల లభ్యతా తక్కువే. అలాంటి పరిస్థితుల్లో దేశం ముందుకెళ్లాలన్నా, ఇతర దేశాలతో సమానంగా ఎదగాలన్నా చదువుకున్న పౌరులే కీలకమని నాటి ప్రభుత్వ పెద్దలు నమ్మారు. డబ్బున్నవాళ్లంతా పిల్లల్ని మంచి స్కూళ్లకు పంపిస్తున్నారనీ, సామాన్యులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారనీ అర్థం చేసుకున్నారు. దాంతో ఎనభయ్యో దశకం తొలినాళ్లలో ప్రక్షాళన మొదలుపెట్టారు. దేశ విద్యా వ్యవస్థనంతా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని, ప్రైవేటు విద్యాసంస్థల్ని రద్దు చేసింది. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ నమానమైన విద్యను ఉచితంగా అందించడం మొదలుపెట్టింది. ఇలా గత నలభై ఐదేళ్లుగా విద్యా ప్రమాణాల్లో ఎన్నో మైలురాళ్లను దాటి, విద్యార్థుల సామర్థ్యం విషయంలో అగ్రరాజ్యాలనూ వెనక్కు నెట్టి దూసుకెళ్తోంది. ప్రభుత్వం, తల్లిదండ్రులూ, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం, ఒకరిపైన ఒకరికి సంపూర్ణ నమ్మకం ద్వారా సాధ్యమైన విజయమిది.

పదిలోపు వంద ర్యాంకులు, వందలోపు వెయ్యి ర్యాంకులు, వెయ్యిలోపు పదివేల ర్యాంకులు... మే, జూన్ నెలల్లో ఏ టీవీ ఛానల్ పెట్టినా అదే పనిగా ఈ అంకెల దండోరా చెవుల్ని హోరెత్తిస్తుంది. ఏ పత్రిక తిరగేసినా స్కూళ్లూ, కాలేజీల ప్రకటనలతో నిండుంటాయి. టాప్ ర్యాంకు వచ్చిన వాళ్లనే సమాజం నెత్తిన పెట్టుకుంటుంది. సచిన్‌లా బ్యాటింగ్ చేసే శక్తి ఉన్నా, రెహమాన్‌లా పియానో వాయించేంత టాలెంట్ సొంతమైనా, తరగతిలో మార్కులు రాకపోతే మాత్రం ఆ పిల్లాడు ఎందుకూ పనికిరాని మొద్దావతారమే! అందుకే మనదేశంలో చాలామంది చిన్నారులు ఆ అంకెల వేటలో పడి అందమైన బాల్యాన్ని కోల్పోతున్నారు. ఓ పది మార్కులు తగ్గితేనే మహాపాపం చేసినట్టు ప్రాణాలు తీసుకుంటున్న వాళ్ళూ ఉన్నారు. తల్లిదండ్రుల ఆరాటం, విద్యాసంస్థల ఒత్తిడీ కలగలిసి ఇక్కడ విద్యార్థుల పరిస్థితిని దయనీయంగా మార్చేస్తున్నాయి. ఉత్తమ విద్యావ్యవస్థల జాబితాలో నానాటికీ మన స్థానం దిగజారుతూ వస్తోంది.

సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించినా మనలాంటి ఎన్నో దేశాలు సాధించలేని ఫలితాలను ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ కలిగిన దేశంగా పేరున్న ఫిన్లాండ్, ఆడుతూ పాడుతూ అందుకుంటోంది. ఐరోపాలోని ఓ చిన్న దేశమైన 'ఫిన్లాండ్' విద్యార్థులపైన ఏ మాత్రం ఒత్తిడి

పెట్టకుండానే వాళ్లను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దొచ్చని నిరూపిస్తోంది. పరీక్షలు, ర్యాంకుల ప్రస్తావన లేకుండానే వాళ్లను ఇంజినీర్లు, డాక్టర్లు, ఇతర వృత్తి నిపుణులుగా తయారుచేస్తోంది. అన్ని విషయాల్లో అభివృద్ధి చెందిన అమెరికా, ఇంగ్లండ్ లాంటి దేశాలకు కూడా, పిల్లల్ని చదివించే విషయంలో ఫిన్లాండ్ కొత్త పాఠాలు నేర్పిస్తోంది. ఏటా తన బోధనా పద్ధతుల్ని మార్చుకుంటూ, కొత్త ప్రమాణాల్ని అందుకుంటూ గత నలభై ఐదేళ్లలో అక్కడి విద్యావ్యవస్థ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. మూడేళ్ళకోసారి అంతర్జాతీయంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించే 'ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎసెస్‌మెంట్ (పిసా) లెక్కల్లో అమెరికా, జపాన్, చైనా లాంటి దిగ్గజాలను దాటి ఆ చిట్టి దేశానికి చెందిన పిల్లలు వరుసగా తొలిస్థానాన్ని సాధిస్తున్నారు. ప్రతి విద్యార్థీ కలలుగనే తరగతి గదులూ, ప్రతి పాఠశాలా అనుసరించాల్సిన విధానాలూ, అందరు తల్లిదండ్రులూ పాటించాల్సిన నియమాలూ ఫిన్లాండ్ సొంతం.

### ఏడేళ్ళకు స్కూలు...

మన దేశంలో పిల్లలకు రెండేళ్లు దాటగానే తల్లిదండ్రులు స్కూళ్ల వేట మొదలుపెడతారు. బడిలో కాలు పెట్టకముందే అఆలూ, అంకెలూ బట్టీ కొట్టిస్తారు. కానీ ఫిన్లాండ్‌లో పిల్లలు స్కూల్లో అడుగుపెట్టాలంటే కనీసం ఏడేళ్లు నిండాల్సిందే. అప్పటివరకూ వాళ్లు పలకా బలపం, పుస్తకాలూ, పెన్సిళ్ళూ పట్టుకోరు. అలాగని నేర్చుకునే వయసునీ వృథా చేసుకోరు. డే కేర్ సెంటర్లలో ఉంటూ తమ మెదడుని పదును పెట్టుకునే పనిలో పడతారు. సాధారణంగా తొలి ఆరేళ్లలోనే పిల్లల మెదడు కణాలు 90 శాతం విచ్చుకుంటాయి. దేన్నైనా త్వరగా గ్రహించే శక్తి పెరుగుతూ వస్తుంది. అన్ని దేశాల్లో ఆరేళ్లలోపు వయసులోనే పిల్లలకు లెక్కలు, సైన్స్ లాంటి అంశాలకు సంబంధించిన ప్రాథమిక విషయాలు బోధిస్తారు. ఫిన్లాండ్‌లో మాత్రం తొలి ఆరేళ్లలో పాఠాలకు బదులుగా, పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తారు. అందరితో కలిసి ఆడుకోవడం, పద్ధతిగా తినడం, నిద్రపోవడం, ఒకరికొకరు సహాయపడటం, శుభ్రత పాటించడం, భావవ్యక్తీకరణ నైపుణ్యం, జాలీ, దయా, సామాజిక స్పృహ... ఇలాంటి అన్ని జీవన నైపుణ్యాలను అలవరచుకునేలా ప్రోత్సహిస్తారు. బడికి ఎప్పుడైనా వెళ్లొచ్చు. కానీ మంచి పౌరుడిగా ఎదగడానికి పునాది మాత్రం పసి వయసులోనే పడాలన్నది ఫిన్లాండ్ వాసుల నమ్మకం. అందుకే తొలి ఆరేళ్లను దానికోసమే కేటాయిస్తారు. 'నేర్చుకోవాల్సిన వయసు వచ్చినప్పుడు పిల్లలు అన్నీ నేర్చుకుంటారు. తొందరపెట్టి వాళ్లలో ఒత్తిడి పెంచాల్సిన పనిలేద'ంటారు అక్కడి ఉపాధ్యాయులు.

### చదువంతా ఉచితం

ఉన్నత విద్యావంతులే మంచి పౌరులుగా మారతారు. అలాంటి ప్రజలున్న దేశమే గొప్పదిగా ఎదుగుతుందన్నది ఫిన్లాండ్ నమ్మిన సిద్ధాంతం. అందుకే ఆ దేశంలో పుట్టిన ప్రతి చిన్నారి చదువు బాధ్యతనూ ప్రభుత్వమే భుజాన వేసుకుంది. ఎనిమిది నెలల వయసులో డే కేర్ సెంటర్‌లో కాలుపెట్టినప్పట్నుంచీ పాతికేళ్ల తరువాత యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డీ పట్టా అందుకునేంత వరకూ రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరికీ ఉచిత విద్యను అందిస్తోంది. ప్రైవేటు పాఠశాలలూ, ప్రైవేటు యూనివర్శిటీల ప్రస్తావనే అక్కడ కనిపించదు. చిన్న కార్మికుడి నుండి దేశాధినేత వరకూ అందరూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకొని బయటకు రావాల్సిందే. పుట్టుకతో ఎంత సంపన్నులైనా చదువు విషయంలో మాత్రం అక్కడి పిల్లలంతా సమానమే. చిన్న పల్లెటూరు నుంచి దేశ రాజధాని వరకూ అన్ని స్కూళ్లలో ఒకే తరహా శిక్షణ పిల్లలకు అందుతుంది.

### ఆరేళ్లదాకా ఆడుతూ పాడుతూ...

స్వెటర్లూ, ఉయ్యాలా, ఉగ్గు గిన్నె... పసిపిల్లల తల్లిదండ్రులకు ఎవరైనా ఇలాంటి చిరుకానుకలిస్తారు. ఫిన్లాండ్‌లో మాత్రం బిడ్డ పుట్టాక ఆస్పత్రి నుంచి వెళ్లేప్పుడు వైద్యులు మూడు పుస్తకాలను తల్లిదండ్రుల చేతిలో పెడతారు. పిల్లల్ని బాగా చదివిస్తూనే, తల్లిదండ్రులూ పుస్తకాల్ని చదివే అలవాటు కొనసాగించాలని సూచిస్తూ, ఆ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే తొలిరోజుల్లో తల్లి సంరక్షణ చాలా కీలకం. అందుకే అన్ని సంస్థలూ తప్పనిసరిగా ఎనిమిది నెలల ప్రసూతి సెలవుల్ని మహిళలకు అందిస్తాయి. ఆ తరువాత కూడా ఉద్యోగానికి వెళ్లని తల్లులు ఆదాయం గురించి బెంగపడకుండా మూడేళ్లపాటు 'డే కేర్ ఎలవెన్స్' పేరుతో ప్రభుత్వం కొంత డబ్బుని చెల్లిస్తుంది. కానీ ఆ అవకాశాన్ని ఉపయోగించుకునే తల్లుల సంఖ్య అక్కడ ఐదు శాతంలోపే. దానికి కారణం ప్రభుత్వ పరిధిలో ఉచితంగా పనిచేసే 'డే కేర్' కేంద్రాలే. ఎనిమిది నెలల వయసు నుంచి ఆరేళ్లు వచ్చే వరకూ పిల్లలంతా

ఆ ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో హాయిగా పెరగొచ్చు. అక్కడ ప్రతి పన్నెండు మంది పిల్లలకూ ఓ టీచర్. ఇద్దరు నర్సుల చొప్పున అందుబాటులో ఉంటారు. చిన్నారుల ఆలనాపాలనతో పాటు వాళ్లలో జీవన నైపుణ్యాలు పెంచే బాధ్యతనూ వాళ్లే తీసుకుంటారు. దాదాపు ఐదేళ్ళపాటు ఒకే ఉపాధ్యాయుడి దగ్గర పన్నెండుమంది పిల్లలు పెరుగుతారు. తల్లిదండ్రుల తరవాత పిల్లలకు అంతటి అనుబంధం టీచర్లతోనే అల్లుకుంటుంది. దాంతో వాళ్ల స్వభావాన్నీ, సామర్థ్యాన్నీ అర్థం చేసుకుని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు దొరుకుతుంది. ఆ ఐదేళ్లూ తరగతి గది పాఠాలు పిల్లల దగ్గరికి రావు. పక్షులూ, జంతువులూ, చెట్లూ, మనుషులూ, ఆహారం...ఇలా చుట్టూ కనిపించే అంశాల గురించే పిల్లలకు నేర్పిస్తారు. సంరక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తయ్యాక కూడా ఏ స్కూల్లో చేర్పించాలా అని తల్లులు తలలు పట్టుకోవాల్సిన పనిలేదు. పల్లె నుంచి పట్నందాకా ప్రతి స్కూలుకీ, ప్రభుత్వం నుంచి ఒకే స్థాయిలో నిధులు అందుతాయి. ఒకే తరహా విద్యార్హతలూ, సామర్థ్యమున్న ఉపాధ్యాయులుంటారు. అన్ని పాఠశాలల్లో ఒకేలాంటి సౌకర్యాలూ అందుబాటులో ఉంటాయి. అంటే... అక్కడన్నీ మంచి స్కూళ్లే!

**రోజూ ఒంటిపూట బడులే...**

ఏడేళ్ళ వయసు నుంచీ పదహారేళ్ల వరకూ, అంటే ఒకటి నుంచి తొమ్మిదో గ్రేడ్ దాకా ప్రతి ఒక్కరూ కచ్చితంగా చదువుకొని తీరాలన్నది ఫిన్లాండ్‌లో తూచా తప్పకుండా అమలయ్యే నిబంధన. అందుకే ప్రస్తుత తరంలో అక్కడ నిరక్షరాస్యులు ఒక్కరంటే ఒక్కరూ కనిపించరు. పేరుకే అది నిర్బంధ విద్య. ఆచరణలో మాత్రం అక్కడి తరగతి గదులు పిల్లల పాలిట స్వర్గధామాలే. ఒంటిమీద రంగురంగుల దుస్తులుంటేనే పిల్లలకు ఉత్సాహం. అందుకే అక్కడ స్కూళ్లలో ఏకరూప దుస్తుల (యూనిఫాం) విధానాన్ని ఎప్పుడో పక్కన పెట్టారు. చదువూ, పుస్తకాలూ పిల్లలకెప్పుడూ భారం కాకూడదని 'హోం వర్క్' సంస్కృతిని దూరం చేశారు. ఆరో తరగతి దాకా పిల్లలు ఇంటి దగ్గర పుస్తకం తెరవాల్సిన పనిలేదు. ఆ పై తరగతుల వాళ్లకు ఇచ్చే హోంవర్క్‌ని పూర్తిచేయడానికి అరగంటకు మించి సమయం పట్టకూడదన్నది మరో నిబంధన. పిల్లల నిద్రకు ఫిన్లాండ్ చాలా ప్రాధాన్యమిస్తుంది. అందుకే పాఠశాలల గేట్లు తొమ్మిది తరువాతే తెరుచుకుని, మధ్యాహ్నం రెండున్నరకల్లా మూతబడతాయి. అంటే హైస్కూల్ పూర్తయ్యేదాకా అక్కడ పిల్లలకు నిత్యం ఒంటిపూట బడులే. రోజుకి ఎట్టి పరిస్థితులల్లోనూ నాలుగు పీరియడ్లకు మించి జరగవు. ప్రతి పీరియడ్‌కీ మధ్యలో కనీసం పదిహేను నిమిషాల విరామం ఉంటుంది. ఆ సమయంలో ఠంచనుగా పిల్లలకు చిరుతిళ్లు అందుతాయి. రోజుకో గంట ఆటల విరామమూ తప్పనిసరి. పిల్లల భోజనం గురించీ తల్లిదండ్రులు బెంగపడాల్సిన పనిలేదు. చదువు పూర్తయ్యేదాకా చక్కని పోషకాహారాన్ని – పిల్లలకు ఇష్టమైన రుచుల్లో ప్రతిరోజూ ప్రభుత్వమే పూర్తి ఉచితంగా అందిస్తుంది.

**ర్యాంకులకు చెల్లు!**

'అందరూ సమానంగా చదవాలీ, అందరూ టాపర్లు కావాలీ' అన్నది ఫిన్లాండ్ విద్యాశాఖ లక్ష్యం. అందుకే విద్యార్థుల మధ్య హెచ్చు తగ్గులను ఎత్తిచూపే పరీక్షలూ, మార్కుల సంస్కృతికి ఆ దేశం పూర్తిగా దూరమైంది. అన్ని దేశాల్లోలా త్రైమాసిక వార్షిక పరీక్షలంటూ పిల్లలకు వేధింపులుండవు. ఒక్కో తరగతిలో 15–20కి మించి విద్యార్థులు ఉండటానికి వీల్లేదు. కనీసం నాలుగు తరగతుల వరకూ ఒకే ఉపాధ్యాయుల బృందం పిల్లలకు పాఠాలు చెబుతుంది. అంటే వరసగా నాలుగేళ్లపాటు పిల్లల సామర్థ్యం, తెలివితేటలూ, సబ్జెక్టులపైన పట్టూ లాంటి అన్ని అంశాల గురించీ టీచర్లకు అవగాహన కలుగుతుంది. దాంతో పిల్లల్లోని లోపాలను సరిచేస్తూ, ఏటికేడూ వాళ్లని మెరుగుపరచడానికి కావల్సినంత సమయమూ టీచర్లకు దొరుకుతుంది. ఒకట్రెండు పరీక్షలతో కాకుండా ఎప్పటికప్పుడు రకరకాల అంశాల్లో విద్యార్థులు చూపే ప్రతిభ ఆధారంగా వాళ్ల సామర్థ్యాన్ని టీచర్లు అంచనా వేస్తారు. ఏడాది చివర్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు పెట్టినా, వాటిలో మార్కుల్ని మాత్రం బయట పెట్టరు. అంటే... పరీక్షలు రాసేది విద్యార్థులైనా, వాటి ద్వారా తామెంత బాగా చెబుతున్నదీ, తాము చెబుతున్న విషయాల్ని పిల్లలు ఏ మేరకు అర్థం చేసుకుంటున్నారన్నదీ టీచర్లు అంచనా వేసుకుంటారు. ఆ జవాబు పత్రాల ఆధారంగా మరుసటి ఏడాది తమ శిక్షణ తీరులో మార్పులు చేసుకుంటారు. మొత్తంగా ఒక్కో తరగతి మారే కొద్దీ విద్యార్థుల విజ్ఞానంతోపాటు వ్యక్తిత్వాన్నీ పెంపొందించడమే లక్ష్యంగా ఫిన్లాండ్ విద్యావిధానం సాగుతుంది.

**ఒకే ఒక్క పరీక్ష!**

పదహారేళ్లు వచ్చే వరకూ పరీక్షలే తెలీకుండా పెరిగిన విద్యార్థులు, తొమ్మిదో గ్రేడ్ చివర్లో తమ జీవితంలో తొలి పెద్ద పరీక్ష రాస్తారు. పై చదువులకు వెళ్లాలంటే అది పాసై

తీరాల్సిందే. అపరిమితమైన పాఠాలూ, పిల్లలకు భవిష్యత్తులో ఏమాత్రం ఉపయోగపడని అంశాలూ ఫిన్లాండ్ విద్యావ్యవస్థలో కనిపించవు. పై తరగతుల్లో రోజువారీ వృత్తుల్లో ఉపయోగపడే లెక్కలూ, సైన్స్‌కీ సంబంధించిన అంశాలను పరిమితంగానే వారికి నేర్పిస్తారు. పరీక్షలు కూడా విద్యార్థులు బుర్రలు బద్దలు కొట్టుకునేంత కఠినంగా కాకుండా, ఆయా అంశాల్లో వారి ప్రాథమిక జ్ఞానాన్ని పరీక్షించేవిగానే ఉంటాయి. అందుకే పరీక్షల్లో తప్పే విద్యార్థులు దాదాపుగా ఉండరు. తొమ్మిదో గ్రేడ్ తరువాత చదువు కొనసాగించాలా వద్దా అన్నది పిల్లల ఇష్టం. ఉన్నత డిగ్రీలు చదవాలనుకునేవాళ్లు 'అప్పర్ సెకండరీ ఎడ్యుకేషన్' కాలేజీల బాట పడతారు. చదువుపైన ఆసక్తి లేనివాళ్లు వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ తీసుకొని జీవితాల్లో స్థిరపడతారు. రెండిట్లో ఏ దారి ఎంచుకున్నా, ఆ ఫీజుల భారమంతా ప్రభుత్వానిదే. మొత్తంగా చదువు పూర్తయ్యేవరకూ పిల్లల ఖర్చులూ, పాఠశాలలో విద్యా ప్రమాణాల గురించి ఆలోచించాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉండదు. పోటీ, ఒత్తిడిలో పడిపోయి బాల్యాన్ని కోల్పోవాల్సిన ఆగత్యం పిల్లలకూ ఉండదు.

### టీచరే సూపర్‌స్టార్!

'బతకలేక బడిపంతులు' అన్న నానుడిని ఫిన్లాండులో 'బతకాలంటే బడిపంతులే' అని మార్చుకోవాల్సిందే! ఆ దేశంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తుల్లో వైద్యుల తరువాతి స్థానం ఉపాధ్యాయుడిదే. జీతాల విషయంలోనూ అదే వరస. టాలెంట్ ఉన్న టీచర్లను ఆ దేశం నెత్తిన పెట్టుకుంటుంది. తమ ఎదుగుదలకు ముఖ్య కారణం మంచి ఉపాధ్యాయులే అని బల్లగుద్ది మరీ చెబుతుంది. అందుకే ఫిన్లాండ్‌లో బోధన ఓ 'స్టార్ ఉద్యోగం'. కుర్రాళ్లంతా టీచర్‌గా మారడానికి ఉవ్విళ్లూరతారు. యూనివర్శిటీలో చదువుకొనే రోజుల్నుంచే దానికోసం కసరత్తు మొదలుపెడతారు. కానీ ఆ ఉద్యోగం పొందడం అంత సులువైన పనికాదు. ఓ ఆర్నెల్లు పుస్తకాలు తిరగేసి, పరీక్ష రాసి టీచర్‌గా మారిపోదాం అంటే కుదరదు. ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా చేరాలంటే కనీసం మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. సెకండరీ స్కూల్ టీచర్లకైతే పీహెచ్‌డీ తప్పనిసరి. ఏటా టీచర్ పోస్టులకు వచ్చే దరఖాస్తుల్లో కేవలం పదిశాతమే తుది పరిశీలనకు ఎంపికవుతాయి. వాటిని జల్లెడపడితే ఎక్కువశాతం మంది వివిధ యూనివర్శిటీల టాపర్లే కనిపిస్తారు. ఉద్యోగ ప్రవేశ పరీక్ష ద్వారా వాళ్లలోంచి ఇంకొందర్ని ఎంపిక చేస్తారు. ఆ తరువాతి దశ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిత్వం, విజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అంచనా వేస్తారు. కేవలం జీతం కోసం కాకుండా బోధనపైన ప్రేమతో ఆ వృత్తిలో అడుగుపెట్టేవాళ్లనే చివరికి ఎంపికచేస్తారు. రెండు మూడు నెలలపాటు సాగే ఆ ప్రక్రియ మన సివిల్ సర్వీసు అభ్యర్థుల ఎంపికకు ఏ మాత్రం తీసిపోదు. ఎంపికైనా టీచర్లకు ఏడాదిపాటు పిల్లలకు బోధించే విధానాలపైన శిక్షణ ఉంటుంది. అన్ని కఠినమైన దశల్ని దాటొస్తారు కాబట్టే టీచర్లంటే అక్కడివాళ్లకి అంత గౌరవం. పిల్లలకు శిక్షణ ఇవ్వడం తప్ప శిక్షించే సంస్కృతి స్కూళ్ళలో కనిపించదు. ఆ గురువులపైన అంత నమ్మకం ఉండబట్టే అక్కడ 'పేరెంట్ – టీచర్' సమావేశాలకూ చోటు లేదు. 'లెస్ ఈజ్ మోర్' అన్నది ఫినాండ్ ప్రజల జీవన సూత్రం. అందుకే పసిమెదళ్లపైన గుదిబండలా మారే మార్కులూ, ర్యాంకులూ, గ్రేడ్ల విధానాలూ, టాపర్లూ – మొద్దులూ అన్న తారతమ్యాలూ, పేదా – గొప్పా తేడాలూ, మంచి స్కూళ్లూ – చెడ్డ స్కూళ్లూ అన్న బేధాలూ, పల్లెలూ – పట్టణాలూ అన్న వ్యత్యాసాలూ అక్కడి వ్యవస్థలో లేవు. పిల్లలంతా ఒక్కటే, వాళ్లకు అందాల్సిన విద్యా ఒక్కటే అన్న సిద్ధాంతాన్ని మనసా వాచా కర్మణా అనుసరిస్తున్నారు. పాఠ్య పుస్తకాన్ని చేతిలో పెట్టడానికి ముందే పిల్లల వ్యక్తిత్వాన్ని నిర్మించే పాఠాలకు పునాది వేస్తున్నారు. మంచి విద్యార్థులనూ, పౌరులనూ దేశానికి అందించడానికి పిల్లల దృష్టిలో చెడ్డ తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా మిగలాల్సిన అవసరం లేదని నిరూపిస్తున్నారు.

మనకీ కొత్త విద్యా సంవత్సరం మొదలైంది. కోటి ఆశలతో లక్షలాది పిల్లలు బడిబాట పడుతున్నారు. వాళ్ల చదువులు కూడా ఫిన్లాండ్ విద్యార్థుల చదువులంత హాయిగా సాగాలంటే, మన ఆలోచనలూ అక్కడి తల్లిదండ్రులూ, ఉపాధ్యాయుల ఆలోచనలంత ఉన్నతంగా మారాలి. మన ప్రభుత్వాలూ అక్కడి విధానాల్లో కొన్నింటినైనా ఆచరణలోకి తేవాలి. పిల్లల నుంచి ఆశించడం మానేసి, వాళ్లని అర్థం చేసుకోవడం మొదలుపెడితే చాలు. ఉత్తమ ఫలితాలు వాటంతట అవే వస్తాయనడానికి ఫిన్లాండ్ విజయాలే సాక్ష్యం. ఆ దేశంలో పరీక్షల విధానం లేకపోవచ్చు. కానీ విద్యార్థుల భవిష్యత్తుని తీర్చిదిద్దడమన్నది ఏ దేశానికైనా పెద్ద పరీక్షే. అందులో ఫిన్లాండ్‌కి మరో ఆలోచన లేకుండా వందకి వంద మార్కులూ వేయాల్సిందే!

***(ఈనాడు : 4-6-2017 ఆదివారం అనుబంధం)***

♦

# మాతృభాష ఆర్థిక ప్రగతికి మాతృక

- చుక్కా రామయ్య

*మాతృభాషను - ఆంగ్లభాషను ఒకదానికి ఒకటి ప్రత్యామ్నాయాలుగా చూపరాదు. మాతృభాష జీవం (లైఫ్) అయితే ఆంగ్లం దేహం (బాడి) ప్రాణం లేని శరీరం ఉపయోగం ఏమిటి? మాతృభాష జీవనది అయితే ఆంగ్లం ఉపనదిలాంటిది. జీవనది లేని ఉపనదిని ఊహించగలమా? మాతృభాష హిమాలయ సమానమైతే ఆంగ్లభాష పరవళ్ళు తొక్కే హిమనదీ సమానం. స్థూలంగా చెప్పాలంటే మాతృభాష మనిషి మేధోభివృద్ధికి అనివార్యం. ఆ మేధోసంపత్తి రాణింపునకు ఆంగ్లభాష సోపానం. అంటే మొదటిది ప్రాథమికావసరం. రెండోది విజయసాధనం.*

నేడు మాతృభాషపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. మాతృభాషలో విద్యాబోధన ఈ చర్చలో ప్రధానాంశం. ప్రపంచీకరణ శరవేగంతో అన్ని రంగాలలోనూ వ్యాప్తి చెందుతున్నందున ఆంగ్లంపై ఆత్రుత పెరుగుతున్న నేపథ్యంలో మాతృభాషపై చర్చ మరింత రసవత్తర ఘట్టానికి చేరుకున్నది. ప్రపంచీకరణ అందిస్తున్న అపార అవకాశాలను అందుకునేందుకు ఆంగ్లమే తగిన వారధి అని పొరుగున ఉన్న చైనా దీనిపై దృష్టి ఉంచి మనల్ని దాటి పోవాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మనం మాతృభాషపై ఎందుకింత మమకారం చూపాలని చాలా మందిలో సందేహం కలుగవచ్చు. విద్యా బోధనలో మాతృభాషనే సర్వస్వంగా చేసుకోవడం వల్ల మనం ఐదారు దశాబ్దాలు వెనక్కి వెళ్ళడం కాదా అన్న అనుమానం ఉత్పన్నమవుతోంది.

మాతృభాషను - ఆంగ్లభాషను ఒకదానికి ఒకటి ప్రత్యామ్నాయాలుగా చూపరాదు. మాతృభాష జీవం (లైఫ్) అయితే ఆంగ్లం దేహం (బాడి) ప్రాణం లేని శరీరం ఉపయోగం ఏమిటి? మాతృభాష జీవనది అయితే ఆంగ్లం ఉపనదిలాంటిది. జీవనది లేని ఉపనదిని ఊహించగలమా? మాతృభాష హిమాలయ సమానమైతే ఆంగ్లభాష పరవళ్ళు తొక్కే హిమనదీ సమానం. స్థూలంగా చెప్పాలంటే మాతృభాష మనిషి మేధోభివృద్ధికి అనివార్యం. ఆ మేధోసంపత్తి రాణింపునకు ఆంగ్లభాష సోపానం. అంటే మొదటిది ప్రాథమికావసరం. రెండోది విజయసాధనం. అయితే నేడు ఈ ప్రాథమ్యాల విషయంలో అస్పష్టత ఏర్పడింది. ఏది అవసరమో? ఏది ఆసరానో తెలుసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు. ఈ గందరగోళంలో ప్రాథమికావసరానికి సమాధి కట్టాలని చూస్తున్నారు. ఆంగ్లం ముందు మాతృభాష దిగదుడుపు అంటున్నారు. మాతృభాషను ఆశ్రయించడమంటే ప్రపంచ పోటీ నుంచి తప్పుకోవడమేనని తీర్మానిస్తున్నారు. ఇది వాస్తవమా? లేక మరేది వాస్తవమో తెలుసుకునేందుకు మానవాళి అభ్యుదయాన్ని, శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధి బీజాలను పరిశీలిద్దాం.

జిజ్ఞాస మనిషి సహజ లక్షణం. తెలుసుకోవాలన్న కుతూహలం మనిషిని సాగర గర్భాన్వేషణ చేయించింది. అంతరిక్ష శోధనకు పురిగొల్పింది. సర్ ఐజాక్ న్యూటన్, థామస్ ఆల్వా ఎడిషన్ నుంచి ఐన్‌స్టీన్ వరకు అందరినీ ఈ జిజ్ఞాసే నడిపించింది. చెట్టుకింద కూర్చున్న న్యూటన్ తలపై యాపిల్ పండు పడితే అది పైకి వెళ్ళకుండా కిందకే ఎందుకు పడిందన్న జిజ్ఞాస, ఆపై అన్వేషణా ప్రవృత్తే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ఆవిష్కరింపజేసింది. అదే అన్వేషణా దృక్పథమే ఐన్‌స్టీన్ చేత సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రపంచానికి వెల్లడింపజేసింది. అలాగే నాటి వాస్కోడిగామా, కొలంబస్‌లలో ఉన్న అన్వేషణా ప్రవృత్తే సముద్ర యానం ద్వారా నూతన భూతలాలను ప్రపంచానికి పరిచయం చేసింది. ఇక గత రెండు శతాబ్దాల కాలంలో వందలాది ఆవిష్కరణలు ఆధునిక జీవనాన్ని సుసంపన్నం చేశాయి. అయితే ప్రాచీన, మధ్య యుగాలలో జరిగిన ఆవిష్కరణలన్నీ వ్యక్తిగత అభిరుచి అన్వేషణల కారణంగా రూపం దాల్చాయి. శాస్త్రవేత్తల అభిరుచి, చక్రవర్తుల లేదా రాజుల ప్రోత్సాహం ఫలితంగా నూతన విషయాలు వెలుగు చూశాయి. ఈ ఆవిష్కరణల మరో లక్షణమేమిటంటే

మౌలిక అంశాలపైనే వాటి గమనం సాగేది. గురుత్వాకర్షణ శక్తి, ఉష్ణశక్తిని యాంత్రికంగా మార్చడం, ఆయస్కాంత శక్తి బదలాయింపు, కృత్రిమ కాంతి తదితర విషయాలలో ప్రాథమిక అంశాలను కనుగొనడం వరకే శాస్త్రవేత్తలు చేసేవారు. వాటిని ప్రజోపయోగానికి మార్చడం తదనంతర కాలంలో జరిగేది. ఆవిష్కరణలు వ్యక్తిగత మేధస్సు వల్ల జనించినా సామాన్య ప్రజల జీవనాన్ని మెరుగుపర్చడమే ప్రధాన ఉద్దేశ్యంగా దాని విస్తృత ప్రయోజనం నిర్ధారణ అయ్యేది. మొత్తం మీద మధ్య యుగాల వరకూ ఆయా కాలాల్లో విలసిల్లిన విద్యావిధానాల ఫలితం కంటే దానిని అభ్యసించిన మేధావుల ఆలోచనల ఫలితంగా శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు జరిగాయి. అయితే మనదేశం వరకు చూస్తే ఆధునిక యుగప్రారంభకాలంలో మొగలాయి పాలకులు, ముస్లిం పాలకులు ప్రజాహితం కోసం పరిశోధనలను ప్రోత్సహించిన దాఖలాలు ఉన్నాయి. గ్రహాల గమనం, జోతిష్య శాస్త్రాలపై ఈ శోధనలు సాగాయి. ఆ తరువాత బ్రిటీష్ పాలకులు మనదేశంలో అడుగుపెట్టాక విద్యావిధానం, మేధో ఆధిపత్యం, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించి ఒక నూతన శకానికి తెర లేచింది.

అప్పటివరకు అంతర్ యుద్ధాలతో అతలాకుతలం అయిన భారతదేశంలోకి ఆంగ్లేయులు, బలప్రయోగంతోనే ప్రవేశించారు. అయితే భారత రాజులనైతే బల ప్రయోగంతో అణచగలిగారు కానీ భారతీయ ప్రజలను శాశ్వతంగా పాలించాలంటే వారి మేధస్సుపై ఆధిపత్యం సాధించాలని గుర్తించారు. దండ ప్రయోగాలు అవసరమైనప్పుడు జరిగినా కోట్లాది సామాన్య ప్రజల సహకారం ఉండాలంటే వారి కంటే తాము తెలివితేటలు గలవారమన్న అభిప్రాయం కలిగించాలని గ్రహించారు. ఈ దిశగా పనిచేయడం ప్రారంభించారు. ముఖ్యంగా హిందువులకు పూజ్యనీయమైన పంచభూతాలపై ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కొన్ని మార్గాలను ఎంచుకున్నారు. గంగానదిపై వంతెనలు వేయడం ద్వారా పంచభూతాలలో నీటిపై తమకు గల ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. విమానయానాన్ని పరిచయం చేయడం ద్వారా గాలిపై గల ఆధిపత్యాన్ని, బృహత్ నిర్మాణాల ద్వారా భూమిపై గల ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. అయితే శాస్త్రసాంకేతిక విజ్ఞాన రంగాలలో భారతీయుల్ని ప్రవీణులు కాకుండా చూడాలన్న దుర్బుద్ధితో బ్రిటీష్ పాలకులు విద్యావిధానం ద్వారా ఎత్తుగడ వేశారు. భారతీయుల కోసం భారతదేశంలో ప్రవేశపెట్టే విద్యావిధానంలో భారతీయుల మాతృభాషలో ఉండాలా? లేక ఇంగ్లీష్‌లో ఉండాలా అన్న చర్చ జరిగినప్పుడు బ్రిటీష్ పాలకులు ఆంగ్లాన్నే సమర్ధించారు. మాతృభాషలో గాని విద్యాబోధన జరిగితే అసలే తెలివిగల భారతీయులు మేధావులుగా రూపొందుతారని, వారి మేధో సంపత్తి ముందు తాము నిలబడలేమని ముందే గుర్తించారు. అందుకే లార్డ్ కర్జన్ వంటి గవర్నర్ జనరల్స్ భారతీయుల మాతృభాషలోనే వారి విద్యాబోధన జరగాలని నిజాయితీగా చేసిన వాదనను ఇతర ఆంగ్లేయ పాలకులు నిలువనీయలేదు. ఆంగ్లాన్ని బలవంతాన భారతీయుల నెత్తిన రుద్దడం వెనుక పెద్దకుట్రే జరిగింది. భారతీయులు ఇష్టంలేక పోయినా ఇంగ్లీష్‌ను నెత్తిన ఎత్తుకుంటే సోవియట్ యూనియన్, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లో మాతృభాషలోనే విద్యాబోధన ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందంజ వేశారు. మాతృభాషలోనే సబ్జెక్టును బోధించడం వల్ల విద్యార్ధికి తేలికగా అర్ధమై ప్రయోజనం సిద్ధిస్తుంది. అదే పరాయిభాషలో అయితే ఇటు సబ్జెక్టును అర్ధం చేసుకోవాలి అటు పరాయిభాషను జీర్ణం చేసుకోవాలి. అంటే రెండు రకాల భారాలను మోయాల్సి ఉంటుంది. బ్రిటీష్ పాలన పుణ్యమా అని భారతీయులు ఈ బరువు మోస్తుంటే ఇతర దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన ద్వారా ముందుకు దూసుకువెళ్లాయి.

మాతృభాషలో విద్యాబోధనకు మేధాసంపత్తికి సంబంధం ఉందని గుర్తించిన మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ భాషా ప్రయుక్త రాష్ట్రాలకు మార్గం సుగమం చేశారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో మాతృభాషకు పెద్దపీట వేయడమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆంతర్యం. దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యానంతరం మన నేతలు భాషా ప్రయుక్త రాష్ట్రాలలో ఈ స్ఫూర్తికి తర్పణాలు వదిలేశారు. స్వాతంత్ర్యానంతరం బ్రిటీష్ పాలనలో కంటే ఘోరంగా ఇంగ్లీష్ వెంటపడటం ప్రారంభించాం. ఆలోచించేవారుగా కాక ఆచరణపరులుగా మాత్రం తయారవ్వాలన్న సంకుచిత దృష్టిలో ఆంగ్లేయుల పాలనతో మొదలయిన మెకాలే విద్యావిధానాన్నే తు.చ. తప్పకుండా పాటించటం మొదలు పెట్టాం. ఇంగ్లీష్ అంటే మోజు మరింతగా పెరిగింది.

మూడు దశాబ్దాలు కడచిన తరవాత 1980 దశకం ప్రారంభంలో దేశంలో విద్యావిధానంలో సంస్కరణల విషయంలో ఆశాకిరణం తళుక్కుమన్నది. దేశరాజకీయ యవనికపై యువనాయకుడు రాజీవ్‌గాంధీ సాక్షాత్కరించారు. దేశం సాంకేతికంగా ముందంజలో ఉండాలంటే సాంకేతిక

పిల్లలకు మంచి చదువులు అబ్బాలనే మా ఘోష. అలానే ఇంగ్లీషులో ప్రావీణ్యత సంపాదించాలని కూడా మా అభిలాష. బొత్తిగా తెలియని ఇంగ్లీషుని ప్రాథమిక స్థాయినుండి మీడియంగా చేయడంవల్ల ఇంగ్లీషు మాట అటుంచి వాళ్ళ చదువులు మట్టిగొట్టుకు పోతాయి. ప్రపంచ వ్యాప్తంగా పౌరులందరికీ అందవలిసిన స్కూలు విద్యను మాతృభాషా మాధ్యమంలోనే అందిస్తున్నారు. అది శాస్త్రీయం. మాధ్యమం గురించి జరిపిన అన్ని అధ్యయనాలలో తేలిన విషయం కూడా ఇదే. కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా మాతృభాషా మాధ్యమంలోనే విద్యాబోధన జరగాలని. ప్రైవేటు స్కూళ్లలో %ాఖ+% నుండి ఆంగ్ల మాధ్యమంలో బోధనా చేయడం వల్ల ఆ విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారు. అర్థం కాని ఇంగ్లీషు మాధ్యమంతో వల్లెవేసే చదువులతో వట్టి పోతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమంలో చదువుతున్న పిల్లలను ఆ ఊబినుండి రక్షించాల్సింది పోయి, తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని ఈ పేదపిల్లల్ని ఆ ఊబిలోకి దించడం అమానుషం. జాతి మొత్తాన్ని నిర్వీర్యం చేసే తిరోగమన చర్య.

**- డా॥ ఎస్.ఆర్. పరిమి, వికాస విద్యావనం**

**జాన్ కవన్, (ఐక్యరాజ్య సమితి)** : "మానవ సంబంధాలూ, సమాచార మార్పిడి లాంటి విషయాలలో మాతృభాష అత్యంత శక్తివంతమైన ఆయుధం. జాతి స్వప్రయోజనాలు, కళలు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో స్వంత భాష పాత్ర అంతా ఇంతా కాదు. సమాచార మార్పిడిలో ఇప్పుడు తనదైన పాత్ర పోషిస్తున్న ఇంటర్‌నెట్ ఇప్పటి వరకు ఆంగ్లంలోనే అందుబాటులో వుంది. సభ్యదేశాలు వారివారి మాతృభాషలలో ఈ సమాచారనిధిని తర్జుమా చేయించి ప్రజలకు అందించే విధానాలను రూపొందించుకోవాలని నా విజ్ఞప్తి".

విద్య అవసరమని గుర్తించారు. విస్తృతంగా దేశంలో ఐ.ఐ.టి.లను స్థాపించాలని సెకండరీ విద్య పటిష్టంగా ఉండాలని రాజీవ్‌గాంధి గ్రహించారు. సెకండరీ ఎడ్యుకేషన్ పునాదులు బలంగా ఉండాలంటే హైస్కూల్ స్థాయిలో బోధన మాతృభాషలో జరగాలని దృఢంగా విశ్వసించారు. అయితే రాజీవ్ నిష్క్రమించడంతో ఇవన్నీ పట్టాలు ఎక్కకముందే లూప్ లైన్‌లోకి వెళ్ళిపోయాయి.

ప్రపంచీకరణలో సేవారంగం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. ఇప్పుడు జాతీయ స్థూల ఉత్పత్తిలో సింహభాగం సేవారంగానిదే. ఒకప్పుడు వ్యవసాయ రంగం. ఆ పై పారిశ్రామిక రంగాల స్థానాన్ని నేడు సేవారంగం ఆక్రమించింది. సేవారంగంలో ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయమే మన సేవారంగంలో అధికభాగం ఆక్రమిస్తోంది. సేవారంగంలో ఎప్పుడూ యజమానిదే పైచేయి అవుతుంది. అదే ఉత్పత్తి రంగంలో అయితే కార్మికుడిదే పైచేయి. ప్రస్తుతం మన ఐటి రంగం విదేశీ సంస్థలపై ఎక్కువ ఆధారపడుతున్నందున వారికి అవసరమైన భాషలో ప్రావీణ్యం గల వారికే మన కంపెనీలు ప్రాధాన్యం ఇస్తాయి. అందుకే మళ్ళీ ఇప్పుడు ఇంగ్లీష్‌కి ఇంతగా ప్రాధాన్యం పెరిగిపోయింది. ఇంగ్లీష్‌కే కాదు పని ఇచ్చే యజమాని మారిన కొద్దీ ఫ్రెంచ్, జర్మనీ వంటి భాషల అవసరాన్ని చెబుతూ కంపెనీలు వత్తిడి చేసే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. దీనితో తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలోనే చదవాలని భావిస్తున్నారు. ఇంగ్లీష్ అంతర్జాతీయ విపణిలో మన నైపుణ్యాల ప్రదర్శనకు అక్కరకు రావచ్చునేమో గాని నైపుణ్యాలు నేర్చుకునే హైస్కూల్ విద్యార్థి దశలో మాతృభాషే తగినది. అందుకే చైనా తెలివిగా ఇప్పటికే సేవారంగం కంటే ఎక్కువగా ఉత్పత్తి రంగానికే అగ్రస్థానం ఇస్తోంది. పాఠశాల స్థాయిలో మాతృభాషకే పెద్దపీట వేస్తోంది.

నాడు, నేడు కూడా జ్ఞానమే సంపదకు మూలం. జ్ఞానమే ఆధిపత్యానికి ఆలవాలం. కండబలంతో దండప్రయోగమే నెగ్గిన అంధయుగాలు దాటినప్పటి నుంచి జ్ఞానమే సమాజాలకు దారి చూపుతోంది. జ్ఞానంపై ఆధిపత్యం గల వారికి సంపద దాసోహం అవుతోంది. సంపదపై ఆధిపత్యం గలవారికి రాజ్యాధిపత్యం సాధ్యమవుతోంది. ఆధునిక సమాజంలో సంపదకు విద్యే పునాది. విద్య ద్వారా శాస్త్ర సాంకేతికాభివృద్ధి జరిగి సంపద సృష్టింపబడుతోంది. అయితే నాణ్యమైన విద్య ద్వారానే ఇది సుసాధ్యం. మాతృభాషలో విద్యాబోధన ద్వారా నాణ్యమైన విద్యను అనేక దేశాలు అందించి ఘనవిజయాలు సాధిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్థిక రంగం అగ్రభాగాన నిలుస్తున్నాయి. అంటే మాతృభాషలో విద్యాబోధనకు, ఆర్థిక పురోగతికి సంబంధం ఉందని విశదమవుతోంది. మాతృభాషలో విద్యాబోధనకు, శాస్త్ర, సాంకేతిక రంగానికి సంబంధం ఉందని స్పషం అవుతోంది. అందుకే మాతృభాషను ఒక మాధ్యమంగా మాత్రమే చూడరాదు. మాతృభాష అంటే ప్రజలకి మాతృక. ప్రజావళికి సుఖశాంతుల సూచిక. ♦

# మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి

- విరపు బాలసుబ్రహ్మణ్యం

*వాస్తవానికి, ఆంగ్లమాధ్యమాన్ని మొత్తంగా వ్యతిరేకించడం లేదు. సమస్యంతా దీన్ని ఏ స్థాయిలో, ఏ మెలకువలతో ప్రవేశపెట్టాలన్నదే. ప్రాథమిక విద్యలో వీలుంటే శిశువిద్యలోనే ఆంగ్లాన్ని భాషగానే గాక మీడియంగా కూడా పెడితే తప్ప ఆంగ్లం ఒంటపట్టదని ప్రభుత్వ వాదన. అలాగే తెలుగు నీడ పడితే ఆంగ్లం పట్టుబడదనే వాదన కూడా ఇందులో అంతర్భాగం. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంతకాలం ప్రజల్ని నమ్మించింది ఈ వాదనలతోనే.*

రాష్ట్రప్రభుత్వం ఉన్నట్టుండి మొదట 1-6 తరగతుల్లో, ఆ తర్వాత క్రమంగా అన్ని తరగతుల్లో మాతృభాషా మాధ్యమాలకు చెల్లుచీటీ ఇచ్చింది. ఇది వాస్తవానికి నిర్బంధ ఆంగ్ల మాధ్యమం. ప్రపంచంలో ఎక్కడా లేని విధానం.

ఉపాధి కోసం, వివక్ష తొలగింపు కోసం, కార్పొరేట్ల కట్టడి కోసం, బడుగుల భవిష్యత్తు కోసం ఈ ఆంగ్ల మాధ్యమాన్ని తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీని పర్యవసానాలను ప్రశ్నిస్తున్న వారిపై బలహీనవర్గాల వ్యతిరేకులుగా ముద్రవేసి దాడి చేస్తోంది.

వాస్తవానికి, ఆంగ్లమాధ్యమాన్ని మొత్తంగా వ్యతిరేకించడం లేదు. సమస్యంతా దీన్ని ఏ స్థాయిలో, ఏ మెలకువలతో ప్రవేశపెట్టాలన్నదే. ప్రాథమిక విద్యలో వీలుంటే శిశువిద్యలోనే ఆంగ్లాన్ని భాషగానే గాక మీడియంగా కూడా పెడితే తప్ప ఆంగ్లం ఒంటపట్టదని ప్రభుత్వ వాదన. అలాగే తెలుగు నీడ పడితే ఆంగ్లం పట్టుబడదనే వాదన కూడా ఇందులో అంతర్భాగం. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంతకాలం ప్రజల్ని నమ్మించింది ఈ వాదనలతోనే.

అమ్మభాషలోనే చదువులు ప్రారంభంగావాలని, అప్పుడే పిల్లలకు మనోవికాసంతో పాటు విషయ పరిజ్ఞానం సహజంగా అబ్బుతుందని విద్యాహక్కు చట్టం నుంచి జాతీయ విద్యావిధానం దాకా, గాంధీజీ నుంచి అంబేద్కర్ దాకా, మన రాజ్యాంగం నుండి యునెస్కో దాకా చెపుతున్న అభ్యసన సిద్ధాంతం. పసిపిల్లలు పరాయి భాషలో పాఠాలు ప్రారంభిస్తే పరాయీకరణ చెంది భయపడి, బడి మానెయ్యడమో, కంఠోపాఠం చదువులో చిక్కుకుని వెనకబడిపోవడమో జరుగుతుందనేది అంతా అంగీకరిస్తున్న సత్యం. పేద గ్రామీణ పిల్లల విషయంలో ఈ ప్రమాదం మరీ ఎక్కువ. విద్యారంగంలో ముందున్న దేశాలన్నీ, మన రాష్ట్రాలన్నీ మాతృభాషలోనే బోధిస్తున్నాయి. ఆంగ్లాన్ని ఒక భాషగా నేర్పి అది పట్టుబడ్డాక సెకండరీ స్థాయిలో మాధ్యమాన్ని మార్చడం శాస్త్రీయమని చెప్పడానికి పెద్ద పాండిత్యమేమీ అక్కర్లేదు. అలాగే ఒక భాషగా శక్తివంతంగా ఆంగ్లాన్ని నేర్పడం దీనికి సరైన పరిష్కారం.

ఈ అకడమిక్ అంశాన్ని అభ్యసన సూత్రాన్ని వదిలేసి చర్చను పక్కదారి పట్టించడం, దీనికి మతం రంగూ, రాజకీయ రంగూ పులమడం అన్యాయం. విద్యారంగంలో వివక్షను తెచ్చింది, అసమానతల్ని పెంచిందీ ప్రైవేటు కార్పొరేట్ విద్యారంగం. అందరికీ సమానమైన విద్యావకాశాలను అందించే కామన్ స్కూల్ విధానం లేకపోవడం, అత్యంత బలహీనమైన ప్రభుత్వ పాఠశాలల్లో మన బడుగుల పిల్లలు చదువుకోవాల్సి రావడం దీనికి మూలకారణం. పాతికవేలకు పై ప్రాథమిక పాఠశాలలు ఒకరిద్దరు టీచర్లతో, ఒకటి రెండు గదులతో కునారిల్లుతుంటే పేదలకు గొప్ప విద్య ఎలా వస్తుంది? కేవలం మాధ్యమం మార్చినంత మాత్రాన ఏం ఒరుగుతుంది? ఎందుకు మనం అందరు పిల్లలు ఒకేచోట చదువుకొనే కామన్‌స్కూలును నిర్మించుకోలేకపొయ్యాం? ఇదే అసలు సమస్య.

తెలుగుతోపాటు ఉర్దూ, తమిళం, ఒరియా, కన్నడ మాధ్యమాలు కూడా కనుమరుగవుతున్నాయి. ఈ చర్య ప్రభావం పొరుగు రాష్ట్రాలలోని తెలుగు మాధ్యమం స్కూళ్ళపైబడి వాటిని ఆ రాష్ట్రాలు రద్దుచేసే ప్రమాదం ఉంది. ఇందువల్ల మైనారిటీ భాషలకున్న రాజ్యాంగ రక్షణ కూడా చెల్లనికాసుగా మారుతుంది.

ఇకపై మాతృభాషా మాధ్యమంలో చదవాలంటే వెతుక్కోవాల్సిన దుస్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడుతుంది. ఇక ఆంగ్ల భాషా ప్రావీణ్యం వున్న వారే టీచర్లవుతారు.

## మాతృభాషలో విద్యాబోధన ప్రజల హక్కు

మాతృభాషలో విద్యాబోధన ప్రజల హక్కు అనే విషయాన్ని భారతీయ రాజ్యాంగం 350-ఎ అధికరణం విధిస్తున్నది. ఇది అల్పసంఖ్యాకుల హక్కులకు సంబంధించిందయినా బహుసంఖ్యాకులకు ఎలాగూ ఈ హక్కు ఉంటుందని ఇది సూచిస్తున్నది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్లో ఉన్న అల్పసంఖ్యాకులకు ఉండే ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, ఒడియా, మాధ్యమాలను తొలగించడానికి వీలులేదు. అలాగే ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగు మాధ్యమాన్నీ తొలగించడానికి వీలులేదు. ఇక బహుసంఖ్యాకులైన తెలుగు వారు తమ మాతృభాషలో విద్యను నేర్చుకుంటామంటే ఎలా తొలగిస్తారు? అందువల్లనే కర్నాటక రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలలో కూడా అన్ని విషయాలను కన్నడంలో రాయడాన్ని అనుమతిస్తున్నారు. ప్రాథమిక విద్యను కూడా మాతృభాషలో అనుమతించకపోవడం భాషాద్రోహమే అవుతుంది. ఇంగ్లీషు నేర్చుకోవద్దని ఎవ్వరూ చెప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలతో తెలుగునూ ఇంగ్లీషునూ నేర్పించండి. ప్రాథమిక విద్యను ఇంగ్లీషులో నేర్పించినంత మాత్రాన ఉద్యోగాలు రావు, ప్రావీణ్యం రాదు. ప్రయివేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ఉందని అదే అవివేకమైన పనిని ప్రభుత్వం కూడా చెయ్యడం సమంజసం కాదు. కేవలం మార్కులకోసం సంస్కృతాన్ని పెట్టి తెలుగును రాకుండా చేస్తున్న కళాశాలల్ని కూడా కట్టడి చెయ్యకుండా ప్రాథమికభాషను కోరుకొనే హక్కును కూడా లాక్కోవడం ప్రభుత్వానికి తగదు.

**- ఆర్వీయస్ సుందరం**

*విశ్రాంత తెలుగు ఆచార్యులు, మైసూరు విశ్వవిద్యాలయం, పూర్వ సందర్శకాచార్యులు, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, యు.ఎస్.ఎ.*

*(సోషల్ మీడియా నుండి)*

### మన బడిలో పిల్లలకు ఎలా నేర్పాలి? - గిజుభాయి

**ప్రభుత్వ పాఠశాలలు మొదటితరం అభ్యాసకులతో నిండుతున్నాయి. ఈ పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపరు. పిల్లలు ఇష్టపడితే బడికి వస్తారు లేకపోతే బడి మానివేస్తారు. చదవడం, రాయడం వచ్చిన ఏ పిల్లలూ బడి మానివేయరు. మరి చదవడం రావాలంటే అక్షరాలు గుర్తించగలగాలి కదా! ఎందువల్ల ఎక్కువమంది పిల్లలు రెండు తరగతులు పూర్తి చేసినా అక్షరాలను గుర్తించలేక పోతున్నారు? అసలు అక్షరాలను గుర్తించాలంటే పిల్లలు ఏ అంతర్గత శక్తులను ఉపయోగించాల? పరిశీలించడం, జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం కదా! మరి ఎందుకు పిల్లలు తమ అంతర్గత శక్తులు ఉపయోగించడం లేదు? పిల్లల్లో లోపమా? మన బోధనలలో లోపమా? పిల్లల్లో లోపమైతే తమ చుట్టూ వున్న అన్ని జంతువులను, మొక్కలను, వస్తువులను ఎలా గుర్తించగలుగుతున్నారు? లోపం తరగతి గదిలోనే ఉంది.**

మాతృభాషలు చదివిన లక్షలాది మంది వీధిన బడతారు. హైస్కూళ్ళలో వేలాది మంది టీచర్లు మిగులు తేలుతారు. శాస్త్రజ్ఞానానికి దూరమైన మాతృభాషలు మృతభాషలు కావడానికి ఎంతోకాలం పట్టదు. మీడియంగా నేర్పకపోతే భాషా వినియోగం దిగజారిపోతుంది.

ప్రభుత్వ నిర్ణయంపై ఎప్పుడూ లేనంత చర్చ మన చదువుల్ని గురించి, మాధ్యమాన్ని గురించి, భాషల గురించి బడుగుల పిల్లల గురించీ జరగడం అద్భుతమైన విషయం. దీన్ని ఆహ్వానిద్దాం. కొనసాగిద్దాం. దీంతోపాటు పెద్దఎత్తున తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ విద్యార్థి భాషా సాంస్కృతిక సంఘాలు, నిపుణులూ ఒక బాట మీదికి రావాలి. ఆంధ్రప్రదేశ్లో ఒక సాంస్కృతిక వెల్లువకిది దారితీయాలి. ఒకరికొకరం తోడుగా మన పిల్లల భవితవ్యాన్ని, మాతృభాషను కాపాడుకొందాం.

1. ***జి.వో. నెం. 81, 85 లను రద్దు చేయాలి. మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి.***
2. ***ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో ప్రాథమిక విద్యను మాతృభాషా మాధ్యమంలో బోధించాలి.***
3. ***ప్రాథమిక విద్యాస్థాయి నుండే ఇంగ్లీషును సమర్థవంతంగా నేర్పాలి. అందుకు తగిన నిపుణత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలి.***

***4 నాణ్యతతో కూడిన, సమానమైన విద్యనందించే కామన్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలి.*** ♦

సోషల్ మీడియా

# బోధనా మాధ్యమం - ఒక విశ్లేషణ

- రాంబాబు తోట

***తెలుగు భాషను రక్షించుకోవాలనే ఆదర్శం ఉండటం తప్పుకాదు. అలాగే ఇంగ్లీషు భాషపై ఇష్టం ఉండటమూ తప్పు కాదు. కానీ మన ఆదర్శం కోసమో, ఇష్టం కోసమో ఏం చేసినా దాని వల్ల వచ్చే కష్టనష్టాలను మనం మాత్రమే భరించాలి. అంతేగానీ, వాటిని పిల్లలపై మోపడం ఎలా కరెక్ట్? నిజానికి ఇన్నిన్ని న్యూస్ ఛానెల్స్, టీవీ ఛానెల్స్, న్యూస్ పేపర్స్, youtube ఛానెల్స్ ఉండగా, మీడియం మార్చడం వల్ల తెలుగు భాషకు వచ్చే ముప్పేమీ లేదు. "ఏ బాషా మాధ్యమం ఉంటే పిల్లల ఎడ్యుకేషన్ మెరుగ్గా ఉంటుంది?" అనే ప్రశ్న మాత్రమే ఈ విషయంలో మన ఆలోచనను నడిపించాలి.***

ఏ మీడియంలో బోధన జరగాలనేది పిల్లల ఎడ్యుకేషన్ కి సంబంధించిన విషయం. మన ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయం కాదని గుర్తుంచుకుందాం.

తెలుగు భాషను రక్షించుకోవాలనే ఆదర్శం ఉండటం తప్పుకాదు. అలాగే ఇంగ్లీషు భాషపై ఇష్టం ఉండటమూ తప్పు కాదు. కానీ మన ఆదర్శం కోసమో, ఇష్టం కోసమో ఏం చేసినా దాని వల్ల వచ్చే కష్టనష్టాలను మనం మాత్రమే భరించాలి. అంతేగానీ, వాటిని పిల్లలపై మోపడం ఎలా కరెక్ట్? నిజానికి ఇన్నిన్ని న్యూస్ ఛానెల్స్, టీవీ ఛానెల్స్, న్యూస్ పేపర్స్, youtube ఛానెల్స్ ఉండగా, మీడియం మార్చడం వల్ల తెలుగు భాషకు వచ్చే ముప్పేమీ లేదు. "ఏ బాషా మాధ్యమం ఉంటే పిల్లల ఎడ్యుకేషన్ మెరుగ్గా ఉంటుంది?" అనే ప్రశ్న మాత్రమే ఈ విషయంలో మన ఆలోచనను నడిపించాలి.

**అసలు మాధ్యమం అంటే?**

చేప ఈతకొట్టాలంటే నీరు అనే మాధ్యమం ఎలా కావాలో, పక్షి ఎగరాలి అంటే గాలి అనే మాధ్యమం ఎలా కావాలో, అలాగే మన ఆలోచనలను ఇతరులతో పంచుకోవాలి అంటే ఆల్రెడీ తెలిసి ఉన్న భాష అనే మాధ్యమం కావాలి.

కొత్త విషయాలను నేర్చుకొనే ప్రాసెస్ లో భాగంగా టీచర్ చెప్పింది అర్థం చేసుకోవడం కోసం, సందేహాలను వ్యక్తం చేయడం కోసం, కరెక్ట్ కాదనిపిస్తే ప్రశ్నించడం కోసం, ఇలా తన మనసులో ఆలోచనలను టీచర్ తోనూ, తోటి పిల్లలతోనూ, పేరెంట్స్ తోనూ పంచుకోవడం కోసం, ఆల్రెడీ బ్రెయిన్ లో ఉన్న పదాల ముడి సరుకును "మాధ్యమం" అంటారు. స్టూడెంట్స్ సైన్స్, సోషల్ స్టడీస్ వంటి సబ్జెక్టులను నేర్చుకుంటున్నట్టే ఈ మాధ్యమంలో పద సంపదను కూడా ఎప్పటికప్పుడు పెంచుకుంటూ విశాలం చేసుకుంటారు.

కొత్తగా నేర్చుకొనే భాష నేర్చుకోవాల్సిన సబ్జెక్టు మాత్రమే అవుతుంది. నేర్చుకోవడానికి వాడుకోదగ్గ మీడియంగా మొదట్లో ఉపయోగపడదు. నేర్చుకోవడం మొదలు పెట్టి కావాల్సినంత పదసంపద పోగొయ్యి, వాక్య నిర్మాణం వచ్చి, ఆ కొత్త భాషలో కూడా ఆలోచనలను వ్యక్తం చేయడం వస్తే, అప్పుడు మాత్రమే అది మీడియంగా పనికి వస్తుంది. అలా కాకుండా కొత్తగా నేర్చుకోవాల్సిన భాషను మొదటి నుండీ మీడియంగా పెట్టేస్తే, ఆ కొత్త భాష నేర్చుకోవడంతోనే సరిపోతుంది. అర్థం కాని భాషలో చెప్పిన భాషేతర సబ్జెక్టులు సరిగా అర్థం కావు. భాషా పరిజ్ఞానం వేటలో పడి, విషయపరిజ్ఞానంలో వెనుకబడిపోతారు.

అందుకే కనీసం ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకూ అమ్మ భాష (mother language) లో టీచింగ్ జరగడమే మంచిది. "అమ్మ" అనే పదం ఎమోషన్ దట్టించడం కోసం వాడలేదు. పుట్టినప్పటి నుండి నేర్చుకుంటున్న భాషను ప్రపంచ వ్యాప్తంగా "అమ్మ భాష" అనే పేరుతో పిలుచుకుంటున్నారు. అంతకు మించి వేరే ఏమీ లేదు.

అమ్మ భాష నేర్చుకునే విధానం పూర్తిగా ప్రత్యేకం. స్కూల్లో కొత్త భాష నేర్చుకుంటున్నపుడు ముందు అక్షరాలు, తరువాత పదాలు, తరువాత ఆ పదాల్ని ఎలా పలకాలి, ఆయా పదాలకు అర్థం ఏమిటి, ఈ ఆర్డర్ లో తెలుసుకుంటాం. ఈ ప్రాసెస్ లో ఆ పదాల వెనుక ఉన్న వస్తువుని డైరెక్ట్ గా చూడటం కుదరవచ్చు, కుదరకపోవచ్చు. ఒక్కోసారి ఒట్టి పదాలు

మాత్రమే మైండ్ లో ఉంటాయి. వాటి వెనుకున్న వస్తువులు లేదా భావోద్వేగాలు ఉండవు. కారణం క్లాసు రూములో కేవలం అక్షరాల సాయంతో నేర్చుకోవడం వలన. కానీ అమ్మ భాషలో 3 dimentional వస్తువుని తాకుతూ ఉన్నప్పుడో, చూస్తున్నప్పుడో ఆ స్పర్శ, చూపు అనుభవంతో కలిసి దానికి సంబంధించిన పదం (శబ్దం) కూడా మెదడులో ముద్రించబడుతుంది. అలాగే భయం, కోపం, సంతోషం వంటి ఎమోషన్స్ కూడా వాటిని ఫీల్ అవుతున్నప్పుడు మెదడులో ముద్రించబడి పోతాయి. ఆ మెమరీ చాలా స్పష్టంగా, vividగా, క్రిస్టల్ క్లియర్‌గా త్రీడీ మూవీలా ఉంటుంది. అందుకే అమ్మ భాషలో ప్రైమరీ ఎడ్యుకేషన్ మెరుగ్గా ఉంటుంది.

అమ్మభాషలో ఎడ్యుకేషన్ వల్ల రెండవ ప్రయోజనం ఏమిటంటే, సాధారణంగా అమ్మ భాష, చుట్టూ ఉన్న సమాజం మాట్లాడే భాష ఒకటే అయి ఉంటుంది. పుస్తకాల్లో చదివిన సైన్స్, సోషల్ స్టడీస్‌లోని అంశాల్ని దైనందిన జీవితంలోని సంఘటనల్లో చూసుకుంటూ, సంఘంలోని వ్యక్తులతో మాట్లాడుతూ వాటి గురించి మరింత స్పష్టమైన అవగాహన పొందే వీలుంది. అందువల్ల టీచర్ మాత్రమే కాక సంఘంలో ఉన్న ప్రతీ వ్యక్తి భోధనలో పాలు పంచుకుంటారు.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. భాష నేర్చుకోవడం ఎడ్యుకేషన్ లో ఒక భాగం మాత్రమే. అదొక్కటే ఎడ్యుకేషన్ కాదు. ఎడ్యుకేషన్ అంటే పుస్తకాలలోని అంశాలను, పరిసరాలలో గమనించిన విషయాలలో, భావోద్వేగాలలో, దైనందిన జీవితంలో చేసే పనులలో చూసుకుంటూ జీవితం మొత్తాన్నీ కలిసి integrated గా చదువుకోవడం. అటువంటి ఎడ్యుకేషన్ వల్ల పుస్తకానికి జీవితంతో కనెక్షన్ ఉంటుంది. అప్పుడు లెక్కలూ, సైన్సు, సోషల్ స్టడీస్ మొదలైనవి రోజువారీ జీవితంలో కూడా నేర్చుకుంటారు. అప్పుడు దైనందిన జీవితం చదువుకొనే పెద్ద పుస్తకం అవుతుంది. పాఠ్యపుస్తకం ఆ జీవితాన్ని చూపించే అద్దం అవుతుంది. అందుకే UNESCO లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు ప్రాథమిక విద్యను అమ్మ భాషలో జరగాలని రికమెండ్ చేస్తున్నాయి. అలా చేయడం వల్ల మిగిలిన భాషలు నేర్చుకోవడం కూడా ఈజీ అని, సైన్స్, సోషల్ స్టడీస్ లో learning process బాగుంటుందని కూడా చెబుతున్నాయి.

మీలో కొందరికి అనిపించవచ్చు. "మేం మొదటి నుండీ ఇంగ్లీషు మీడియంలోనే చదువుకున్నాం. కానీ సైన్స్, సోషల్ స్టడీస్‌లో మెమెప్పుడూ వెనుకబడిలేమే" అని.

అలా జరగడానికి మూడు ముఖ్యమైన కారణాలు ఉన్నాయి.

1. మన విద్యా వ్యవస్థ(ప్రభుత్వ మరియు ప్రైవేటు)లో ఎడ్యుకేషన్ అంటే పుస్తకాల్లో ఉన్నవి చదువుకోవడం, దాన్ని గుర్తుంచుకోవడం, నోట్ బుక్ లో రాసుకోవడం, తర్వాత దాన్నే పరీక్ష పేపర్ లో మళ్లీ రాయడం జరుగుతూ ఉంది. పుస్తకాల్లో ఉన్న దాన్ని పరిసరాలతో, దైనందిన జీవితంతో, చుట్టూ ఉన్న సొసైటీతో కనెక్ట్ చేసుకోవడం అనే కాన్సెప్ట్ లేనేలేదు. ఎప్పుడైతే ఆ కనెక్షన్ లేదో, అప్పుడు మీడియం అమ్మ భాష అయినా, ఇతర భాష అయినా పెద్దగా తేడా ఉండదు. అమ్మ భాష కానప్పుడు మొదట్లో కాస్త కష్టంగా ఉంటుందంతే. అంతకు మించి వేరే నష్టం ఏమీ ఉండదు.

ఇక రెండవ కారణం ఏమిటంటే, ఇప్పటివరకూ దేనినైతే తెలుగు మీడియం అంటున్నారో నిజానికి అది తెలుగు మీడియం కాదు. తెలుగు పేరుతో పాఠ్యపుస్తకాల్లో ఉన్న భాష చాలా వరకూ అర్థంకాని సంస్కృత పదాలతో కలుషితమై ఉంది. సంస్కృత భాష కాలుష్యం లాంటిదని కాదు. సమస్య ఏమిటంటే ఆ సంస్కృత పదాలు దైనందిన జీవితంలో ఎక్కడా వినబడవు. అండాశయము, తరంగదైర్ఘ్యము, కణత్వచము, కణ కుడ్యము, మస్తిష్క వల్కలము, త్వరణము, పౌనఃపున్యము, సకశేరుకాలు, అకశేరుకాలు మొదలైన పదాలను పిల్లలు నిజ జీవితంలో ఎక్కడా విని ఉండరు. ఆయా పదాలను పాఠ్య పుస్తకాల్లో చదివి జీవితంతో కనెక్ట్ చేసుకోవడం జరగని పని. Wave length అన్న ఇంగ్లీష్ పదం సులభంగా ఉంటుంది. దానిని "అల పొడవు" అని తేట తెలుగులో అంటే ఎంత బాగుండేది. "తరంగదైర్ఘ్యం" అనే బరువైన పదం ఎందుకు? ఏ కోడిని కోస్తున్న వ్యక్తి దగ్గరికో వెళ్లి ఇందులో "అండాశయం ఏది?" అంటే పిచ్చోడిని చూసినట్టు చూస్తాడు. అదే గుడ్లసేరు ఏది? అని అడిగితే వెంటనే చూపిస్తాడు. భారతదేశం నుండి సైన్స్ లో నోబెల్ బహుమతులు ఎందుకు రావడం లేదు? భారతీయ మూలాలు ఉన్న వారికి వచ్చినా, విదేశాల్లో స్థిరపడ్డ వారికే ఎందుకు వస్తున్నాయి? ఎందుకంటే మన చదువుల్లో పుస్తకానికి, జీవితానికి ఉన్న లింక్ తెగిపోవడమే కారణం. సైన్స్ ప్రయోగాలు కూడా బట్టీ పట్టించడం చేస్తున్నారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ ని చిన్న చూపు చూస్తున్నాం. మార్కులు తప్ప వేరే కొలమానమే లేని విద్యావ్యవస్థను తయారు చేసుకున్నాం.

మూడవ కారణం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల్లో పుట్టిన వారందరికీ అమ్మ బాష తెలుగు మాత్రమే అవ్వాలని లేదు. అలాగే ఒక మనిషికి ఒకేఒక అమ్మ బాష ఉండాలని లేదు. పేరెంట్స్ ఎడ్యుకేటెడ్ అయితే, ఇంట్లో ఇంగ్లీషు మాట్లాడుతూ ఉంటే, ఆ పిల్లలు పుట్టింది తెలుగు రాష్ట్రాల్లోనే అయినా వారి అమ్మ భాషలు (తెలుగు, ఇంగ్లీష్) రెండు అవుతాయి. అటువంటి పిల్లలకు ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకోవడం అంటే అమ్మ భాషలో చదువుకోవడమే. సొసైటీలోని లోకల్ లాంగ్వేజ్ మాత్రమే తెలిసిన వ్యక్తులతో మాట్లాడి, విషయావగాహన చేసుకోవాల్సినప్పుడు మాత్రమే సమస్య. ఈ మధ్య గ్రామీణ ప్రాంత భాషలో కూడా చాలా ఇంగ్లీష్ పదాలు ఉండటం వల్ల ఆ సమస్య కూడా కొద్దిగానే.

టెక్స్ట్ బుక్-నోట్ బుక్-టీచర్-స్కూల్ వీటి మధ్య మాత్రమే తిరుగాడే విద్యా వ్యవస్థను అలాగే ఉంచేద్దాం అనుకున్నప్పుడు, ఇంగ్లీష్ మీడియంలోకి మారడం వలన వచ్చే నష్టం చాలా తక్కువ. కాబట్టి ఇప్పుడు కొత్తగా చేయవలసింది ఏంటంటే ఆ టీచర్లను ఇంగ్లీషులో బోధించడానికి సరిపడా ట్రైనింగ్ ఇవ్వడం మాత్రమే. అలాగని అతిగా ట్రైనింగ్ ఇవ్వాల్సిన అవసరమూ లేదు. ఎందుకంటే ఇంగ్లీష్ లో మాత్రమే మాట్లాడుతూ పాఠాలు చెబితే, ఆ సడన్ చేంజ్ కి పిల్లలు బెదిరిపోతారు. అది చాలా ప్రమాదం. కొత్త english vocabulary ని పరిచయం చేస్తూనే, పిల్లలకు అర్థమయ్యేలా తెలుగులో కూడా చెప్పాలి.

టెంపరరీ అడ్జస్ట్మెంట్ తో సర్దుకుపోవడం కాకుండా నిజంగానే ఎడ్యుకేషన్ బాగుండాలి అని ప్రభుత్వం భావిస్తే, పాఠ్యపుస్తకాల నుండి "సంస్కృత మిక్స్ తెలుగు" భాషను తొలగించి, వ్యవహారిక భాషతో నింపాలి. ఎంత వ్యవహారిక భాషలో పాఠ్యపుస్తకాలు తయారు చేసినా కొన్ని కొన్ని ప్రాంతాలలో, ఆయా వస్తువులను, జంతువులను వేరే లోకల్ పదాలతో పిలుస్తారు. అందువలన ప్రతీ టీచరు ఆయా పదాలకు లోకల్ గా వాడే పదాలేమిటో తెలిసుకోవడానికి రీసెర్చ్ చేయాలి. అప్పుడే పాఠాలు చెప్పాలి. ఈమాత్రం చేయకపోతే ఒక్కో క్లాస్ కి ఒక్కో టీచర్ ఉండటం అవసరమేముంది? రాష్ట్రం మొత్తానికి ఒక టీచర్ ఉండి, ఆ టీచర్ తో వీడియో లెసన్ చెప్పించి, యూట్యూబ్ ఛానల్ లో అప్లోడ్ చేసి, LCD ప్రొజెక్టర్ తో స్క్రీన్ మీద వేస్తే సరిపోతుంది కదా?

పూర్తిగా ప్రత్యేక భాష ఉన్న గిరిజన పిల్లలకోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలు తయారుచేయాలి. తక్కువమంది ఉన్నారన్న కారణంగా వారిని బలవంతంగా తెలుగులో చదవమనడం వల్ల, జీవితాన్ని, అడవిని లోతుగా గమనించే గిరిజన పిల్లల ఎడ్యుకేషన్ని పాడు చేసిన వాళ్ళమవుతాం.

అమ్మ భాషను మీడియంగా విద్యాభ్యాసం మొదలు పెట్టించినా, ప్రీప్రైమరీ నుండే ఇంగ్లీష్ నేర్పిస్తూ, ప్రతీ స్కూల్లో ఇంగ్లీష్ ల్యాబ్ ఏర్పాటు చేస్తే ఆరు లేదా ఏడవ తరగతి వచ్చేసరికి ఇంగ్లీష్ లో పట్టు వస్తుంది. అప్పుడు ఇంగ్లీష్ మీడియంలోకి మార్చడం కరెక్ట్. ఆరేళ్ళ లోపు పిల్లలు ఒకేసారి ఆరు భాషలు నేర్చుకోగలిగే సామర్ధ్యం కలిగి ఉంటారు. అందువల్ల అమ్మభాషతో పాటు ఇంగ్లీష్ కూడా నేర్పించడం వారికి భారం కాదు. గ్లోబలైజేషన్ యుగంలో ఇంగ్లీష్ లోకి మారడం తప్పని సరి. ఇంగ్లీష్ లో దొరికే పుస్తకాలలో, వీడియోలలో పదో వంతు కూడా లోకల్ లాంగ్వేజ్ లో దొరకవు.

ఇంగ్లీష్ భాష వచ్చిన వారికే జాబ్స్ ఎక్కువ అన్నది నిజమే కానీ, దానికోసం ప్రైమరీ స్కూల్ నుండే ఇంగ్లీష్ మీడియంలో చదివించి, సైన్స్, సోషల్ నాలెడ్జ్ని బలహీన పరచడం కరెక్ట్ కాదు. ఫస్ట్ క్లాస్ నుండీ ఇంగ్లీష్ కూడా నేర్చుకుంటే సరిపోతుంది. దీన్ని మొక్కుబడి వ్యవహారంలా చూడకుండా ప్రభుత్వం శ్రద్ధ పెట్టి చేయాలి. ఒకేసారి నాలెడ్జ్ గెయిన్ అయ్యాక ఇంగ్లీష్ మీడియంకి మారిపోవచ్చు.

ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టేయగానే మెరుపులు మెరుస్తాయి, ఉద్యోగాలు వచ్చేస్తాయి, పేద పిల్లలకు ఇది వరం అని ఫీలయ్యేవారున్నారు. "ఇంగ్లీష్ మీడియంలో చదువుకొని మంచిమంచి ఉద్యోగాల్లో సెటిలయ్యాము"ని చెబుతున్న వారిలో మెజారిటీ వ్యక్తులు ఇంగ్లీష్ పరిజ్ఞానం ఉన్న పేరెంట్స్ కలవాళ్లో లేదా ఆర్థికంగా అభివృద్ధి చెంది ప్రైవేట్ బడుల్లో చదవడంతో పాటు ట్యూషన్లు కూడా పెట్టించుకొని చదివినవాళ్లో అయి ఉంటారు. వాళ్ల సక్సెస్ ని ఆధారంగా చేసుకుని, ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో జాయిన్ చేసే బడుగు బలహీన వర్గాల పిల్లలు కూడా అదేవిధంగా రాణిస్తారనుకోవడం సరైన అంచనా కాదు. పేరెంట్స్ గానీ, చుట్టాల్లో గానీ ఇంగ్లీష్ మాట్లాడే వారులేని పిల్లలు, డైరెక్ట్ గా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం చదివి, డెవలప్ అయిన స్టూడెంట్స్ గురించి ఇప్పటి వరకూ ఏ రీసెర్చ్ జరగలేదు.

తెలుగు మీడియం వల్ల మాత్రమే ప్రభుత్వ బడులు వెనుకబడ్డాయని, అది తప్ప విద్యావ్యవస్థ అంతా బాగుందనే

**డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్:** నేను నా జీవితంలో 40 సంవత్సరాల వరకూ ఉపాధ్యాయునిగా ఉన్నాను. మౌలికంగా మన విద్యార్థుల్లో ఎలాంటి పొరపాటూ లేదని నేను చెప్పదలుచుకున్నాను. వారికి ఉండాల్సిన అవకాశాలను మనం వారికి ఇవ్వడం లేదని నేను చెప్పాలని భావిస్తున్నాను. మన ఉపాధ్యాయులనే చూడండి: తన బోధనాంశం పట్ల ప్రేమ, తన విద్యార్థులకు తన తృష్ణను అందించాలనే జిజ్ఞాసా లేని ఏ ఒక్కరూ నిజమైన ఉపాధ్యాయుడు కాలేరు. అవసరాన్ని బట్టి వారిని ఉన్నత స్థానంలో ఉంచాలి. సమాజంలో తాము తొలి, అత్యున్నత సభ్యులనే భావన ఉన్న ఉపాధ్యాయులు మనకు లేరు. ఈ అన్ని ప్రమాణాలనూ అధిగమించి ఎదగగలిగి, మొత్తంగా సమాజ ప్రయోజనాలకు అనుగుణంగా సేవ చేయగలిగే వారు లేరు. మనం మన బాలబాలికలను ఈ మహోన్నత దేశపు పౌరులుగా తీర్చిదిద్దాలని తపనపడుతున్నాం. అందువల్ల విశ్వవిద్యాలయం లేదా ఒక కళాశాల అధ్యాపకులను ఎంపిక చేసేటప్పుడు ఎంతో శ్రద్ధ తీసుకోవాలి. మనం వారిని కేవలం వారికున్న మేధో పటిమను చూసి గాక తన పాఠ్యాంశాల పట్ల ప్రేమ, తమ చేతుల్లో విద్యార్థులు ఎదగాలనే ఆకాంక్ష ఉన్న వారిని ఎంపిక చేయాలి.

**జిమ్మీ కుమ్మిన్స్, (టోరంటో యూనివర్శిటీ):** "విద్యార్థికి మాతృభాషపై ఉన్న పట్టు ఆ విద్యార్థి రెండవ భాషను ఎంత బాగా నేర్చుకోగలడనేదానికి గీటురాయిగా ఉంటుంది. పాఠశాలల్లో మాతృభాషలో బోధించడం వల్ల తరువాత కాలంలో ఇతర భాషలను నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా బిడ్డ మొత్తం సామర్థ్యం మెరుగవుతుంది. పిల్లలకు మాతృభాష పూర్తిగా నేర్పకుండా పరాయి భాషను నేర్పడం వల్ల నష్టం ఎక్కువ. బిడ్డలో మాతృభాష పూర్తిగా ఎదిగి స్థిరపడకపోతే అది వాళ్ళనుండి త్వరగా అంతర్ధానం అవుతుంది. అందువల్ల తల్లి భాష బాగా వృద్ధి చెందాకే రెండవ భాషను నేర్పాలి. పాఠశాలల్లో పిల్లల్ని తమ మాతృభాషలో మాట్లాడనియ్యకుండా నిరాకరించడం అంటే అది పిల్లవాణ్ణి నిరాకరించినట్లే".

అపోహలో కూడా ఉన్నారు. ఇంగ్లీష్ మీడియంలోకి మార్చేయగానే మంత్రులు ఎమ్మెల్యేలు, విద్యాధికారులు, టీచర్లు తమతమ పిల్లల్ని ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ బడుల్లో చేరుస్తారా???

కార్పోరేట్ కాలేజీల బిజినెస్ పెంచడం కోసం, ఎక్కువ మందిని SSC పాస్ చేయడం కోసం, 100% పాస్ పర్సంటేజ్ వచ్చేలా జిల్లా విద్యాధికారుల మధ్య పోటీ పెట్టారు. దాని ఫలితంగా మాస్ కాపీయింగ్ ని మన కల్చర్ లో భాగంగా చేసుకొని, మనల్ని మనమే మోసం చేసుకుంటూ మార్కులు బాగున్నా స్టాండర్డ్స్ లేని విధంగా ఎడ్యుకేషన్ సిస్టం తయారయింది. ఇంత పెద్ద సమస్యను పట్టించుకోకుండా కళ్ళు తెరిచి నిద్రపోతున్న మనం, "కేవలం ఇంగ్లీష్ మీడియంలోకి మార్చడం వల్ల ప్రభుత్వ బడుల నుండి IAS ఆఫీసర్లు తయారవుతారు" అన్నట్టు మాట్లాడటం విచిత్రంగా ఉంది. పెట్రోల్ లేని బైక్ వేసుకొని, ఏ రూట్ లో వెళితే త్వరగా గమ్యాన్ని చేరతాం? అని చర్చించినట్టుగా ఉన్నాయి ఈ వాదనలు. ముందుగా విద్యావ్యవస్థని బలోపేతం చేయడం అవసరం. ప్రక్షాళన చేయడం అవసరం. టీచర్ ఎలా చెప్పినా ప్రమోషన్ వచ్చే పద్ధతి పోవాలి. సర్వీసును బట్టి బెస్ట్ టీచర్ అవార్డులు ఇచ్చే మొక్కుబడి సంస్కృతిని మార్చాలి. బయట నుండి inspection agency వచ్చి క్లాసులో ఎంతశాతం మంది పిల్లలు multiplication, division వంటివి చేయగలుగుతున్నారు అని టెస్ట్ చేసి, online video recording తో సర్వే రిపోర్ట్ తయారుచేసే సిస్టం డెవలప్ చేయాలి. టీచర్ యూనియన్స్ అనేవి సరిగా పనిచేసే టీచర్ల హక్కుల కోసం మాత్రమే పోరాడాలి. టీచర్ల బాధ్యతారాహిత్యాన్ని కూడా సపోర్ట్ చేసేలా యూనియన్స్ ఉండకూడదు. అది లక్షలమంది పిల్లల జీవితాలతో ఆడుకోవడమే.

ఎడ్యుకేషన్ అంటే చదవడం రాయడం మాత్రమే కాకుండా, ప్రయోగాలు, పరిశోధనలు, ఆటలు, పాటలు, కథలు రాయడం, కథలు చెప్పడం, నలుగురిలో నిలబడి మాట్లాడటం, బొమ్మలు గీయడం, ప్రతీ సిద్ధాంతాన్ని ప్రశ్నించడం, తమ సమస్యలకు తామే పరిష్కారాలు కనుగొనేలా స్కూల్ పార్లమెంట్ నిర్వహించుకోవడం,...... ఇవన్నీ జరగాలి. ఇవన్నీ పక్కన పెట్టి, పిల్లల్ని రోబోట్లుగా తయారు చేసే విద్యావ్యవస్థలో ఏ మీడియంలో బోధన జరగాలి అన్నది మాత్రమే ఇంపార్టెంట్ అని ఎలా అనుకుంటున్నారో ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి.

♦

# తెలుగు మాధ్యమం - ఆంగ్ల మాధ్యమం

- ఎస్ వెంకట్రావు

***ఒక భాష స్థానంలో మరో భాష వచ్చి చేరడమంటే అర్థం ఒక సంస్కృతి నాశనమై మరో సంస్కృతి దాని స్థానాన్ని ఆక్రమిస్తున్నట్లేనని యునెస్కో డైరక్టర్ జనరల్ కొయిచిరో మత్సూరా పేర్కొన్నారు. యాలేలోని హస్కిన్స్ లేబరేటరీ ఉపాధ్యక్షుడైన డాఫ్ వాలెన్ దీన్ని మరో విధంగా వివరించాడు. "భాష అనేది ఒక సంస్కృతికి ప్రతినిధి మాత్రమే కాదు, అదీ సంస్కృతిలో భాగం. మాటలు, పలకరింపులు, పాటలు, హాస్యం వంటివన్నీ కేవలం సమాచారాన్ని అందించుకునే సాధనాలు మాత్రమే కాదు అవన్నీ సంస్కృతిలో భాగం. ఒక సంస్కృతిని ఇంకో భాషలో కూడా వ్యక్తం చేయవచ్చు. కాని తన స్వంత భాషలో మాత్రమే దాన్ని ప్రతిభావంతంగా వ్యక్తం చేయడం సాధ్యమవుతుంది" అని అంటాడాయన. ప్రపంచంలో అంతరించిపోతున్న భాషల పరిరక్షణ నిధికి ఈయన అధ్యక్షుడు కూడా.***

ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎవరూ తెలుగు మాధ్యమంలో చదవడానికి వీల్లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జిఓ నెం 81 పెద్ద దుమారాన్ని రేపింది. తెలుగు రాష్ట్రంలో తెలుగు భాష పరిస్థితి గురించీ, పిల్లల చదువులు ఏ మాధ్యమంలో ఉండాలి అన్న విషయం గురించీ విపరీతమైన వాదోపవాదాలను లేవనెత్తింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా, అనుకూలంగా మీడియాలో, మరీ ముఖ్యంగా సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ జరుగుతోంది.

పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ఉండాల్సిందే అనే వాదన ప్రధానంగా దళితుల్లోని కొన్ని తరగతుల నుండి వస్తోంది. వారు బలంగా చేస్తున్న వాదన ఏమంటే....ఈ రోజు ఆంగ్లం ఉపాధి భాషగా మారిపోయింది. ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న వారంతా మంచి ఉద్యోగాలు సంపాదిస్తున్నారు, ఉపాధి పొందుతున్నారు. విదేశాలకు వెళ్లి బాగా సంపాదించుకునే అవకాశాలూ వారికే వస్తున్నాయి. గత రెండు మూడు దశాబ్దాల్లో స్తోమత ఉన్న వారి పిల్లలంతా, ముఖ్యంగా అగ్రవర్ణాలవారి పిల్లలు ప్రయివేటు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లోకి మారిపోయారు. అందువల్ల అవకాశాలన్నిటినీ వారే అందిపుచ్చుకున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో చదివించే స్తోమత లేని, బలహీన వర్గాల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిపోయారు. ఇక్కడ అంతంత మాత్రం చదువులు. అవి కూడా తెలుగు మాధ్యమం చదువులు. ఈ చదువులు ఈ తరగతుల పిల్లల అభివృద్ధికి ఆటంకంగా మారాయి. కనుక ప్రభుత్వ పాఠశాల్లో ఆంగ్ల మాధ్యమం ఆహ్వానించదగ్గ విషయమే.

ప్రభుత్వ చర్యను వ్యతిరేకించేవారు బలంగా చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి... 1. మాతృభాషలో విద్య నేర్పడం వల్ల పిల్లల మానసిక వికాసం ఉన్నతంగా ఉంటుంది. ఇది శాస్త్రీయంగా నిరూపించబడిన విషయం. అందువల్ల తెలుగు మాధ్యమంలో విద్యా బోధన, కనీసం ప్రాథమిక విద్య వరకు జరగాలి. 2. తెలుగు భాష నాశనం అయితే తెలుగు జాతి సంస్కృతి నాశనం అవుతుంది. ప్రధానంగా ఈ రెండు కారణాల వల్ల వీరిలో చాలా మంది తెలుగు మాధ్యమంపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

ఇక వాదనలకు దిగినప్పుడు ఒకరి వాదన మరొకరు పూర్వపక్షం చేసుకోడానికి అనేక అంశాలు ముందుకు తెస్తున్నారు. ఆంగ్ల మాధ్యమం వద్దంటున్న వారు వారి పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో ఎందుకు చదివించారు, చదివిస్తున్నారు అని ప్రశ్న. ప్రభుత్వం కూడా ఇదే వాదన చేస్తోంది. ప్రభుత్వం విధాన పరంగా నిర్ణయం చేసినప్పుడు అందరూ దానికి బద్ధులై ఉంటారు, అందువల్ల ఆంగ్ల మాధ్యమాన్ని అనివార్యంగా మార్చకుండా తెలుగు మాధ్యమాన్ని అనివార్యంగా చేసినప్పుడు అందరూ దాన్ని పాటిస్తారు గదా అనేది ప్రతివాదన. ఆంగ్ల మాధ్యం వద్దనడం లేదు, తెలుగు మాధ్యం కూడా ఒక ఐచ్ఛికంగా ఉంచాలి అనేది ఒకవైపు. తెలుగు ఒక పాఠ్యాంశంగా ఉంటుంది గనుక దానికి వచ్చిన భయమేమీ లేదు అనేది మరోవైపు. ఇలా వాద ప్రతివాదనలు సాగిపోతూనే ఉన్నాయి. భాషమీద అభిమానం త్వరగానే దురభిమానంగా మారిపోయే అవకాశాలున్నాయి. తెలుగు భాష, తెలుగు మాధ్యమాల గురించి నేడు రాష్ట్రంలో జరుగుతున్న చర్చ ప్రజల మధ్య ఒక చీలికను చూపిస్తోంది.

ఏమైనా భాషా సమస్యను సమగ్రంగా పరిశీలించి, పరిష్కరించే విషయంలో పాలక పక్షాల వైఫల్యమే నేడు మన రాష్ట్రంలో ఈ గందరగోళానికి కారణం. గతంలో రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలుగానీ, నేటి పాలక పక్షం గానీ భాషా సమస్యను, బోధనా మాధ్యమం సమస్యను పాక్షిక కోణం నుండే చూశాయి, చూస్తున్నాయి.

ఈరోజు తెలుగు భాషా సమస్య సెంటిమెంటు సమస్య కాదు. కానీ తెలుగు వికాసం కోసం మాట్లాడుతున్న వారిలో చాలా మంది దాన్ని ఇలాగే చూస్తున్నారు. అది కేవలం మన తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. భాష విద్యకు మాధ్యమమైతే, విద్య ఉపాధికి ఆలంబనం. అందువల్ల ఒకవైపు సంస్కృతి కోణం నుండీ, రెండోవైపు ఉపాధికోణం నుండీ భాషా సమస్యను పరిశీలించాలి. పరిష్కరించాలి.

**ప్రమాదంలో తెలుగు భాష**

యునెస్కో తను రూపొందించిన ప్రపంచ భాషల అట్లాస్‌లో మృతి చెందుతున్న భాషలను గురించి క్రింది విధంగా చెప్పింది:

ప్రమాదంలో పడిన భాషలు – ఎక్కువ మంది పిల్లలు మాట్లాడతారు. కానీ ఆ మాట్లాడ్డం కొన్ని ప్రాంతాలకే (ఉదాహరణకు ఇంటికే) పరిమితం అవుతుంది.

ఖచ్చితంగా ప్రమాదంలో పడిన భాషలు – పిల్లలు ఇంటిలో మాతృభాషగా మాట్లాడని భాషలు

తీవ్రంగా ప్రమాదంలో పడిన భాషలు – తాతల తరం వారు మాట్లాడతారు, తల్లి తండ్రుల తరం అర్థం చేసుకుంటుంది కానీ వారు పిల్లలతో గానీ తమలో తాముగానీ ఆ భాషలో మాట్లాడరు.

అతి తీవ్రంగా ప్రమాదంలో పడిన భాషలు – తాతల తరం వారు, పాత తరం ప్రజలు కూడా అప్పుడప్పుడు పాక్షికంగా మాట్లాడే భాషలు.

అంతరించిపోయిన భాషలు – 1950 తరువాత మాట్లాడేవారే లేని భాషలు.

యునెస్కో నిర్వచనం ప్రకారం అన్ని తరాలవారూ మాట్లాడుతూ ఒక తరం నుండి మరోతరానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా బదిలీ అయ్యే భాషలు క్షేమంగా ఉన్నట్లు. ఈ నిర్వచనాల ప్రకారం చూస్తే తెలుగు భాష క్షేమంగా మాత్రం లేదని అర్థమవుతుంది. అది ఎంత ప్రమాదంలో ఉంది అనేది అంచనా వేయాలి.

మన రాష్ట్రంలో ప్రాథమిక స్థాయిలో ఇప్పటికే 50 శాతం మంది పిల్లలు ఆంగ్లమాధ్యమంలో చదువుతున్నారు. అందువల్ల వారికి తెలుగు చదవడం, రాయడం రాదు. సమాజంలో ఉన్నత వర్గాలవారే కాదు, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా ఇటీవలి కాలంలో పిల్లల చదువులకు ఆంగ్ల మాధ్యమాన్నే ఎంచుకుంటున్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదవకపోతే తమ పిల్లలకు భవిష్యత్తు లేదన్న భయం ప్రజల్లో ఏర్పడింది. తెలుగు మాధ్యమంలో చదవడమంటేనే న్యూనత గానూ, తెలుగు మాధ్యమ విద్యార్థులంటే సమాజంలో తక్కువ తరగతి వారు గానూ పరిగణించబడుతోంది. ఇప్పటివరకు ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ విద్య అంటే తెలుగు మాధ్యమంగానూ, ప్రయివేటు విద్య అంటే ఆంగ్ల మాధ్యమంగానూ చెలామణి అవుతోంది. ఈ అడ్డుగోడలు తెగ్గొట్టేందుకు ప్రభుత్వం జిఓ నెం 81 తెచ్చింది. అయితే అడ్డుగోడలు పడగొట్టేది అందర్నీ తెలుగు మాధ్యమంలోకి తేవడానికి కాదు, ఆంగ్ల మాధ్యమంలోకి నెట్టడానికి. అందువల్ల యునెస్కో చెప్పినట్లు అంతరించిపోయే ప్రమాదంలో తెలుగు బాష పడిందా ఇంకా పడలేదా అన్న అంచనాలు ఎలా ఉన్నా ప్రభుత్వ చర్యతో ప్రమాదం ముంచుకొచ్చిందన్నది మాత్రం వాస్తవం.

తెలుగు ప్రజలకు తెలుగు మాధ్యమం లేకుండా చేయడానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కారణాలనే గతంలో ప్రభుత్వాలు కూడా చెప్పాయి. ఆంగ్ల మాధ్యమం లేకపోతే ఉద్యోగాలెలా వస్తాయి? కుగ్రామంగా మారిపోయిన ప్రపంచంలో (గ్లోబల్ విలేజ్‌లో) పోటీని తట్టుకోవాలంటే ఆంగ్లం తప్పనిసరి, ఇంటర్నెట్‌లో సమాచారం రాబట్టుకోవాలంటే ఆంగ్లం తెలుసుకోకుండా ఎలా?...ఇలాంటి ప్రశ్నలతో వారు ప్రజలను ఆంగ్లంవైపు నెట్టారు. ఈ వాదనలన్నీ అశాస్త్రీయమైనవనీ, వాస్తవాలకు దూరంగా ఉన్నాయని మేధావులు చెబుతూనే ఉన్నారు. అయినా పట్టించుకోకుండా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలవల్ల మన అమ్మ భాష నేడు ఈ దుస్థితికి చేరుకుంది. చివరికి తెలుగుదేశంలో తెలుగు మాత్రమే తెలిస్తే నీవు ఎందుకూ పనికిరావు. ఏ ఆఫీసులోనూ నీ పనులను నీకు నీవుగా చక్కదిద్దుకోలేవు. కాని తెలుగు తెలియకపోయినా నీకు ఇంగ్లీషు మాత్రమే తెలిసినా ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని పనులూ చక్కబెట్టగలవు అన్న స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారు. భాషకు సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలు పరిశీలిద్దాం.

**తెలుగు భాష – తెలుగు సంస్కృతి**

ఒక భాష స్థానంలో మరోభాష వచ్చి చేరడమంటే అర్థం ఒక సంస్కృతి నాశనమై మరో సంస్కృతి దాని స్థానాన్ని ఆక్రమిస్తున్నట్లేనని యునెస్కో డైరక్టర్ జనరల్ కొయిచిరో మత్సూరా పేర్కొన్నారు. యాలేలోని హస్కిన్స్ లేబరేటరీ ఉపాధ్యక్షుడైన డాఫ్ వాలెన్ దీన్ని మరో విధంగా వివరించాడు. "భాష అనేది ఒక సంస్కృతికి ప్రతినిధి మాత్రమే కాదు, అదీ సంస్కృతిలో భాగం. మాటలు, పలకరింపులు, పాటలు, హాస్యం వంటివన్నీ కేవలం సమాచారాన్ని అందించుకునే సాధనాలు మాత్రమే కాదు అవన్నీ సంస్కృతిలో భాగం. ఒక సంస్కృతిని ఇంకో భాషలో కూడా వ్యక్తం చేయవచ్చు. కాని తన స్వంత భాషలో మాత్రమే దాన్ని ప్రతిభావంతంగా వ్యక్తం చేయడం సాధ్యమవుతుంది" అని అంటాడాయన. ప్రపంచంలో అంతరించిపోతున్న భాషల పరిరక్షణ నిధికి ఈయన అధ్యక్షుడు కూడా. వాలెన్ అభిప్రాయం ప్రకారం భాషను పరిరక్షించుకోవడమెందుకంటే "అది ప్రజలు తమ స్వంత భవిష్యత్తును నిర్ణయించుకునే ఒక సాధనం కనుక. భాషను పరిరక్షించుకోవడం ద్వారా కొన్ని విలువలను పరిరక్షించుకోగలం కనుక"

తెలుగు భాషకు వస్తున్న ప్రమాదం గురించి, లేక ఆంగ్ల మాధ్యమానికి వ్యతిరేకంగా ఎక్కువగా మాట్లాడితే భాషా దురభిమానాన్ని పెంచినవారమవుతామని అనుకునే వారున్నారు. దీన్ని కేవలం ఒక సెంటిమెంటల్ సమస్యగా పరిగణించి కొట్టిపారేసేవారూ ఉన్నారు. కాని ఈ రోజు మాతృభాష పరిరక్షణ కోసం, తెలుగులో విద్యాబోధన, తెలుగులో ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణ కోసం డిమాండు చేయడం కేవలం సెంటిమెంటుకు సంబంధించినది కాదు. తెలుగు భాష మీద ఆంగ్లం దాడికి, తెలుగు సంస్కృతిమీద విదేశీ సంస్కృతి దాడికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఇదో భాగం. ఇంకోమాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో మన భాషమీద, మన సంస్కృతిమీద, మన విలువల మీద సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఇదో భాగం. మన దేశంలోనే కాదు, తెలుగు రాష్ట్రంలోనే కాదు, అన్ని దేశాల్లో అన్ని భాషలు మాట్లాడే సమాజాల్లో ఈ పోరాటం జరుగుతోంది. ఎందుకంటే ప్రపంచీకరణ పేరుతో అన్ని సమాజాలమీద, అన్ని భాషలమీద ఆంగ్లం దాని సంస్కృతీ, దాని విలువలూ దాడి చేస్తున్నాయి కాబట్టి.

ఒక జాతి సంస్కృతిని, భాషను, విలువలను దానిపై ఆధిపత్యం వహించే జాతి నాశనం చేయడానికి ప్రయత్నించడం ఆనాదిగా జరుగుతున్నదే. ఐరోపవాసులు తమ వలస పాలన నెలకొల్పుకునే క్రమంలో ప్రపంచంలోని కొన్ని వేల భాషా సంస్కృతులను నాశనం చేశారు. నాగరికత పెంపొందని జాతులు విదేశీయుల దురాక్రమణలో తమ భాషలను కోల్పోయాయి. ఆసియా, ఐరోపాలలో కూడా గిరిజనులు, సంచార జాతులకు చెందిన అనేక భాషలను స్థానికంగా అభివృద్ధి చెందిన సమాజాలు నాశనం చేశాయి. భాషా సంస్కృతుల వినాశనమనేది ప్రపంచంలో నేటికీ కొనసాగుతోంది. యునెస్కో అధ్యయనం ప్రకారం ప్రపంచంలో మొత్తం 6000 భాషలుండగా వాటిలో సుమారు 5000 భాషలు అంతరించిపోతున్నాయి.

**ప్రపంచీకరణ – తెలుగు భాషపై దాడి**

అనేక శతాబ్దాలుగా వివిధ భాషలు, సంస్కృతుల మీద దాడి జరుగుతున్నా ప్రపంచీకరణ యుగంలో ఆంగ్ల భాష చేస్తున్న దాడి ఒక నూతన రూపాన్ని, ఒక నూతన సారాన్ని సంతరించుకుంది. ప్రపంచమంతటా వినిమయదారీ సంస్కృతిని విస్తరించే క్రమంలో ఈ దాడి జరుగుతోంది. ఎలక్ట్రానిక్ మీడియా, వినోద, సమాచార పారిశ్రామిక వ్యవస్థల ద్వారా ఇది సాగుతోంది. ఒకప్పుడు సామ్రాజ్యాల విస్తరణ కోసం కరవాలం చేతపట్టి, అశ్వారూఢులై ఒక్కో రాజ్యాన్ని జయించుకుంటూ పోయినట్లే నేడు ఆంగ్ల భాష అమెరికా సమాచార సాంకేతిక, వినోద సాధనాల ద్వారా స్వారీ చేస్తూ ప్రపంచమంతటా వినిమయదారీ సంస్కృతిని విస్తరించుకూంటూ పోతోంది.

క్లింటన్ హయాంలో అమెరికా అధ్యక్షభవనం అధికారిగా పనిచేసి తరువాత 'కిసింజర్ అసోసియేట్స్' మేనేజింగ్ డైరక్టర్ బాధ్యతలు చేపట్టిన డేవిడ్ రోథ్‌కోఫ్ అభిప్రాయం ప్రకారం "ప్రపంచమంతా ఒకేభాష నెలకొనాలంటే అది ఇంగ్లీషే కావాలి, ప్రపంచమంతా టెలివిజన్, రేడియో, మ్యూజిక్ అనుసంధానించబడిందంటే ఆ కార్యక్రమాలు అమెరికావే కావాలి. ప్రపంచంలో ఉమ్మడి విలువలంటూ అభివృద్ధి చెందితే అవి అమెరికావారికి అనుకూలమైనవి కావాలి. అప్పుడే – ఆ పరిస్థితులు ఏర్పడినప్పుడే – ఆధునిక ప్రపంచంలో అమెరికా ప్రయోజనాలు నెరవేరుతాయి." ఇవన్నీ కేవలం అమెరికా ఆలోచనలూ, ఆశలూ కావు అవి ఇప్పుడు జరుగుతున్న వాస్తవాలు అంటాడాయన.

21వ శతాబ్దంలో కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ ఇతర ఎలక్ట్రానిక్ సాంకేతిక పరిజ్ఞానంలో అమెరికా ఆధిపత్యం

నెలకొల్పింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడానికి ఆంగ్లాన్ని తప్పనిసరి చేసింది. తన పారిశ్రామిక ఉత్పత్తులు సర్వీసులతోబాటు హాలీవుడ్ సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు, పాప్ మ్యూజిక్ ఇతర వినోద రంగ ఉత్పత్తులను ప్రపంచం మీదికి వదిలింది. 'లిమాండె డిప్లమాటిక్' పత్రికలో హెర్బర్ట్ షిల్లర్ అనే పరిశోధకుడు ఈ విధంగా రాశాడు. "రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా తన ప్రత్యర్థులందరికన్నా శక్తివంతంగా ముందుకొచ్చింది. దాంతో అమెరికన్ మీడియా, సాంస్కృతిక బహుళజాతి సంస్థలూ ప్రపంచమంతటినీ తమ ఉత్పత్తులతో ముంచెత్తడానికి అవసరమైన సమాచార ప్రసారాల వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. గత యాభయ్యేళ్లుగా అమెరికా ప్రభుత్వాలన్నీ ఈ విధానాన్నే చురుకుగా అనుసరించాయి. ఫలితంగా ఈనాడు టివి తెరలు, మ్యూజిక్ ఉత్పత్తులు, వినోద కేంద్రాలు, వ్యాపార వ్యవహారాల్లో ఇంగ్లీషు భాషా, 'మేడ్ ఇన్ అమెరికా' సంస్కృతీ, సమాచార ఉత్పత్తులూ ఆధిపత్యం వహిస్తున్నాయి.... ఇదంతా ప్రపంచీకరణలో భాగమే"

ఈ సాంస్కృతిక ఉత్పత్తులు అమెరికన్ ఇంగ్లీషునూ, అమెరికన్ విలువలనూ ప్రపంచంలోని అన్ని జాతుల ప్రజలపై రుద్దుతున్నాయి. ఇంగ్లీషు నేర్చుకోకపోతే తమ పిల్లలకు ఉన్నత విద్యరాదనీ, ఉద్యోగాలు ఉండవనే భయంతో బాటు విదేశాలకు ముఖ్యంగా అమెరికాకు వెళ్లే అవకాశం ఉండదన్న భయం వ్యాపింపజేయబడింది. ఇదే మధ్యతరగతి ప్రజలను పెద్ద ఎత్తున ఇంగ్లీషు మీడియం వైపు నెడుతోంది. ఏ దేశం ఆంగ్ల భాషకు ప్రోత్సాహమిస్తుందో ఆ దేశానికి పెట్టుబడులొస్తాయని, ఏ ప్రజలు ఆంగ్లంలో బాగా మాట్లాడతారో వారు ఉన్నతులని, అభివృద్ధికి వారే అతి దగ్గరగా ఉంటారని ప్రచారం సాగుతోంది. అందుకే అన్ని సమాజాల్లోనూ, అందులో భాగంగా మన రాష్ట్రంలో కూడా అంతర్గత వ్యవహారాలు ఆంగ్లంలోనే జరగాలన్న స్థితి ఏర్పడింది. ఆంగ్లం ఉన్నతమైనదన్న భావం మాత్రమే కాదు ఆధునిక ప్రపంచంలో ఆంగ్లం అనివార్యమన్న భావం కూడా పనిగట్టుకుని వ్యాపింపజేస్తున్నారు. ప్రపంచీకరణ అనివార్యం, దానికి ప్రత్యామ్నాయం లేదు (దెరీజ్ నో ఆల్టర్‌నేటివ్ – టినా) అంటున్నట్లే 'ఆంగ్లం అనివార్యం, దానికి ప్రత్యామ్నాయం లేదు' అన్న ప్రచారమూ సాగిపోతోంది.

**తెలుకు వ్యతిరేకంగా తెలుగు ప్రభుత్వాలు**

ప్రపంచీకరణను అందరికన్నా ఎక్కువగా భుజాన మోస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రపంచీకరణకు సాధనంగా ఉన్న ఆంగ్లాన్ని వ్యతిరేకిస్తాయను కోవడం భ్రమే అవుతుంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తెలుగు నేలపై తెలుగు భాషకు దుర్గతి పటించింది. దానికి కారణం అది అనుసరించిన ప్రపంచీకరణ అనుకూల విధానాలే. ప్రస్తుత ప్రభుత్వ విధానాలు కూడా దానికి భిన్నంగా లేవు. గత ప్రభుత్వాలు తెలుగును నాశనం చేస్తే, ఈ ప్రభుత్వం ఏకంగా పాడి కట్టించేస్తోంది.

అందుకే ఈ రోజు మాతృభాషలో విద్యాబోధనకోసం, తెలుగులో పాలనా వ్యవహారాలు నడిపించడం కోసం జరిగే పోరాటమేదైనా అది ప్రపంచీకరణ వ్యతిరేకపోరాటంలో భాగమే అవుతుంది. కొన్ని దశాబ్దాలుగా అమలైన ప్రపంచీకరణ విధానాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతే ఇప్పుడు మాతృభాషపై మమకారం రూపంలో వ్యక్తమవుతోంది. మాతృభాష దుస్థితి మీదా, దాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం మీదా జరుగుతున్న చర్చలు దీన్నే ప్రతిబింబిస్తున్నాయి. అయితే ఇది ఏ మాత్రం సరిపోదు. మాతృభాష పరిరక్షణ అనేది సెంటిమెంట్ల వ్యక్తీకరణ నుండి ఆచరణలో పోరాటరూపం సంతరించుకోవాలి. కేవలం ఆంగ్లాన్నీ దాని విలువలనూ వ్యతిరేకిస్తేనో, తిడితేనో సమస్య పరిష్కారం కాదు. అనేక రూపాల్లో పోరాటం సాగాలి. తెలుగులో పాలనా వ్యవహారాలు, తెలుగులో తప్పనిసరిగా ప్రాథమికవిద్య, తెలుగు గ్రంథాలయాలు, తెలుగులోకి అనువాదాలు... ఇలా అదో తెలుగు జాతీయోద్యమ రూపం సంతరించుకోవాలి. తెలుగు జాతీయాలు, తెలుగు జానపద పాటలు, పద్యాలు, నృత్యాలు, కళలు మొత్తంగా తెలుగు సంస్కృతీ పరిరక్షణోద్యమంలో భాగంగా ఈ పోరాటం సాగాలి. అప్పుడే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభావం నుండి మన భాషను, మన సంస్కృతిని చివరికి మన ఆర్థిక సామాజిక స్వావలంబనలను కూడా రక్షించుకోగలుగుతాము. అందువల్ల తెలుగును ఉపాధి భాషగా, పాలనా భాషగా మార్చుకోవడం కోసం అందరినీ ఐక్యం చేసే ఎజెండా రూపొందించుకుని పోరాటం చేయాలి.

1. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలన్నిటిలో ప్రాథమిక విద్య అమ్మ భాషలోనే ఉండేట్లు ప్రభుత్వం చట్టం చేయాలి.

2. ఉన్నత విద్యలో తెలుగు మీడియం ప్రోత్సహించాలి. అవసరమైన అనువాదాలు చేయాలి.

3. రాష్ట్రంలో పరిపాలన, న్యాయవ్యవహారాలన్నీ తెలుగులోనే జరగాలి.

4. తెలుగు భాషా వికాసం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలి. ♦

# మాతృభాషా మాధ్యమ చట్టాలు

- అప్పిరెడ్డి హరినాథ రెడ్డి

***రాజ్యాంగంలోని పై మొత్తం అంశాలను బట్టి ప్రాథమిక విద్య అంటే ఎనిమిదోవ తరగతి వరకు మాతృభాషలో విద్యపొందే హక్కు కల్పిస్తుంది. అల్ప సంఖ్యాక భాషల హక్కులను సంరక్షణ కోసం రాష్ట్రపతి చర్యలు కూడా తీసుకోవచ్చని తెలియచేస్తుంది. ఆర్టికల్ 29(1) ప్రకారం భారతదేశంలో నివసిస్తున్న పౌరులు ఏ వర్గంలో వారైనా వారి విశిష్ట భాష, లిపి లేదా సంస్కృతి ఉన్నట్లయితే దానిని కాపాడుకొనే హక్కు వారికుంటుంది. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ రూల్స్, జి.ఓ యస్ నెం :1188 - 10మే 1996 ప్రకారం, సెక్షన్ 48 మీడియం ఇన్‌స్ట్రక్షన్‌లో మాతృభాషలో విద్యాబోధన చేయాలి. అల్ప సంఖ్యాక భాష వారు కనీసం పదిమంది ఉంటే సమాంతరంగా ఒక సెక్షన్ ఏర్పాటు చేయాలని తెలియచేస్తుంది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (యాక్ట్ నెం 35/ 2009) సెక్షన్ 29(యఫ్) ప్రకారం విద్యార్థుల మాతృభాషలో బోధన ఉండాలని తెలియచేస్తుంది.***

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంగ్లీషు మీడియం పూర్తిగా అమలు చేయబోతున్న నేపథ్యంలో ఈ అంశంపై వివిధ రకాలుగా చర్చ సాగుతోంది.

సమకాలీన పరిస్థితులు, వాటి ప్రభావాల వల్ల ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. రాజ్యాంగపరంగా, రాజ్యంగ స్ఫూర్తితో ఇప్పటికే అమలులో ఉన్న చట్టాలు ఈ విషయమై ఏమి చెబుతున్నాయనేది కూడా ఈ సందర్భంలో పరిశీలించాల్సిన అంశం.

భారత రాజ్యాంగం ఆర్టికల్– 21 ప్రకారం రాజ్యం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల లోపు గల బాల బాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని తెలుపుతుంది.

రాజ్యంగంలోని పదిహేడవ భాగం మొత్తం అధికార భాషా సంబంధిత అంశాలను వివరిస్తుంది.

ఇందులో..

ఆర్టికల్ 343, 344 లలో రాజ్యాంగం అమలులోకి వచ్చిన అనంతరం 15 సంవత్సరాలు ఇంగ్లీషు అధికారిక భాషగా కొనసాగుతుంది. ఈ క్రమంలోనే అధికారికభాష సంఘం నెలకొల్పి హిందీని అధికార భాషగా ఉపయోగించడానికి సిఫారసులు చేయడం, ఇంగ్లీషు భాషా వినియోగం తగ్గించాలని తెలుపుతుంది.

ఆర్టికల్– 350 ప్రజలు తమ కేంద్ర రాష్ట్ర అధికారుల ముందు తమ సంతోషాలు, బాధలు ఏ భాషలోనైనా రాసి ఇవ్వవచ్చని ఉంది.

350– (ఎ) ప్రకారం బాలబాలికలకు ప్రతి రాష్టంలోను ప్రాథమిక విద్యను మాతృభాషలోనే అందచేయడానికి అవరమైన చర్యలను చేపట్టాలి.

350– (బి) ప్రకారం రాష్ట్రపతి భాషా మైనారిటీ లపై అధ్యయనానికి ప్రత్యేక అధికారిని నియమిస్తారు. ఈ ప్రత్యేక అధికారి రాజ్యాంగ ప్రకారం మైనారిటీల భాష అభివృద్ధికి అందించవలసిన రక్షణలు సరిగా అందుతున్నాయో లేదో సరిచూస్తుంది.

అల్పసంఖ్యాక వర్గాల భాషగురించి రాజ్యాంగం లోని ..

ఆర్టికల్ 29(1) ప్రకారం భారతదేశంలో నివసిస్తున్న పౌరులు ఏ వర్గంలో వారైనా వారి విశిష్ట భాష, లిపి లేదా సంస్కృతి ఉన్నట్లయితే దానిని కాపాడుకొనే హక్కు వారికుంటుంది.

ఆర్టికల్ 30(1), (2) ప్రకారం భాషపరమైన అల్పసంఖ్యాక వర్గీయులు తమకు నచ్చినవిధంగా విద్యాసంస్థలు నెలకొల్పుకొని నిర్వహించుకోవచ్చు. ఆ విద్యా సంస్థలకు ఆర్థిక సహాయం విషయంలో రాజ్యం వివక్ష చూపరాదు అని తెలియచేస్తుంది.

రాజ్యాంగంలోని పై మొత్తం అంశాలను బట్టి ప్రాథమిక విద్య అంటే ఎనిమిదోవ తరగతి వరకు మాతృభాషలో విద్యపొందే హక్కు కల్పిస్తుంది. అల్ప సంఖ్యాక భాషల హక్కులను సంరక్షణ కోసం రాష్ట్రపతి చర్యలు కూడా తీసుకోవచ్చని తెలియచేస్తుంది. జాతీయభాషగా ఇంగ్లీషును తగ్గించి హిందీకి ప్రాధాన్యత ఇవ్వాలని వివరిస్తుంది.

విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. ఎవరు చట్టం చేయాలన్నా రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకనుగుణంగా ఉండాలి. ఇది భావోద్వేగాలకో, జనాభిప్రాయానికో పరిమితమైన

అంశంకాదు. ఏ మార్పులు చేయాలన్నా రాజ్యాంగ సవరణ తప్పని సరి అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ రూల్స్, జి.ఓ యస్ నెం :1188 - 10మే 1996 ప్రకారం, సెక్షన్ 48 మీడియం ఇన్‌స్ట్రక్షన్‌లో మాతృభాషలో విద్యాబోధన చేయాలి. అల్ప సంఖ్యాక భాష వారు కనీసం పదిమంది ఉంటే సమాంతరంగా ఒక సెక్షన్ ఏర్పాటు చేయాలని తెలియచేస్తుంది.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం( యాక్ట్ నెం 35/ 2009) సెక్షన్ 29(యఫ్) ప్రకారం విద్యార్థుల మాతృభాషలో బోధన ఉండాలని తెలియచేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీసుకొన్న ఇంగ్లీషు మాధ్యమ నిర్ణయం ఇక్కడి అధిక సంఖ్యాకులైన తెలుగుభాష పరిస్థితి సమస్యనెదుర్కొనేలా చేస్తుంది. అల్పసంఖ్యాక భాషలు ఇంక లెక్కలో కూడా ఉండవు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికి నచ్చిన ధోరణిలో వాళ్ళు భాషల విషయంగా నిర్ణయాలు తీసుకొంటూ వెళితే అనేక భాషలతో కూడిన, సమాఖ్య వ్యవస్థగా సాగుతున్న భారతదేశంలో ఉత్తరోత్తర సంక్లిష్ట సమస్యలు ఎదురవుతాయి. అందుకే ఈ విషయంగా రాజ్యాంగంలో అనేక జాగ్రత్తలు తీసుకొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమిళం, కన్నడ, ఒరియా, ఉర్దూ తదితర భాషామాధ్యమాలలో కూడా ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాలలు ప్రస్తుతం నడుస్తున్నాయి. అల్పసంఖ్యాక వర్గాల భాషాహక్కుల ప్రకారం వారికి తమ మాతృభాషలో విద్య పొందే హక్కు ప్రశ్నార్థకంగా మారుతుంది. అనేక ఇతర రాష్ట్రాలలో తెలుగు మాధ్యమ పాఠశాలలు నడుస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో 1956లో మూడువేల తెలుగు పాఠశాలలు ఉండేవి. 2006 క్రితం వరకు 505 ప్రైమరీ, మిడిల్ పాఠశాలలు, 40 హైస్కూలులు, 35 హైస్కూల్ సెకండరీ పాఠశాలలు మొత్తం 580 పాఠశాలలు నడిచేవి. తరువాత కాలంలో తెలుగు మాధ్యమం తొలగిస్తూ కేవలం తమిళం మీడియంలో చదవాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. తెలుగు పాఠశాలలు తమిళ, ఆంగ్లంలోకి మారుతూ వచ్చాయి. పరీక్షలు లేకుండా కేవలం ఐచ్చిక అంశంగా తెలుగును చదువుకోండని మాత్రమే అవకాశం ఇస్తున్నారు. తెలుగు మాధ్యమం కోసం అక్కడి తెలుగు భాషా సంఘాలు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం వివాదం కొనసాగుతోంది. దాదాపు మూడువందల పాఠశాలలలో తెలుగు మీడియం ఇప్పటికీ నడుస్తుంది.

కర్ణాటక రాష్ట్రం 2010-2011 నాటి వివరాల ప్రకారం 33 లోయర్ ప్రైమరీ పాఠశాలలు ,52 అప్పర్ ప్రైమరీ , 14 సెకండరీ పాఠశాలలు మొత్తం 99 పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికీ తెలుగు మీడియంలో కొనసాగుతుంది. ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలోను తెలుగు మాధ్యమం అక్కడి విద్యార్థులకు అందుతోంది. ఈ విధంగా దేశమంతట కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాజ్యంగ స్ఫూర్తితో మాతృభాషా మాధ్యమాలు పక్క రాష్ట్రాలలోను అమలవుతున్నాయి. ప్రస్తుతం తెలుగు మాతృభాష గల కోటానుకోట్ల మంది ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాతృభాషలో చదువుకోవడాన్ని నిరాకరిస్తే రేపు ఇతర రాష్టాలలోని తెలుగువారు కూడా తెలుగు మాధ్యమంలో చదువుకొనే హక్కు నిరాకరించబడే పరిస్థితులు ఎదురవుతాయి. అక్కడి ప్రభుత్వాలకు ఆ ప్రాంతంలోని తెలుగువారు శాశ్వతంగా భాషకు దూరమయ్యే పరిస్థితులు వస్తాయి. ఇక్కడ ఇంగ్లీషు ప్రధానమైనట్లే అక్కడ వారికి నచ్చిన ఇంకో భాషలో చదవమని నిర్బంధం చేయవచ్చు. ఈ పరిణామాల కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ దేశంలో ఇప్పటికి ఉన్నసమస్యలే కాకుండా భాషపరమైన సమస్యలు కూడా అధికమవుతాయి.

దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో ఇలాంటి ఉల్లంఘనలు దృష్టిలో ఉంచుకొనే నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదాలో ఒకటి నుండి ఎనిమిది వరకు మాతృభాషలో విద్యావిధానం అమలుకు కేంద్రం చర్యలు తీసుకోబోతోంది. దేశవ్యాప్తంగా త్రిభాష సూత్రం అమలుచేసి ఒకే విధానం అమలు జరుగుతోంది.

ప్రథమభాషగా మాతృభాష, ద్వితీయభాషగా జాతీయభాష, తృతీయ భాషగా ఇంగ్లీషు ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉంది. మాధ్యమ బాగా మాతృభాష ఇన్నాళ్ళు సాగింది. గత రెండు దశాబ్దాల కాలంగా రాష్ట్రంలో వ్యాపారధోరణిలో ప్రవేశించిన ప్రయివేటు పాఠశాలలకు రాజ్యాంగ విరుద్ధంగా ఇంగ్లీషు మీడియంలో అనుమతులిచ్చారు. అది తీవ్ర స్థాయికి చేరింది. ఏకంగా ప్రభుత్వ పాఠశాలలనే ఇంగ్లీషు మీడియంలో కొనసాగే వరకు వచ్చింది. సమస్య ప్రారంభమైన చోట పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలి. సమస్యలో ఒక పక్షంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావడం అసమంజసంగా అనిపిస్తుంది.

విద్య యొక్క లక్ష్యం విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించాలి.

## వ్యావహారిక భాష ద్వారా విద్య - వివేకానంద

మన దేశంలో ప్రాచీన కాలం నుండి విద్యాభ్యాసం సంస్కృత భాషలో జరిగినందువలన విద్యావంతులైన వారి భాషకు వాడుక భాషకు విపరీతమైన అంతరం ఏర్పడింది. కాని బుద్ధుడు మొదలు చైతన్య, రామకృష్ణుల వరకు ప్రపంచాన్ని ఉద్ధరించటానికి వచ్చిన మహామహులందరూ వారి వారి బోధనలను వాడుక భాషలోనే చేశారు. పాండిత్యం ఎలాగూ ఉత్కృష్టమైనదే. కాని పాండిత్య ప్రకర్ష క్లిష్టమైన, సర్వులకు అర్థంగాని, కృతకమైన గ్రాంథిక భాషలోనే సాధ్యమా? వ్యావహారిక భాషలో కళాత్మకతకు స్థానం లేదా? సహజమైన వ్యవహారిక భాష స్థానంలో అసహజమైన భాషను సృష్టించి సాధించగల ప్రయోజనమేముంది? విద్యా సంబంధమైన పరిశోధనలను ఇంట్లో మాట్లాడుకునే వాడుక భాషలో నిర్వహించలేమా? అలాంటప్పుడు వ్రాయటానికి పూనుకొనినప్పుడు అస్వాభావికమైన, దుర్లభమైన భాషను ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఏముంది? నీవు తత్వశాస్త్రాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని మనస్సులో ఒక భాషలో ఆలోచిస్తున్నావు; అదే భాషలో ఇతరులతో చర్చావేదికల్లో చర్చిస్తున్నావు. వాదిస్తున్నావు. కాని, తత్వశాస్త్రాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని వ్రాతరూపంలో ఇమిడ్చేటప్పుడు ఆ భాష పనికి రావటం లేదు. నీ మనస్సుతో ఆలోచించేటప్పుడు, ఇతరులతో విషయాల్ని విశ్లేషించేటప్పుడు, భిన్నమైన భాషతో వ్యవహరిస్తే ఆ ఆలోచనలు, సమర్థనలు ఎలా సాధ్యమౌతాయి. మన భావాల్ని సహజంగా వ్యక్తీకరించాలన్నా, మన కోపతాపాల్ని, విషాదాన్ని, ఆప్యాయతల్ని ఇతరులకు వ్యక్తం చేయాలన్నా వాడుక భాష ఉపయుక్తమైనట్లు మరొకటి కాదు. మనం ఆ భాషనే, ఆ పద్ధతిలోనే మాట్లాడటానికి అంకితం కావాలి. వాడుక భాషలో వున్న సౌలభ్యత, సంక్షిప్తత, సొంపు ఏ ఇతర కృత్రిమ భాషలకు రావు. భాష ఒక కల్తీ లేని ఉక్కులా రూపొందాలి. ఆ ఉక్కును ఎటువంచినా, త్రిప్పినా దాని స్వరూపం మారదు. అది ఒక్క దెబ్బలో, మొక్కవోకుండా రాతిని రెండు ముక్కలు చేస్తుంది. మన భాష సంస్కృత భాషను అనుకరించుటతో కృత్రిమంగా తయారవుతోంది. భాష జాతి యొక్క ప్రగతిని వివరించే ముఖ్యమైన సాధనం, సూచిక అని మరువరాదు. భావాల్ని ప్రకటించడానికి భాష సాధనం. జన జీవనంలో ఆలోచనలదే ప్రధాన పాత్ర. వాటి తర్వాతనే భాష. భాషగాని, కళగాని, సంగీతంగాని భావరహితమైతే జీవం వుండదు; నిష్ప్రయోజనమౌతుంది. జాతి జీవనం పరిపుష్టతను సంతరించుకుంటే, భాష, కళ, సంగీతం కూడా అప్రయత్నంగానే భావపరంగాను, చేతనత్వంలోను మరింత సౌష్టవాన్ని సమకూర్చుకుంటాయి. మనం నిత్యం వాడే వాడుక భాషలోని రెండు మంచి మాటలు వెలువరించే అర్థాన్ని రెండు వేల వర్ణనల కూర్పు కూడా ప్రకటించలేదు. ఒక ఉపాధ్యాయుని గొప్పతనం ఆయన వాడే భాషాసౌలభ్యం మీద ఆధారపడి వుంటుంది. నేను మా గురువులు ఉపయోగించే అర్థసహితమైన వాడుక భాషనే ఆదర్శ భాషగా పరిగణిస్తాను. ♦

కేవలం ఉపాధి యంత్రం మాత్రం కాదు. విద్య ఉపాధి అవకాశాలకు ఆధారమని ప్రయివేటు పాఠశాలలు, పాలక వర్గాలు, కొందరు తల్లిదండ్రులు భావించవచ్చు. అందుకోసం ఏ నిర్ణయమైన అమలుపరచి అనుసరిస్తామంటే ప్రస్తుత భారత రాజ్యాంగం మాత్రం అందుకు అనుమతించదు.

ఇంగ్లీషు మీడియం అవసరం, తప్పనిసరి అయితే అది కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అమలు కాకుండా దానిపై దేశమంతటా చర్చజరగాలి. మిగతా రాష్ట్రాల ఆలోచనలు వినాలి. ప్రాథమిక స్థాయి మాధ్యమభాషపై సంబంధిత నిపుణులతో అధ్యయనం చేయించాలి. రాజ్యాంగంలో ఆర్టికల్ 350(ఎ, బి) లకు సవరణలు జరగాలి. అప్పటిదాకా ప్రస్తుతం ఉన్న నియమాల ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలలో ప్రాథమిక విద్య మాతృభాషలో అందే విధంగా చర్యలు తీసుకోవాలి. చట్టాలలోని లొసుగుల ఆధారంగా ప్రయివేటు పాఠశాలలకు ఇంగ్లీషు మీడియం అనుమతులను ఇవ్వడాన్ని అరికట్టాలి. ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలి.

తృతీయ భాషగా, ఒక సబ్జెక్టుగా ఉన్న ఇంగ్లీషును ఎలా ఆధునిక పరిస్థితులకు తగ్గట్టుగా మెరుగుపరుచుకోవాలో ఆలోచించాలి. ఎనిమిది సంవత్సరాలు ఒక సబ్జెక్ట్ గా ఇంగ్లీషును శాస్త్రీయంగా అవసరమైనంత నేర్చుకోవడం పై దృష్టి పెడదాం.

ఒక సబ్జెక్ట్ గా ఇంగ్లీష్ ను చదివి ఆ భాషలో నైపుణ్యం తోపాటు, వివిధ రంగాలలో గొప్పస్థాయికి ఎదిగినవారు మన కళ్ళముందు చాలా మంది ఉన్నారు. పూర్తిగా ఇంగ్లీషు మీడియంలో చదివిన వేలాదిమంది నిరుద్యోగులు కూడా మనకళ్ళముందే ఉన్నారు. మాతృభాషతో జీవిద్దాం. అవసరమైనంత ఆంగ్లం వినియోగిద్దాం. ♦

# రాజ భాష రగడ

**- తెలకపల్లి రవి**

***దక్షిణాదిన తెలుగు వారికి ఇతర భాషలతో దోస్తీ ఎక్కువ. తమిళనాడులో ఒక విధంగా, ఉత్తరాదిన మరో విధంగా రెండు భాషలే అమలు కాగా మనం త్రిభాషాసూత్రం కింద రెండు విధాల నష్టపోయామనే భావన చాలామందిలో వుంది. ఇప్పుడు కూడా యెద్యూరప్ప, పినరయి విజయన్‌లు హిందీ రుద్దడాన్ని ఖండించారు గాని తెలుగు ముఖ్యమంత్రులు ఏ భాషలోనూ స్పందించలేదు. లోగడ ప్రాచీన భాష హోదాపై వేటూరి సుందరరామమూర్తి పురస్కారం తిరస్కరించారు. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు వ్యతిరేకించారు గాని తెలుగు స్టార్‌లు మాట్లాడలేదు. ఈ సందర్భంలో రెండుగ వెలుగు జాతి మనది అని నిండుగా పాడుకునే తెలుగు నేతల మౌనం సమర్థనీయం కాదు.***

యెద్యూరప్ప, పినరయి విజయన్‌లు హిందీ రుద్దడాన్ని ఖండించారు గాని తెలుగు ముఖ్య మంత్రులు ఏ భాషలోనూ స్పందించలేదు. లోగడ ప్రాచీన భాష హోదా పై వేటూరి సుందరరామమూర్తి పురస్కారం తిరస్కరించారు. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు వ్యతిరేకించారు గాని తెలుగు స్టార్‌లు మాట్లాడలేదు. ఈ సందర్భంలో రెండుగ వెలుగు జాతి మనది అని నిండుగా పాడుకునే తెలుగు నేతల మౌనం సమర్థనీయం కాదు.

అనాల్సింది అనడం ఆపైన సన్నాయి నొక్కులూ, సమర్థనలూ, సవరణలూ బిజెపి, ఆరెస్సెస్ పరివారానికి బాగా అలవాటైన విద్య. దేశ ప్రజలందరూ హిందీ నేర్చుకోవాలని తాను చెప్పిన మాట అపార్థం చేసుకున్నారని బిజెపి అధ్యక్షుడు హోం మంత్రి అమిత్ షా చెప్పడం ఆ కోవలోదే. అన్నది ఏమైనా హిందీ – హిందూ – హిందూస్థాన్ అన్న బిజెపి రాజకీయ వరుస ఎవరికి తెలియనిది? పాముల పుట్టలోంచి ఒకో పామును తీసినట్టు రెండవ సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అసలు సిసలు వ్యూహాల అమలు ప్రారంభించిందని బుధవారంనాడు విజయవాడలో ఈ విషయమై జరిగిన సదస్సులో మిత్రులు అన్న మాట. హిందీయేతర రాష్ట్రాలలో విద్యార్థులు ఆ భాష తప్పక నేర్చుకోవాలని విద్యారంగ ముసాయిదాలో చెప్పి వెనక్కు తీసుకున్నారు. ఆ తదుపరి తలాక్, 370, అయోధ్య రామాలయం వంటి విషయాలతో కాలంగడిపి మళ్లీ హిందీ పాచిక తీశారు.

హిందీ దివస్ ఆ భాషది గనక నాలుగు మంచి మాటలు చెప్పివుంటే అదో తీరు. మిగిలిన భారతీయ భాషలకు దివసం పెట్టేరీతిలో మాట్లాడ్డం వేరు. స్వాతంత్ర్య పోరాటానికి హిందీయే అనుసంధానకర్త వంటిదన్నారు. ఇప్పుడు కూడా దేశాన్ని ఐక్యం చేసే శక్తి హిందీకే వుందని వాక్రుచ్చారు. ఇవి రెండూ కొండంత అవాస్తవాలు. ఉద్దేశపూర్వక వక్రీకరణలు. ప్రధాని మోదీ తర్వాత అంతటి వారుగా వున్న వ్యక్తి నోట వచ్చాయి గనక వీటిని భావి సంకేతాలుగానూ చూడక తప్పదు. అమిత్ షా సవరణ కూడా మౌలికంగా అదే సందేశాన్ని పునరుద్ఘాటిస్తున్నది.

మొదటగా చరిత్ర. స్వాతంత్ర్య పోరాట కాలంలో హిందీ అనుసంధాన భాషగా ప్రధాన పాత్ర వహించిన మాట నిజం కాదు. అప్పటికీ ఇప్పటికీ కూడా దానికా శక్తి లేదు. హిందీ భాష పదజాలం మాట అటుంచి లిపి కూడా స్వంతం కాదు. ఉర్దూ, సంస్కృతం, పంజాబీల కలయిక నుంచి పుట్టిన హిందీని దేవనాగరి లిపిలోనూ, అరబిక్ లాటి ఉర్దూ లిపిలోనూ రాయొచ్చు. అచ్చమైన భారతీయ భాష ఉర్దూ, హిందీ కన్నా గంభీరమైందని తెలిసిన వారు చెబుతారు. తమిళం, తెలుగు వంటి దక్షిణాది భాషలు హిందీ కన్నా వేల సంవత్సరాల ముందే అభివృద్ధి చెందాయి. హిందీలో అంటే అవధ్‌లో తులసీదాస్ రామచరిత మానస్ వచ్చింది 15, 16 శతాబ్దాలలో. తెలుగులో మహాభారత రచన అప్పటికి అయిదు వందల ఏళ్ల కిందటే జరిగింది! తమిళంలో తొల్కాపియం ఇంకా ముందు. లక్నో, పాట్నా, భోపాల్, ఢిల్లీ, ముంబాయి, ఇలా వివిధ చోట్ల మాట్లాడే హిందీ ఒకటేనా అని దక్కనీ నిలయమైన హైదరాబాద్ నగర వాసులు అడిగితే సమాధానం కష్టం. ఈ భాషా వైవిధ్య వైభవం భారత దేశ ఘనతే తప్ప కొరత ఎంత మాత్రం కాదు. దాంతోనే భాషా సమస్యలూ జత. చెన్నపట్టణం 35 మైళ్లు దక్షిణాన వుంటే తమిళం, 35 మైళ్లు ఉత్తరాన వుంటే తెలుగు మరింత బాగా అభివృద్ధి చెందేవని గురజాడ అప్పారావు ఇప్పటికి 110 ఏళ్ల ముందే 1908 సెప్టెంబరులో రాశారు.

1907లోనే చిలకమర్తి లక్ష్మీ నరసింహం భరత ఖండంబు

చక్కని పాడియావు పద్యంతో జాతీయోద్యమ సాహిత్యానికి వూపిరులూదారు. కాస్త అటూ ఇటూగా వంగ దేశ విభజన ఉద్యమంతో వందేమాతరం స్వాతంత్ర్యోద్యమ శంఖారావమైంది. తొలి వైతాళికులు లాల్ - బాల్ - పాల్ త్రయంలో ఎవరూ హిందీవారు కాదు! స్వరాజ్యం నా జన్మహక్కు అని తిలక్ అన్నది మరాఠాలో అయితే లాలాలజపతి రాయ్ శిష్యుడైన గాంధీజీ గుజరాతీ యువ శిష్యుడైన పంజాబీ భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అన్నది ఉర్దూలో. క్విట్ ఇండియా వరకూ మన పిలుపులు చాలా వరకూ ఇంగ్లీషులోనే ప్రసిద్ధి. వందేమాతరం నుంచి ఆంధ్రోద్యమం వరకూ ఏదీ హిందీలో కాదు. భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనను కాంగ్రెస్ ఆమోదించిన తర్వాతనే స్వాతంత్ర్యోద్యమం ఉధృతమైంది. రాజ్యాంగ పరిషత్తులో అత్యంత సుదీర్ఘ చర్చ రాష్ట్రాల పొందిక,భాషా విధానంపైనే జరిగింది. జాతీయ భాషగా హిందీని నిర్ణయించాలని అప్పట్లో హిందీవాలాలుగా వర్ణించబడిన ఒక వర్గం ఎన్ని తంటాలు పడినా ప్రతిష్టంభనలు సృష్టించినా వారి పంతం నెరవేరలేదు.

(దేన్ని హిందీగా తీసుకోవాలన్నదే తేలక ఒక్క ఓటు తేడాతో ఆమోదం పొందింది.) చివరకు 343వ అధికరణం దేవనాగరి లిపిలో హిందీని అధికార భాషగా నిర్ణయిస్తూ అంకెలు మాత్రం అంతర్జాతీయంగా తెలిసిన భారతీయ అంకెలే వాడాలని, 8వ షెడ్యూలులో పేర్కొన్న భాషలను కూడా దేశ భాషలుగా పరిగణిం చాలని నిర్దేశించింది. కేంద్ర ఉత్తర్వులు, హిందీయేతర రాష్ట్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఇంగ్లీషును 15 ఏళ్ల పాటు అనుసంధాన భాషగా కొనసాగించాలనీ, తర్వాత కాలంలో రాష్ట్రపతి దానిపై నిర్ణయం తీసుకోవచ్చని కూడా అధికారమిచ్చింది. కనుక అమిత్ షా చెబుతున్నట్టు హిందీ ఏకీకృత శక్తిగా లేదని రాజ్యాంగ రూపకల్పన దశలోనే తేలింది. తమాషా ఏమంటే కశ్మీర్ అనగానే శ్యాంప్రసాద్ ముఖర్జీ పేరు జపించే బిజెపి నేతలు భాష విషయంలో ఆయన హిందీ ఆధిపత్యం వద్దని రాజ్యాంగ సభలో చెప్పారని తెలుసుకోవాలి.

హిందీయేతర ప్రజలలో అపార్థాలు కలిగించవద్దని రాజ్యాంగ సభలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ 70 ఏళ్ల కిందటే చెప్పారు. ఆ సందర్భంలో నెహ్రూ మాట్లాడుతూ హిందీని చాలా చాలా నెమ్మదిగానే అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కాని 15 ఏళ్ల వ్యవధి అయిపోయిందని 1965 రిపబ్లిక్ డే నుంచి హిందీని నిర్బంధం చేయాలని కేంద్రం ఆదేశాలు ఇస్తే అనర్థం చెలరేగింది. తమిళనాడులో యాభై మంది కాల్పులలో మరణించేవరకూ పరిస్థితి వెళ్లింది. 1969 మరోసారి ఈ తరహా ఉద్యమం చూసింది. 1966లో అధికార భాషా చట్టం, 1969లో తెలుగు అకాడమీ వంటివి ఏర్పడినా దేశీయ భాషల సమగ్రాభివృద్ధికి కార్పొరేట్ బళ్ల ఇంగ్లీషు వ్యామోహం పెనుశాపమైంది. ఈ లోగా దేశంలో పెరిగిన మతతత్వ రాజకీయాల కారణంగా ఉర్దూ వంటివాటికి మతం రంగు పులమడం మరో జటిల సమస్యగా మారింది. దక్షిణాదిన తెలుగు వారికి ఇతర భాషలతో దోస్తీ ఎక్కువ. తమిళనాడులో ఒక విధంగా, ఉత్తరాదిన మరో విధంగా రెండు భాషలే అమలు కాగా మనం త్రిభాషాసూత్రం కింద రెండు విధాల నష్టపోయాయనే భావన చాలామందిలో వుంది. ఇప్పుడు కూడా యెద్యూరప్ప, పినరాయి విజయన్‌లు హిందీ రుద్దడాన్ని ఖండించారు గాని తెలుగు ముఖ్యమంత్రులు ఏ భాషలోనూ స్పందించలేదు. లోగడ ప్రాచీన భాష హోదాపై వేటూరి సుందరరామమూర్తి పురస్కారం తిరస్కరించారు. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు వ్యతిరేకించారు గాని తెలుగు స్టార్‌లు మాట్లాడలేదు. ఈ సందర్భంలో రెండుగ వెలుగు జాతి మనది అని నిండుగా పాడుకునే తెలుగు నేతల మౌనం సమర్థనీయం కాదు.

ఒకే దేశం ఒకే ప్రజ ఒకే మతం ఒకే పన్ను ఒకే ఎన్నిక ఒకే పార్టీ లాంటి మాటలు అనేకత్వానికి నిలయమైన ఈ దేశానికి సరిపడవు. ఇంగ్లీషుకు వ్యతిరేకంగానే హిందీని రెండవ భాషగా నేర్చుకోవాలని తాను చెప్పానని అమిత్ షా చేస్తున్న సవరణ సారం ఇంగ్లీషును గాక దేశ భాషలనే దెబ్బతీస్తుందని అర్థమవుతుందా? హిందీపై వ్యతిరేకత వుండనవసరం లేదు గాని దేశ జనాభాలో సగం మంది కూడా మాట్లాడని - ఇంతకాలం ఇచ్చిన ప్రోత్సాహాల తర్వాత కూడా పెద్దగా ఆధునికం కాని - ఒక అసంపూర్ణమైన హిందీ విశాల భారతావనికి ఏకైక రాజభాష కాజాలదనే వాస్తవం తలకెక్కుతుందా? భిన్నత్వంలో ఏకత్వాన్ని గౌరవించని ఏకీకృత పెత్తనం ఛిన్నాభిన్నత్వానికి దారితీస్తుందనే పరమసత్యం బోధపడుతుందా? 'పదవీ వ్యామోహాలు కులమత భేదాలు భాషా ద్వేషాలు చెలరేగే నేడు' అని మహాకవి చేసిన హెచ్చరికను 8వ షెడ్యూలులోని భాషలన్నీ కలసి వినిపించాల్సిన తరుణమది. మాతృభాషతో పాటు భాతృ భాషలు, భుక్తి భాషలు తప్ప దానికన్నా ఎప్పటికీ ఏవీ ఎక్కువ కాదు, ఎక్కువీ కాదు.

***(20-09-201 ఆంధ్రజ్యోతి)*** ♦

(ప్రసిద్ధ లేఖ)

# ఓడిపోయినప్పుడు చక్కగా దాన్ని అంగీకరించటం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించటం.. నేర్పండి!



**- అబ్రహాం లింకన్**

"మా అబ్బాయి ఇవాళే మొదటిసారి స్కూలుకి వస్తున్నాడు. కొంతకాలం అక్కడ అంతా వాడికి వింతగానూ కొత్తగానూ ఉండబోతోంది. అందుకే వాడితో మీరు కొంచెం సున్నితంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను. ఈ సాహసకృత్యం వాణ్ణి సప్తసముద్రాలూ దాటి వెళ్ళేందుకు సాయపడవచ్చు. ఆ సాహసాల్లో యుద్ధాలూ, విషాదాలూ, దుఃఖాలూ వాడికి అనుభవంలోకిరావచ్చు. అలాంటి జీవితంలో వాడికి నమ్మకం, ప్రేమ, ధైర్యం తోడుగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుచేత, దయచేసి మీరు దగ్గరుండి ప్రేమతో వాడు నేర్చుకోవలసినవన్నీ నేర్పిస్తారా? వీలైతే అవన్నీ సున్నితంగా నేర్పగలరా? ఒక మిత్రుడుంటే ఒక శత్రువు కూడా ఉంటాడని నేర్పండి. అందరు మనుషులూ న్యాయంగా ఉండరనీ, అందరూ సత్యసంధులు కారనీ వాడికి తెలియాలి. ఒక దుష్టుడున్న చోట ఒక వీరుడు కూడా ఉంటాడనీ, జిత్తులమారి రాజకీయ నేత ఉండే చోటే అంకితభావంతో పనిచేసే నేత కూడా ఉంటాడనీ చెప్పండి. అప్పనంగా దొరికిన ఒక డాలరు కన్నా సొంతంగా సంపాదించుకున్న పది సెంట్లు ఎక్కువ విలువైనవని నేర్పండి. స్కూల్లో మోసం చేసి గెలవటం కన్నా ఫెయిలవటం ఎక్కువ గౌరవంగా ఉంటుందని నేర్పండి. ఓడిపోయినప్పుడు చక్కగా దాన్ని అంగీకరించటం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించటం,.. నేర్పండి. అందరితో మృదువుగా ప్రవర్తించమనీ, కఠినంగా ఉన్న వాళ్ళతో కఠినంగా ఉండమనీ నేర్పండి. అసూయకు వాణ్ణి దూరంగా ఉంచగలిగితే బావుంటుంది. చప్పుడు చెయ్యకుండా నవ్వటం నేర్పండి. వాడు విచారంగా ఉన్నప్పుడు నవ్వటం నేర్పగలిగితే నేర్పండి. కన్నీళ్ళు కార్చటం అవమానమేమీ కాదని నేర్పండి. ఓటమిలో కూడా కీర్తి ప్రతిష్టలు ఉండవచ్చనీ, గెలుపులో నిరాశ ఉండవచ్చనీ నేర్పండి. పుస్తకాలు ఎంత అద్భుతంగా ఉంటాయో నేర్పండి. అందరూ వాడి ఆలోచనలు తప్పని అన్నప్పటికీ, వాటిని తను మట్టుకు గౌరవించటం నేర్పండి. అందరూ దేన్నో అనుసరిస్తున్నా, తను అలా చెయ్యకుండా ఉండే మనోబలాన్ని మా అబ్బాయికి నేర్పండి. అందరు చెప్పేదీ వినమనీ, సత్యమనే జల్లెడతో వడబోసి మంచిని మాత్రమే గ్రహించమనీ చెప్పండి. తన ప్రతిభనీ, మేధస్సునీ ఎక్కువ ధర చెల్లించేవారికే అమ్మమని చెప్పండి కానీ తన హృదయానికీ, ఆత్మకీ వెల నిర్ణయించవద్దని నేర్పించండి. అసహనం ప్రదర్శించే ధైర్యాన్నీ, ధైర్యంగా ఉండేందుకు ఓర్పునీ కలిగి ఉండనివ్వండి. ఉదాత్తమైన ఆత్మవిశ్వాసం ఉండాలనీ,అప్పుడే మానవాళి మీదా దేవుడిమీదా వాడికి ఉదాత్తమైన విశ్వాసం ఏర్పడగలదనీ నేర్పించండి. మీకు వీలైనంత వరకూ ప్రయత్నించి వాడిని మంచి పిల్లవాడుగా మలచండి. మీరు మలచగలరు. ఇది మా నమ్మకం."

*తెలుగు: శాంత సుందరి*

♦

# ఔరంగజేబు తన టీచర్‌కి రాసిన ప్రసిద్ధ ఉత్తరం



*ఎన్నో బాధ్యతాయుతమైన విషయాలను పట్టించుకోవలసిన రాజవంశానికి చెందిన మాకు, బాల్యదశలో సమయమెంతో విలువైనది. మాకున్న పరిమిత సమయంలో వివిధ విషయాలు నేర్చుకోవడం అవసరం. సుదీర్ఘకాలం పాటు, విసుగు పుట్టించే విధంగా అరబ్బీ భాషను నేర్చడంలో మీరు నా సమయమెంతో వృధాచేసారు. ఆ అరబ్బీ భాషాభ్యసనం నా జీవితంలో ఒక విషాదకరమైన ఘట్టం. అది ఒక పనికిరాని కార్యక్రమం. ఎంతో అయిష్టతతో కొనసాగిన కార్యక్రమం అది. అది నా మేధస్సును మొద్దుబార్చింది కూడా.*

1. 'అయ్యా! నా నుంచి మీరు ఏం ఆశిస్తున్నారు? ఒక ప్రముఖ ముస్లిం ప్రభువుగా నా ఆస్థానంలోకి మిమ్ములను స్వీకరించవలసిందిగా మీరు అడగటంలో హేతుబద్ధత ఏమైనా వుందా? నాకు మీరు చదువు నేర్పవలసిన పద్ధతిలో నేర్పివుంటే, పై కోరిక న్యాయబద్ధంగానే వుండేది. మంచి విద్యను, బోధనను పొందిన విద్యార్థి తన గురువును తన తండ్రిని గౌరవించేంతగా గౌరవించాలి.

2. "కాని మీరు నాకు నేర్పిందేమిటి? ముందుగా యూరప్ అంటే పోర్చుగల్ అనే చిన్న ద్వీపమనీ, ఆ దేశపు రాజే గొప్పవాడనీ, ఆయన తర్వాత స్థానం హాలెండ్ రాజుదనీ, అటు తర్వాత ఇంగ్లండ్ రాజుదనీ నేర్పారు. ఫ్రాన్సు, స్పెయిన్ దేశపు రాజులు మన దేశంలోని చిన్నచిన్న రాజులవంటి వారనీ, హిందుస్థాన్ రాజులు వీరందరి కంటే గొప్పవారనీ, ప్రపంచాన్నే జయించిన చక్రవర్తులనీ, హిందుస్థాన్ రాజుల పేర్లు వింటేనే పర్షియా, ఉజ్బెక్, తార్తార్, చైనా, పశ్చిమచైనా, పెగు, మచ్చినా రాజులు గజగజ వణికి పోతుంటారని చెప్పారు. ఆహా! ఎంత ప్రశంసనీయమైన భూగోళశాస్త్రం నేర్పారండీ మీరు! దీనికి బదులుగా మీరు నాకు ప్రపంచంలో వున్న వివిధ దేశాల గురించీ, వాటి వైవిధ్యాల గురించీ నేర్పి వుండాల్సింది. ఆయా దేశాల, రాజుల బలాబలాలూ, వారి చరిత్రా, వారి అభివృద్ధీ, అభ్యుదయమూ, పతనమూ, ఏయే ప్రమాదాల వల్ల లేక తప్పిదాల వల్ల ఆయా సామ్రాజ్యాలలో, రాజ్యాలలో మహత్తరమైన మార్పులు, విప్లవాలు వచ్చాయో - ఇవన్నీ మీరు నాకు నేర్పించి వుండాల్సింది. మొగల్ సామ్రాజ్య సంస్థాపకులైన ప్రముఖుల గురించి మీ నుంచి నేను ఏమీ నేర్చుకోలేదు. వారి జీవిత చరిత్రలు మీరు నాకు బోధించలేదు. మహత్తర విజయాలు సాధించటానికి వారు అనుసరించిన విధానాలు, వాటి క్రమం గురించి మీరు నాకు నేర్పలేదు.

3. "నేను అరేబియన్ భాషను చదివేట్లు, రాయగల్గేట్లు చేయాలని మీరు అనుకున్నారు. పది పన్నెండేళ్ళ పాటు శ్రమిస్తేగాని పరిపూర్ణత సాధించలేని ఆ భాష నేర్పడానికి మీరు నా సమయమెంతో వృధా చేశారు. మీ ఊహలో ఒక రాజు కొడుకు గొప్ప భాషావేత్త, వ్యాకరణ శాస్త్రవేత్త అయితే అదొక గొప్ప కాబోలు! తన మాతృభాషనూ, ప్రజల భాషను, పొరుగుభాషను నేర్చుకోకుండా ఇతర భాషలు, విదేశీభాషలు నేర్చుకోవడమనేది గౌరవాన్నిస్తుంది కాబోలు! నిజానికి ఆ భాషలు అతనికి అవసరం లేదు. ఎన్నో బాధ్యతాయుతమైన విషయాలను పట్టించుకోవలసిన రాజవంశానికి చెందిన మాకు, బాల్యదశలో సమయమెంతో విలువైనది. మాకున్న పరిమిత సమయంలో వివిధ విషయాలు నేర్చుకోవడం అవసరం. సుదీర్ఘకాలం పాటు, విసుగు పుట్టించే విధంగా అరబ్బీ భాషను నేర్చడంలో మీరు నా సమయమెంతో వృధాచేసారు. ఆ అరబ్బీ భాషాభ్యసనం నా జీవితంలో ఒక విషాదకరమైన ఘట్టం. అది ఒక పనికిరాని కార్యక్రమం. ఎంతో అయిష్టతతో కొనసాగిన కార్యక్రమం అది. అది నా మేధస్సును మొద్దుబార్చింది కూడా. (పర్షియన్ ఆనాటి రాజభాష-అను.)

**ఆసియా దేశాల భాషా సదస్సు:** యునెస్కో, మాషిడోలు యూనివర్శిటీ సంయుక్తంగా నిర్వహించిన ఆసియా దేశాల సదస్సులో వ్యక్తమైన అభిప్రాయాల సారాంశం ఏమిటంటే "ప్రాథమిక విద్యను మాతృభాషలో చదివిన విద్యార్థులు ఆ తర్వాత ఏ మాధ్యమంలో చదివినా ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన వారికంటే ఎక్కువ నైపుణ్యాలను చూపిస్తారని" అభిప్రాయపడింది.

**పంజాబు నిపుణుల కమిటీ:** పంజాబ్ ప్రభుత్వం, ప్రాథమిక విద్యలో ఆంగ్లాన్ని ఏ స్థాయిలో నేర్పించాలనే విషయం మీద ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ సభ్యులు, మొదట మాతృభాష చదవటం, రాయటం వచ్చాకే ఆంగ్లభాషకు పరిచయం చెయ్యాలని అభిప్రాయపడ్డారు.

4. "సక్రమమైన దారిలో నడిచిన బాల్యదశ ఎన్నో ఆనందదాయకమైన జ్ఞాపకాలతో నిండివుంటుందని, ఎన్నో వేల మంచి పద్ధతులనూ, విషయాలనూ నేర్చుకునే శక్తి కలిగి వుంటుందనీ, వాటన్నింటి ప్రభావం మనిషి జీవితంపై వుంటుందనీ మానసికంగా అతడు ఎన్నో ఉత్కృష్ట కార్యక్రమాలు చేపట్టగలడనీ మీకు తెలియదా! చట్టాలు, ప్రార్థనలు, శాస్త్రాలు – ఇవన్నీ అరబిక్ భాషలో కాకుండా మన మాతృభాషలో నేర్చుకోకూడదా?

5. "మీరు నా తండ్రి షాజహానుతో నాకు తత్వశాస్త్రాన్ని బోధిస్తానని చెప్పారు. నాకు బాగా జ్ఞాపకం వుంది. ఎన్నో ఏళ్ళపాటు నా మనసును సంతృప్తిపరచలేని వివిధ విషయాలపై మీరు నాకు మిడిమిడి జ్ఞానాన్ని అందించారు. అదంతా మానవ సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడదని ఊహాత్మకమైన పనికిరాని భావనలే. వాటిని అర్థం చేసుకోవడం చాలా కష్టం... మరిచిపోవడం చాలా తేలిక.

6. "ఆ రకమైన తత్వశాస్త్ర విద్య ఎంత కాలం నేర్పారో చెప్పలేను. తెలివిగలవారిని కూడా ఆశ్చర్యపరచి గందరగోళ పరిచే అనాగరికమైన, వికృతమైన పదసముదాయం మాత్రమే మీరు నేర్పినదానిలో ప్రస్తుతం గుర్తున్నాయి. మీలాంటి అజ్ఞానాహంకారం గలవారు, తమ దుర్గుణాలను కప్పిపుచ్చుకోవడానికి అలాంటి పదాలను సృష్టించి వుంటారు. ఆ పదాల పటాటోపం చూసి – మీకు ఎంతో తెలుసు, మీరు సర్వజ్ఞులు అని మేము భ్రమించాలి. అర్థంగాని అస్పష్టమైన, మార్మికపదాల వెనుక ఎంతో అద్భుతమైన అర్థం నిగూఢంగా ఉందనీ, అది మీలాంటి పండితులకే అర్థమౌతుందని మేము భావించాలి!

7. "నిజానికి మీరు నన్ను హేతుబద్ధ ఆలోచన గలవానిగా తీర్చిదిద్ది వుంటే హేతువుతో తప్ప మరేదానితోనూ సంతృప్తిపడని వానిగా రూపుదిద్ది వుంటే, అదృష్ట, దురదృష్టాలదాడులకు లోనుగాకుండా వీటికతీతంగా వుండటానికి అనువైన సూత్రాలను నాకు నేర్పి వుంటే, నన్ను ఒక స్థితప్రజ్ఞునిగా తయారుచేసి వుంటే, సంపదకు పొంగిపోయేవానిగానూ, కష్టాలకు కృంగిపోయేవానిగానూ కాకుండా తయారు చేసి వుంటే, మన జీవితం గురించిన జ్ఞానం నాకిచ్చివుంటే, అసలు విషయాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు చెప్పివుంటే, ఈ విశ్వం యొక్క ఔన్నత్యం గురించి నా మనసులో ఒక భావన నింపడంలో సహాయపడి వుంటే, ఈ విశ్వంలో వున్న ఒక క్రమం, ఒక క్రమబద్ధ గమనం గురించి చెప్పివుంటే – నేను అలెగ్జాండర్ తన గురువైన అరిస్టాటిల్ పట్ల చూపిన ఆదరణ మీపట్ల చూపించేవాడిని. అంతకంటే ఎక్కువగా మీకు సహాయం చేసి వుండేవాడిని.

8. "మీరు నన్ను అనవసర పొగడ్తలతో ముంచెత్తకుండా రాజుగా నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయాలను నేర్పి వుండాల్సింది. ఒక పరిపాలకునికి ప్రజలపట్ల గల బాధ్యతలనూ, ప్రజలకు పాలకుని పట్ల గల బాధ్యతల గురించి అవగాహన నాకు నేర్పి వుండాల్సింది. ఏదో ఒకరోజు నా సోదరులతో యుద్ధం చేయడానికి కత్తి ఉపయోగించాల్సి వస్తుందని ఊహించి, ఒక పట్టణాన్ని ఎలా ముట్టడించాలి, చెల్లాచెదురయిన సైన్యాన్ని ఎలా అదుపులోకి తెచ్చుకోవాలి అన్న విషయాలు నేర్పించాల్సింది. అయితే ఇవన్నీ నేను ఇతరుల నుండి ఆ తరువాత నేర్చుకున్నాను. మీ వద్ద కాదు.

9. "కనుక మీరు యిపుడు ఉంటున్న గ్రామానికే వెళ్ళిపోండి. మీకు నేను ఎటువంటి సహాయమూ చేయను. మీరు ఎవరో, ఏమిటో ప్రజలకు తెలియకుండా ఒక సాధారణ పౌరునిగా ఎప్పటిలాగా జీవించండి."

***(ఇంగ్లీషు నుండి తెలుగు: కొత్తపల్లి రవిబాబు. జనసాహితి ప్రచురణ– ప్రజల భాషలో విద్య, పరిపాలన పుస్తకం నుండి)*** ♦



## విజయవాడలో మేధావులు, విద్యావేత్తలు, రచయితల రౌండ్‌టేబుల్ సమావేశంలో

# మాతృభాషా మాధ్యమ వేదిక ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, మాతృభాషను పరిరక్షించాలని వివిధ విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. 'మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలి' అనే అంశం పై నవంబర్ 12న విజయవాడ ఎంబి. విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిఒ 81 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 17న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానించింది. మాతృభాష ప్రాధాన్యతపై అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని, ప్రముఖ సాహితీ, సాంస్కృతిక సంస్థల మేధావులతో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టాలని తీర్మానించింది. అన్ని సంఘాలనూ కలుపుకొని 'మాతృభాషా మాధ్యమ వేదిక' పేరుతో ఉద్యమించాలని తీర్మానించింది. అందులో భాగంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అరసం నుంచి పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ విద్యావేత్త డా॥ ఎస్.ఆర్. పరిమి, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు రమేష్ బాబు వంటి ప్రముఖులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశానికి అధ్యక్షత వహించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు దీర్ఘకాల పోరాటం చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే అది మొదలు కావాలని, ప్రజలకు తెలుగు మాధ్యమంలో విద్యపై అవగాహన కల్పించాలన్నారు. ఆంగ్లమాధ్యమం పై విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకొని, వాటిపై విస్తృత చర్చ జరగాలన్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చిన్నారులకు తెలియని భాష రుద్దితే వారు చదువుకు దూరమవు తారని అన్నారు. తెలుగు భాషా ఉద్యమ సమితి నాయకులు సామల రమేష్ బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగం కోసం మాతృభాష ఆవశ్యకత ఉందన్నారు. విద్యా పరిరక్షణ వేదిక అధ్యక్షులు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ జిఒ 81ని ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు ప్రభుత్వం సరైన విద్యా విధానాన్ని తీసుకురావాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లోనూ ప్రాథమికంగా తెలుగు మాధ్యమంలోనే బోధన తప్పనిసరి చేయాలన్నారు. యుటిఎఫ్ నాయకులు సాబ్జి మాట్లాడుతూ జిఒ 81ని రద్దు చేసేవరకు అన్ని సంఘాలు కలసి ఐక్య పోరాటం చేయాలన్నారు. ఏ మాధ్యమం తీసుకోవాలనే అంశంపై విద్యార్థుల అభిప్రాయాన్ని ఓటింగ్ ద్వారా తెలుసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సూచించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎన్. వెంకట్రావు మాట్లాడుతూ ప్రయివేటుతోపాటు, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ప్రాథమిక విద్య అంతా మాతృభాషలోనే ఉండాల న్నారు. ఎపిటిఎఫ్ నాయకులు పాండురంగవరప్రసాద్ మాట్లాడుతూ అందరికీ ఒకేతరహాలో విద్యా బోధన ఉండే పాఠశాల వ్యవస్థను (కామన్ స్కూల్స్) తీసుకురావాలని సూచించారు. జన సాహితీ సంస్థ అధ్యక్షులు దివి కుమార్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విధానాలు, ప్రయివేటీకరణలో భాగంగానే ఆంగ్ల విద్యను నిర్బంధంగా రుద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మెల్‌బోర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాట్రగడ్డ అజయ్ మాట్లాడుతూ తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగు మాధ్యమంలో చదివితే ఇతర భాషలు రావనే అపోహను తల్లిదండ్రుల్లో పోగొట్టాలని అన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఆంగ్లమాధ్యమ బోధన నిర్ణయం పై న్యాయపరంగా పోరాడాలని, ప్రజావ్యాజ్యం వేయాలని సూచించారు. వికీపిడియా ప్రతినిధి రెహ్మాన్ మాట్లాడుతూ ఇంగ్లీష్ పై ఆధారపడితే భవిష్యత్తులో మానవ వనరుల స్థానంలో యంత్రాలతోనే పని చేయించుకునే పరిస్థితి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు పి. బాబురెడ్డి, ఎంబి విజ్ఞాన కేంద్రాల కార్యదర్శి పి. మురళీకృష్ణ, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్, వివిధ విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రయివేటు స్కూల్స్, సాహితీ, ప్రజా తదితర 39 సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ♦

# విజయవాడలో మాతృభాషా మాధ్యమ వేదిక ఆధ్వర్యంలో నిరసన




**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జి.వో.నె. 81ను వ్యతిరేకిస్తూ మేధావులు, రచయితలు, వివిధ సాహిత్య సంస్థల నిరసన**

మాతృభాషా మాధ్యమ వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద మేధావులు, రచయితలు, తెలుగు భాష, సాహిత్య, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు నిరసన ప్రదర్శన జరిపారు. ఇంగ్లీషు భాషను బోధించడానికి తెలుగు మాధ్యమాన్ని మొత్తంగా తీసేయటం ఏ విధంగానూ సమర్థనీయం కాదని అన్నారు. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలు రెండింటిలోనూ బోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలనేది అంతర్జాతీయంగా వివిధ ప్రామాణిక అధ్యయనాలు రుజువు పరిచాయని ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రవేటు పాఠశాలల్లో కూడా ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని కోరారు. తెలుగు భాష వికాసానికి గొడ్డలిపెట్టు లాంటి జి.వో.నెం. 81ని తక్షణం రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాతృభాషా మాధ్యమం ప్రజాస్వామిక హక్కు అని నినదించారు.

ఈ నిరసన కార్యక్రమంలో మాతృభాషా మాధ్యమ వేదిక నాయకులు సామల రమేష్‌బాబు, డా॥ పరిమి, పెనుగొండ లక్ష్మీనారాయణ, దివికుమార్, రమేష్‌పట్నాయక్, వొరప్రసాద్‌లు పాల్గొన్నారు. అలాగే శాసనమండలి సభ్యులు రాము సూర్యారావు, విజయవాడ పూర్వ శాసన సభ్యులు సుబ్బరాజు, కార్మిక నాయకులు ఓబులేషు, విజయవాడ బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య, ప్రజాసాహితి మాసపత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, విరసం ప్రతినిధి నల్లూరి రుక్మిణి, తెలుగు భాషా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సింగారావు, ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, డిటిఎఫ్ నాయకులు నరహరి, సుబ్బారావు, అరసం బాధ్యులు వల్లూరి శివప్రసాద్, కొండపల్లి మాధవరావు, శరత్, హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకటసుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నాయకులు శాంతిశ్రీ, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం బాధ్యులు బోస్, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణ, రాజు, ఇంకా వివిధ సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, తెలుగు భాషాభిమానులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జి.వో. నెం. 81 రద్దు చేయాలని, ప్రాథమిక విద్యలో మాతృభాషా మాధ్యమాన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో తప్పనిసరి చేయాలని, తదితర నిర్దిష్టమైన డిమాండ్లతో మాతృభాషా మాధ్యమ వేదిక త్వరలోనే సమావేశమై కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని సామల రమేష్‌బాబు తెలిపారు. ఈ యొక్క కార్యాచరణ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలలో వివిధ సంస్థలు, మేధావులు కలిసి ఐక్యంగా మాతృభాషా మాధ్యమ వేదిక నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ♦

## ప్రభుత్వ ఆలోచనలు అశాస్త్రీయం



తెలుగు వారిగా మాతృభాష ఉనికిని కాపాడుకోవడం మన కర్తవ్యమని, ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు అశాస్త్రీయమని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత, వార్తా విశ్లేషకులు తెలకపల్లి రవి పేర్కొన్నారు. నవంబర్ 21న అనంతపురంలోని స్థానిక ఎన్జీవో హోంలో సాహితీ స్రవంతి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రాథమిక విద్య– బోధనా మాధ్యమం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. విశ్వం విజ్ఞాన కేంద్రం కో– కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్య, బోధన ఇంగ్లీష్ మాధ్యమంలో తీసుకొస్తున్న సమీకరణాలు తెలుగు ప్రజల గుండెచప్పుడును సంక్లిష్టంలోకి నెట్టిందని అన్నారు. తెలుగును పటిష్ట పరచాల్సిన ప్రభుత్వం విచిత్ర ఆలోచనలు చేస్తోందన్నారు. మాతృభాష లోని పట్టు పరభాషలో రాదన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండాలని ప్రపంచ దేశాలు కూడా చెబుతున్నాయని అన్నారు. ఈ అంశం వ్యక్తిగతం కాదని, వ్యక్తిగత దూషణలు కూడా సరికాదన్నారు. పరభాషపై పట్టుకు అనేక మార్గాలు ఉన్నాయని, కానీ ప్రాథమిక విద్యకు అంటగట్టడం దారుణమన్నారు. ఇంగ్లీష్ మీడియం వద్దని ఎవ్వరూ చెప్పటం లేదని, అయితే ప్రభుత్వం తెలుగు మీడియం తీసి వేయవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. 32 శాతం తెలుగు భాష ప్రాచుర్యం తగ్గితే ప్రమాదమని అన్నారు. భవిష్యత్తులో తెలుగు అకాడమీ కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. నిరక్షరాస్యతకు అశాస్త్రీయ ఆలోచనలు కారణమని, ఆంగ్లం వచ్చి 40 ఏళ్లు అయినా మరి ఎందుకు అభివృద్ధి జరగలేదని అన్నారు. ఆంగ్లం మత్తులో మాతృభాషను అశ్రద్ధ చేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ శ్రీనివాసరావు, రచయిత పొత్తూరి హరికృష్ణ, సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, జిల్లా కార్యదర్శి యమున, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**కర్నూల్‌లో...**

కర్నూల్‌లోని ఎంపిపి హాలులో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 22న జరిగిన ఇష్టాగోష్టిలో తెలకపల్లి రవి మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో మాతృభాష ఉండాలన్నారు. భాషను ప్రజాస్వామీకరించాలని, ఆంగ్ల మాధ్యమాన్ని పెట్టినంత మాత్రాన ఆంగ్లం రాదన్నారు. ఆంగ్ల భాషలో నైపుణ్యాలను విధిగా నేర్పించాలన్నారు. ఆంగ్ల మాధ్యమానికి ఆంగ్లం పట్టుబడడానికి సంబంధం లేదన్నారు. భాషావేత్తలు మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధన ఉండాలని చెబుతుంటే విస్మరించడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ప్రస్థానం సంపాదకవర్గ సభ్యులు కెంగార మోహన్, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఎస్.డి.వి. అజీజ్, గుంపుల వెంకటేశ్వర్లు, పెరికల రంగస్వామి, సయ్యద్ జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ♦

## మాతృభాషా మాధ్యమ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో డిసెంబర్ 11న సత్యాగ్రహం

విజయవాడలోని పిడిఎఫ్ కార్యాలయంలో నవంబర్ 19న మాతృభాషా మాధ్యమ వేదిక స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఓ ప్రకటన విడుదల చేసారు. స్టీరింగ్ కమిటీ సమావేశం అన్ని జిల్లాల్లోనూ మాతృభాష మాధ్యమ వేదికలు ఏర్పాటు చేయాలని, డిసెంబర్ 11న విజయవాడలో ధర్నాచౌక్ దగ్గర మేధావులు, రచయితలు, విద్యారంగ ప్రముఖులతో పెద్ద ఎత్తున ఒకరోజు సత్యాగ్రహం నిర్వహించాలని తీర్మానించింది. పాఠశాల స్థాయి వరకు శాస్త్రీయ విద్యావిధానంపై ప్రచారం నిర్వహిస్తామని, దీర్ఘకాలిక విస్తృత ఉద్యమానికి సిద్ధం కానున్నామని ప్రకటించింది. జి.వో 81కి వ్యతిరేకంగా విద్యావేత్తలు, సాహితీప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారని, పలు కోణాల్లో విస్తృతంగా చర్చలు జరగడం హర్షణీయమని పేర్కొన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా విఠపు బాలసుబ్రహ్మణ్యం, సామల రమేష్‌బాబు, రమేష్ పట్నాయక్, యస్.ఆర్. పరిమి, పెనుగొండ లక్ష్మీనారాయణ, దివికుమార్, వౌరప్రసాద్ ఉన్నారు. ♦

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గరిమెళ్ళ సత్యనారాయణ

## 14.7.1893 - 18.12.1952



'మాకొద్దీ తెల్ల దొరతనం', పాట ద్వారా ప్రసిద్ధులు. 'అన్యాయ కాలంబు దాపురించిందిపుడు' అనే గేయం సోషలిస్టు ప్రభవాలతో రాసిన యువ కవి అని అనుకునే వారు. అనేక శిక్షలు అనుభవించారు. అజ్ఞాతంగా 1952లో మరణించారు.

SAHITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 28.11.2019


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




పోతులూరి వీరబ్రహ్మంపై సామాజిక దృష్టితో పరిశోధన చేసి వెలువరిస్తున్న ప్రామాణిక రచనలు. సాహిత్య ప్రస్థానం పాఠకులకు ప్రత్యేక తగ్గింపు కలదు.

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002, ఫోన్: 0866 - 2577533

బ్రాంచీలు: విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059